# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - గురువారం 7 మే 2026 | సంపుటి: 10 | సంచిక: 122 | పేజీలు: 8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


## రెవెన్యూ రికార్డులు పన్నుల వసూలుకే..



2

## మెట్ గాలాలో తళుక్కుమన్న మేఘా సుధారెడ్డి

**ఆమె మెడలో రూ. 142 కోట్ల డైమండ్ నెక్లెస్?**



హైదరాబాద్,మే 6(మనం న్యూస్): ఫోర్బ్స్ ప్రపంచ సంపన్నుల జాబితాలోకి ఎక్కిన మేఘాకృష్ణారెడ్డి భార్య మేఘా సుధారెడ్డి మంగళవారం న్యూయార్క్ లో జరిగిన 2026 మెట్ గాలాలో సందడి చేశారు. ప్రత్యేకమైన డ్రెస్ లో ర్యాంప్ వాక్ చేస్తూ తన లుక్‌తో

...మిగతా 2లో

## ఏపీకి మరో దిగ్గజ ఎయిర్ కండిషనర్ తయారీ సంస్థ క్యారియర్

### శ్రీసిటీలో క్యారియర్ ఏసీ పరిశ్రమకు శంకుస్థాపన చేసిన మంత్రి లోకేష్

### రూ.వెయ్యి కోట్ల పెట్టుబడి, 3వేల ఉద్యోగాల కల్పన



**శ్రీసిటీ, మే 06 మనం న్యూస్:** ఏపీకి అంతర్జాతీయ పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం శ్రీసిటీ పారిశ్రామికవాడలో బుధవారం ఉదయం అమెరికాకు చెందిన దిగ్గజ ఎయిర్ కండిషనర్ తయారీ సంస్థ క్యారియర్ ఏసీ తయారీ యూనిట్ కు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. ముందుగా వేదిక ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు సంస్థ ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. అనంతరం క్యారియర్ గ్లోబల్ కార్పోరేషన్ ఛైర్మన్, సీఈవో డేవిడ్ ఎల్ గిట్లిన్ తో కలిసి మంత్రి లోకేష్ క్యారియర్ ఏసీ తయారీ పరిశ్రమకు భూమిపూజ చేశారు. అనంతరం సంస్థ ప్రతినిధులతో కలిసి గ్రూప్ ఫోటో దిగారు. దేశంలో క్యారియర్ సంస్థ కార్యకలాపాలు

...మిగతా 2లో

# రైతన్నకు చంద్రన్న బాసట!

ఏపీలో సాగువుతున్న ధాన్యం, అరటి, పొగాకు, ఆయిల్ పామ్ వంటి పంటలకు మార్కెట్ డిమాండ్కు అనుగుణంగా గిట్టుబాటు ధర కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన సీఎం, రైతన్నకు కూటమి ప్రభుత్వం బాసటగా నిలుస్తుందన్నారు.



### గిట్టుబాటు ధర దక్కాల్సిందే.. విత్తనాలు వేగం ఇవ్వాల్సిందే..

### అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

**(అమరావతి, పి.మీరాహుస్సేన్, మనం న్యూస్ ప్రత్యేక ప్రతినిధి):** రైతన్నకు బాసటగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ఏడాది మే 15 నుంచే రైతులకు సాగునీరు అందించనున్న దృష్ట్యా రాష్ట్రంలో వేగంగా విత్తన సరఫరా చేయాలని వ్యవసాయ శాఖకు దిశానిర్దేశం చేశారు. విత్తనాల సరఫరా కోసం రూ.200 కోట్లు కేటాయించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. సచివాలయంలో బుధవారం రాష్ట్రంలో ధాన్యం, అరటి, పొగాకు, ఆయిల్ పామ్ తదితర పంటల కొనుగోళ్లపై సీఎం వ్యవసాయ, ఉద్యాన శాఖలతో సమీక్ష నిర్వహించారు.ఈ సమీక్షకు మంత్రి కె.అచ్చెన్నాయుడు, వ్యవసాయ, ఉద్యాన శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా రైతులు పండించే పంటలకు ధరలు దక్కేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్ ద్వారా పంటలకు మెరుగైన ధర లభించే అవకాశం ఉంటుందని

...మిగతా 2లో

## త్వరలో 'అక్షర గోవిందం'

- అలిపిరి వద్ద శాశ్వత యాగశాల
- విద్య, వైద్య సేవల విస్తరణ
- ధూప, దీప, నైవేద్యాలకు రూ. 5 వేల నుండి రూ.10 వేలకు పెంపు
- టీటీడీ ఛైర్మన్ శ్రీ బీ ఆర్ నాయుడు

2



## కౌన్ బనేగా బెంగాల్ సీఎం?

### రేసులో పలువురు కొత్తవారు

### నేటి సాయంత్రం ఎన్డీయే ఎల్పీ సమావేశం

2

### కొత్త సీఎం ప్రమాణ స్వీకార ముహూర్తం మాత్రం 9నే!



## డేటా సెంటర్ పరికరాల తయారీలో దేశం అగ్రగామిగా నిలవాలి



- ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయం
- గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ గా శ్రీసిటీ
- క్యారియర్ రాక ఏపీ, చంద్రబాబు విజన్ పట్ల నమ్మకానికి నిదర్శనం
- ఇండియాస్ కూల్ క్యాపిటల్ గా ఏపీ గుర్తింపు పొందింది
- 2027 నాటికి ఏసీల ఉత్పత్తిలో 60శాతం ఏపీ నుంచే
- 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీని తీర్చిదిద్దుతాం
- విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్

**తిరుపతి/శ్రీసిటీ మే 6 మనం న్యూస్:** డేటా సెంటర్ల ఏర్పాటు కేవలం ప్రారంభం మాత్రమేనని.. డేటా సెంటర్ పరికరాల తయారీలో దేశం అగ్రగామిగా నిలవాల్సిన అవసరం ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం శ్రీసిటీ పారిశ్రామిక పార్క్ లో క్యారియర్స్ ఎయిర్ కండిషనింగ్ అండ్ రిఫ్రిజిరేషన్ యూనిట్ కు శంకస్థాపన అనంతరం మంత్రి మాట్లాడుతూ.. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న శ్రీసిటీ పారిశ్రామికవాడలో ఈ చరిత్రాత్మక సందర్భంగా మీ ముందుకు రావడం గౌరవంగా ఉంది. ఈ రోజ మనం కేవలం ఒక ప్రాజెక్ట్ ను ప్రారంభించడమే కాదు.. భారతదేశ డిజిటల్, ఏఐ అభివృద్ధిని ఆవిష్కరిస్తున్నాం. ముందుగా క్యారియర్ గ్లోబల్ సంస్థ నాయకత్వానికి, ఛైర్మన్, సీఈవో డేవిడ్ ఎల్ గిట్లిన్ కు హృదయపూర్వక స్వాగతం తెలియజేస్తున్నా. క్యారియర్ అనేది కేవలం ఒక కంపెనీ మాత్రమే కాదు... ప్రపంచంలో కూలింగ్ రంగంలో విప్లవాత్మక మార్పును తీసుకువచ్చిన సంస్థ. ఆధునిక ఎయిర్ కండిషనింగ్ ను

...మిగతా 2లో

## పోప్‌తో ట్రంప్ 'కజ్జాలు'


**ఇరాన్‌కు సాయం చేస్తున్నార్నని ఆరోపణ**



2

## మే 6.. దేశ చరిత్రకు 'సిందూర్' అద్దిన రోజు

'ఆపరేషన్'తో శక్తియుక్తులను ప్రపంచానికి చాటి చెప్పిన భారత్




2

## జంతు బలులను ఆపేద్దాం...

### సీఎంకు మేనకగాంధీ లేఖ



**విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధిః** తిరుపతి లాంటి పవిత్ర పుణ్యక్షేత్రంలో గంగమ్మ జాతర సందర్భంగా వేలాది మూగజీవాలను బలి ఇవ్వడంపై జంతు ప్రేమికులు ఆందోళన చెందడం సహజం. కేంద్ర మాజీ మంత్రి మేనకా గాంధీ ఈ విషయంలో నేరుగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాయడం దేశ వ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారింది. శాంతికి, కరుణకు నిలయమైన మన సంస్కృతిలో హింసకు తావుండకూడదనే ఆమె వాదనపై ఇప్పుడు భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

**మారణకాండ ఆపండి...**

ఈ నెల 18, 19 తేదీల్లో జరగనున్న తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా వేలాది జంతువులను బలి ఇవ్వనున్నారని సమాచారం ఉందని మేనకా గాంధీ పేర్కొన్నారు. భక్తి పేరుతో జరుగుతున్న ఈ చర్యలను ఆమె 'సామూహిక మారణకాండ'గా అభివర్ణించారు. 'జాతర పేరుతో

...మిగతా 2లో



## వలసదారులపై ట్రంప్ ఆంక్షలు వ్యక్తిగతమే

### సర్వేలో వెల్లడించిన అమెరికన్లు

**వాషింగ్టన్, మే 6 :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దేశంలోకి వస్తున్న వలసలపై ఉక్కుపాదం మోపుతూ.. కఠినమైన నిర్ణయాలు తీసుకున్న విషయం పాఠకులకు విదితమే. ట్రంప్ వలస విధానాలపై చాలామంది అమెరికన్లు అసంతృప్తితో

...మిగతా 2లో

**అందినట్టే అందిన సీఎం పీఠం**

## విజయ్ నేటి ప్రమాణ స్వీకారం రద్దు?

### అసక్తి రేపుతున్న తమిళనాడు రాజకీయాలు

### మలుపులు.. ట్విస్టులతో పార్టీల పాకులాట



**చెన్నై, మే 6 :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం ఆ రాష్ట్ర రాజకీయాలు అనూహ్య మలుపులు తిరుగుతున్నాయి. ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణ స్వీకారం నేడు జరుగుతుందని అందరూ భావించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఆ కార్యక్రమం వాయిదా పడింది. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన స్పష్టమైన మెజారిటీ 118 ఎమ్మెల్యేల మద్దతును నిరూపించుకోవడంలో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందుల వల్ల ఈ

...మిగతా 2లో

## అమెరికా నౌకలపైకి డాల్ఫిన్లు ప్రయోగించనున్న ఇరాన్

### ఆందోళనలో అమెరికా సైన్యం



**టెహ్రాన్, మే 6 :** అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది. హర్మూజ్ జలసంధిలో చిక్కుకుపోయిన వాణిజ్య నౌకలను సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు తమ యుద్ధనౌకలు జలసంధిలోకి వెళతాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ క్రమంలో అగ్రరాజ్య యుద్ధ నౌకల పైకి మైన్లను మోసుకెళ్లే డాల్ఫిన్లను ప్రయోగించే అవకాశాన్ని పరిశీలిస్తున్నామని ఇరాన్ అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రకటన ప్రపంచ దేశాలను ఆశ్చర్యానికి గురిచేసింది. చివరకు దానిపై అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ స్పందించాల్సి వచ్చింది. అమెరికా వద్ద కామికాజి డాల్ఫిన్లు (ఆత్మాహుతి డాల్ఫిన్లు) ఉన్నాయా..? లేదా..? అనే అంశాన్ని తాను కచ్చితంగా చెప్పలేనని హెగ్సెత్ వెల్లడించారు. అయితే, ఇరాన్ వద్ద మాత్రం అలాంటివి ఏవీ లేవని చెప్పారు. మరోవైపు ఛైర్మన్ ఆఫ్ జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ జనరల్ డాన్ కెయిన్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ కథనాలను తోసిపుచ్చారు. ప్రతిధ్వనుల సాయంతో నీటి అడుగున వస్తువుల జాడను (సోనార్) డాల్ఫిన్లు స్పష్టంగా గుర్తించగలవు. ఈ సహజ లక్షణం కారణంగా శత్రువులు నీటి అడుగున దాడికి వినియోగించే వస్తువులు ఏమైనా పెట్టి ఉంటే వాటిని వెంటనే పసిగట్టగవు. డాల్ఫిన్‌లకు ఇటువంటి వాటిపై శిక్షణ ఇవ్వడమే కాకుండా ప్రత్యేకంగా రూపొందించిన పరికరాలు, కెమెరాలను అమర్చి సముద్రం అడుగున పరిస్థితులను పర్యవేక్షించవచ్చు. తద్వారా శత్రువుల కదలికలను ముందుగానే గుర్తించే ఆస్కారం ఉంటుంది. శత్రుదేశాల జలాంతర్గాములను గుర్తించే సామర్థ్యాన్ని కలిగిన డాల్ఫిన్లను సోవియట్ యూనియన్ నుంచి ఇరాన్ కొనుగోలు చేసినట్లు గతంలో ప్రచారం జరిగింది. ప్రపంచ రవాణాకు కీలకమైన హర్మూజ్లో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న ఈ సమయంలో ఈ డాల్ఫిన్ల ఉదంతం అంశం మళ్లీ తెరపైకి వచ్చింది.

# వలసదారులపై ట్రంప్ ఆంక్షలు వ్యక్తిగతమే

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నారు. ఆయన చేపట్టిన వలస విధానాలు వ్యక్తిగతమేనని వారు భావిస్తున్నారు. ఒకప్పుడు వలసదారులకు గొప్పదేశంగా ఉన్న అగ్రరాజ్యం ఇకపై ఆ విధంగా ఉండబోదని భావిస్తున్నారు. అక్రమ వలసల పేరుతో ట్రంప్ తీసుకుంటున్న కఠిన చర్యలు చాలా దూరం వెళ్లాయని వారు అభిప్రాయపడుతున్నారు. అమెరికాలో ఏపీ-ఎన్ఓఆర్సీ ఇటీవల నిర్వహించిన పోల్లో ఈ విషయం వెల్లడైంది.

ట్రంప్ చర్యల వల్ల తమకు తెలిసిన ఎందరో వలసదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు అమెరికన్లు పేర్కొన్నారు. ఇంటి నుంచి బయటకు రావడానికి కూడా వారు భయపడుతున్నారని తెలిపారు. భవిష్యత్తులో అమెరికా తిరిగి వలసవాదులను ఆదరించినా.. ట్రంప్ విధానాల వల్ల దేశానికి కలిగిన నష్టాన్ని పూడ్చడానికి చాలా ఏళ్లు పట్టే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వలసలకు వ్యతిరేకంగా రూపొందించిన విధానాల్లో భాగంగా నైపుణ్యం గల విదేశీయులను తిరిగి వారి స్వదేశాలకు పంపుతున్నారని.. దీనివల్ల దేశాభివృద్ధి నెమ్మదించే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. మరోవైపు అమెరికాలోని వలసదారుల సంతానానికి దేశ పౌరసత్వం ఇవ్వకూడదనే ట్రంప్ నిర్ణయాన్ని కొందరు వ్యతిరేకిస్తుండగా.. మరికొందరు మాత్రం సమర్థిస్తున్నారు.

# కౌన్ బనేగా బెంగాల్ సీఎం?

**కోల్‌కతా, మే 6 :** పశ్చిమ బెంగాల్లో ఓటర్లు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. దీంతో భారతీయ జనతా పార్టీ కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహకాలు చేస్తుంది. 9వ తేదీన కొత్త ప్రభుత్వం కొలువుదీరుతుందని ప్రకటనలు వెలువడ్డాయి. అయితే, ముఖ్యమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపట్టనున్నారనే అంశంపైనే ఆసక్తి నెలకొంది. పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. వారిలో ఒకరిని ఎంపిక చేసేందుకు ఆ పార్టీ అగ్ర నాయకత్వం రాష్ట్రానికి చెందిన కీలక నేతలతో వరుసగా చర్చలు జరుపుతోంది. అయితే పశ్చిమ బెంగాల్ రాజకీయాలకు సంబంధించిన కీలక పరిణామం చోటు చేసుకుంది. 9వ తేదీ (శనివారం) ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందని ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య బుధవారం కోల్‌కతాలో ప్రకటించారు. ఉదయం10 గంటలకు మహానగరంలోని ప్రతిష్టాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు.

గురువారం సాయంత్రం కోల్‌కతాలో శాసనసభా పక్ష సమావేశం జరుగుతుందని సమీక్ భట్టాచార్య తెలిపారు. ఈ సమావేశంలో శాసనసభా పక్ష నేతను పార్టీ ఎమ్మెల్యేలు అంతా కలిసి ఎన్నుకుంటారని చెప్పారు. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, పలువురు కేంద్రం మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎన్డీయే నాయకులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ సీనియర్ నేతలతోపాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరవుతారని పార్టీ నేతలు చెబుతున్నారు. పశ్చిమ బెంగాల్లో కొత్తగా కొలువుదీరనున్న మంత్రి వర్గంలో దాదాపు 24 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర నాయకత్వం చెబుతుంది. మరోవైపు ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఏర్పాట్లపై ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించారు.

# మే 6.. దేశ చరిత్రకు ‘సిందూర్’ అద్దిన రోజు

**ఢిల్లీ, మే 6 :** మే 6.. తెల్లవారితే 7..2025 అర్ధరాత్రి.. పాకిస్తాన్ పై భారత్ ‘ఆపరేషన్ సిందూర్’తో విరుచుకుపడింది. కశ్మీర్లోని పహల్గాంలో అమాయక టూరిస్టులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులు, టెర్రరిస్టు తండాలను క్షిపణులతో తుదముట్టించింది. ఈ దాడితో భారత సైనిక సామర్థ్యం ఏంటో ప్రపంచానికి చాటిచెప్పడం మాత్రమే కాదు.. దేశ భద్రత విషయంలో మన నియమాలను పునర్నిర్వచించుకున్నామని, పరిమితులు/హద్దులు మార్చుకున్నామనే శత్రువుకు గట్టి సందేశమిచ్చింది.

**88 గంటలు భయపెట్టి..**

2025 ఏప్రిల్ 22న పహల్గాంలోని పర్యాటక ప్రాంతంపై విరుచుకుపడిన ముష్కరులు 26 మంది అమాయకులను పొట్టన పెట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనతో యావత్ దేశం దిగ్భ్రాంతికి గురైంది. ఈ దాడి వెనుక పాక్ కేంద్రంగా పనిచేస్తోన్న ఉగ్రముఠాల హస్తం ఉందని నిర్ధరించుకున్న భారత సైన్యం.. సమయం చూసి దాయాదిపై నిప్పులు కురిపించింది. మే 6-7 తేదీ అర్ధరాత్రి పాకిస్థాన్ భూభాగంలోని ఉగ్ర స్థావరాలపై మెరుపు దాడులు జరిపింది. పాక్, పీఓకేలోని 9 కీలక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని బాంబులు ప్రయోగించింది. జైషే మహ్మద్, లష్కరే తయ్యిబాకు చెందిన కీలక స్థావరాలను మట్టికరిపించి భారీ విజయం సాధించింది. ఈ ఘటనతో దాయాది పాకిస్తాన్ ఉలిక్కిపడింది. ఆ తర్వాత ప్రతిదాడులకు పాల్పడింది. వాటిని మన సైన్యం సమర్థంగా తిప్పికొట్టడమే గాక.. పాక్కు చెందిన కీలక వైమానిక స్థావరాలపైనా కోలుకోలేని దెబ్బకొట్టింది. దాదాపు 88 గంటల భీకర ఆపరేషన్ తో శత్రుదేశం కాళ్లబేరానికి రాకతప్పలేదు. దీంతో మే 10వ తేదీ సాయంత్రం ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందంతో ‘ఆపరేషన్ సిందూర్’ నిలిచింది.

**సంయమనం కాదు.. సమరమే..**

ఉగ్రవాదంపై పోరాటం విషయంలో భారత్ తమ హద్దులను పునర్నిర్వచించుకున్నట్లయ్యింది. వ్యూహాత్మక సంయమనం కాదు.. అవసరమైతే సమరమే అని మన దేశం చాటిచెప్పింది. ప్రత్యర్థి అణు బెదిరింపులను తిప్పికొట్టగలమని, భవిష్యత్తులో ఇలాంటి ముప్పులు ఎదురైతే అత్యంత వేగంగా స్పందించగలమని నిరూపించింది.

**‘సిందూర్’ నేర్పిన పాఠాలు..**

మన సైనిక దళాల సంయుక్త కృషితో ‘ఆపరేషన్ సిందూర్’లో భారత్ అద్భుతమైన విజయం సాధించిన సంగతి తెలిసిందే. అయితే, భవిష్యత్తులో యుద్ధాలు కేవలం గగనతలానికి మాత్రమే పరిమితం కావని ఈ మిలిటరీ ఆపరేషన్ తో స్పష్టమైందని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు.

సైబర్ వార్ ఫేర్ తో పాటు విభిన్న వ్యూహాలపై మనం దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. ‘సిందూర్’ సమయంలో శత్రుదేశం నుంచి ముంచుకొచ్చిన డ్రోన్లను మనం సమర్థంగా ఎదుర్కొన్నాం. అదే సమయంలో సామాజిక మాధ్యమాల్లో విపరీతమైన అసత్య ప్రచారాన్ని కూడా ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇలాంటి తప్పుడు సమాచారాల వ్యాప్తితో బలగాలతో పాటు దేశ పౌరుల ఆత్మస్థైర్యం దెబ్బతినే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరించారు.

**శత్రువు స్మార్ట్ అయితే..**

‘‘సిందూర్ వేళ పాకిస్థాన్ కుప్పలుతెప్పలుగా డ్రోన్లను ప్రయోగించింది. వాటన్నింటిని మనం నేలకూల్చాం. కానీ, ప్రతిసారీ ఇలాగే జరగకపోవచ్చు. శత్రువు స్మార్ట్ అయితే.. మరోసారి ప్రమాదకర డ్రోన్లను ప్రయోగించే ప్రమాదం ఉంది. అలాంటి వాటిని గుర్తించి అడ్డుకోవడం కష్టతరం కావొచ్చు. అందుకే యాంటీ డ్రోన్ సామర్థ్యాలను మరింత పెంచుకోవాల్సిన అవసరం ఉంది’’ అని ఎయిర్ కమాండర్ గౌరవ్ ఎం. త్రిపాఠి (రిటైర్డ్) పేర్కొన్నారు. ఈ ఆపరేషన్లో కమాండర్ త్రిపాఠి కీలక పాత్ర పోషించారు.

# పోప్‌తో ట్రంప్ ‘కజ్జాలు’

**వాషింగ్టన్, మే 6 :** వలసదారులను అగౌరవపరచకూడదనే తన వ్యాఖ్యల ద్వారా పోప్ లియో ఇరాన్కు సాయం చేస్తున్నారని, ప్రపంచాన్ని అభద్రతలోకి నెట్టేస్తున్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శించారు. ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండటం సబబేనని పోప్ అంటున్నారని, అది అంత మంచిది కాదని, ఆయన క్యాథలిక్కులను ప్రమాదంలో పడేస్తున్నారని స్పష్టం చేశారు. సోమవారం ఓ ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పోప్, ట్రంప్ మధ్య తలెత్తిన ఘర్షణను నివారించేందుకు విదేశాంగ మంత్రి మార్కో రుబియో ఇటీవల వాటికన్ను సందర్శించిన నేపథ్యంలో ట్రంప్ మరోసారి విమర్శలు చేయడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది.

# రైతన్నకు చంద్రన్న బాసట!

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రైతుకు లాభసాటిగా ఉండేలా నాణ్యమైన పంట దిగుబడులు వచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. మరిన్ని పంటలను ప్రకృతి సేద్యం విధానంలో వివిధ పంటలను సాగు చేస్తే రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందన్నారు. సేంద్రీయ సాగుకు కంపోస్టు ఎరువును సరఫరా చేసేలా చూడాలన్నారు. ఈ ఏడాది 42.06 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంట ఉత్పత్తి వస్తుందని అధికారులు వివరించారు. మొక్కజొన్న సహా ఇతర పంటల ద్వారా ఇథనాల్ తయారీకి ఉన్న అవకాశాలను అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచనలు చేశారు. మామిడిని ప్రాసెసింగ్ యూనిట్లు కొనుగోలు చేసేలా చూడాలని అన్నారు. అరటి, ఆయిల్ పామ్, మిర్చి, కోకో లాంటి పంటలకు సంబంధించి ధరల సమస్య లేదని రైతులకు మంచి ధర లభిస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. సీజన్ కంటే ముందే రాష్ట్రంలోని నీటి వనరుల్లో ఫిష్ సీడ్ ను సరఫరా చేయాలని సీఎం స్పష్టం చేశారు. వచ్చే పంట సీజన్ కు 7.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు. నాఫెడ్ నుంచి మినుములు ఇతర వాణిజ్య పంటల్ని కొనుగోలు చేస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్యమంత్రికి వివరించారు. పీఎండీఎస్ పథకం ద్వారా తక్కువ యూరియా వినియోగానికి ఇచ్చే ప్రోత్సాహకం పై కేంద్రంతో మాట్లాడాలని సీఎం వారికి సూచించారు. మదనపల్లె లో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు కానుందని సీఎం అన్నారు.

# జంతు బలులను ఆపేద్దాం..

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్న ఈ ఘటనలు దేశం మొత్తం గమనిస్తోందని.. ఇది మన సంస్కృతికి మచ్చ‘ అంటూ ఆమె లేఖలో తీవ్రంగా స్పందించారు. జంతువులపై క్రూరత్వాన్ని నిరోధించే చట్టాలు దేశంలో ఇప్పటికే అమలులో ఉన్నాయని ఆమె గుర్తు చేశారు.అయితే కొన్ని ప్రాంతాల్లో ఈ చట్టాలు కఠినంగా అమలు కాకపోవడం వల్ల ఇలాంటి ఘటనలు కొనసాగుతున్నాయని ఆమె విమర్శించారు. కర్ణాటక, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో జంతుబలులను నిషేధిస్తూ, కొబ్బరికాయలు వంటి ప్రత్యామ్నాయాలను ప్రోత్సహిస్తున్నారని ఉదాహరణలు చూపించారు. చట్టాలు ఉన్నా అమలు లేకపోతే ప్రయోజనం ఏమిటి?‘ అనే ప్రశ్నను ఆమె లేవనెత్తారు. జంతుబలులు కేవలం జంతువుల ప్రాణాలకే కాదు, సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతాయని మేనకా గాంధీ హెచ్చరించారు. మరోవైపు జాతరల సమయంలో మద్యం సేవించి వచ్చే కొందరు భక్తులు హింసాత్మకంగా ప్రవర్తించే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు చిన్నపిల్లలు, యువతపై చెడు ప్రభావం చూపి, హింసను సహజంగా భావించే పరిస్థితి తీసుకువస్తాయని అన్నారు. సంస్కృతి పేరుతో హింసను ప్రోత్సహించడం ప్రమాదకరం‘ అని ఆమె స్పష్టం చేశారు. ఏ కారణం లేకుండా వేలాది మూగజీవాలను చంపడం అమానుషం అంటూ మేనకా గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. భారతీయ సంస్కృతిలో జంతువులకు ప్రత్యేక స్థానం ఉందని, కరుణ, దయ మన సంప్రదాయాల మూలమని గుర్తు చేశారు. అలాంటి విలువలను విస్మరించి బలులు ఇవ్వడం సరైంది కాదని ఆమె అభిప్రాయపడ్డారు. జంతువులు కూడా బాధను అనుభవించే జీవులేనని, వాటి ప్రాణాలను కాపాడడం మన బాధ్యత అని ఆమె అన్నారు. జంతుబలులకు బదులుగా కొబ్బరికాయలు, పండ్లు, పుష్పాలు వంటి ప్రతీకాత్మక సమర్పణలను ప్రోత్సహించాలని మేనకా గాంధీ సూచించారు. ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి, భక్తుల్లో అవగాహన కల్పిస్తే ఈ మార్పు సాధ్యమవుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా అనేక ఆలయాలు ఇలాంటి మార్పులను విజయవంతంగా అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు. వైద్యులు, విద్యావేత్తలు, యువత కూడా ఈ బలులను ఆపాలని కోరుతూ తనకు లేఖలు రాశారని ఆమె గుర్తుచేశారు. ముందుచూపు ఉన్న నాయకుడిగా సీఎం చంద్రబాబు ఈ అంశంపై జోక్యం చేసుకుని చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవాలని మేనకా గాంధీ కోరారు. ఈ నిర్ణయం దేశానికి ఆదర్శంగా నిలవొచ్చు అని ఆమె పేర్కొన్నారు.

# ఏపీకి మరో దిగ్గజ ఎయిర్ కండిషనర్ తయారీ సంస్థ క్యారియర్

(మొదటి పేజీ తరువాయి)

ఐదు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్నాయి. హర్యానాలోని గుర్ గ్రామ్ లో తయారీ యూనిట్, హైదరాబాద్ లో గ్లోబల్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ను ఈ సంస్థ కలిగి ఉంది. ఏసీ తయారీరంగంలో పేరుగాంచిన క్యారియర్ గ్లోబల్.. రూ.వెయ్యి కోట్ల పెట్టుబడితో శ్రీసిటీలో అత్యాధునిక తయారీ యూనిట్ ను స్థాపించనుంది. ఈ ప్లాంట్ హెచ్ వీ ఏసీ(హెచ్ వీఏసి), సంబంధిత ఉత్పత్తులపై పెరుగుతున్న డిమాండ్ ను తీర్చడమే కాకుండా.. కార్యకలాపాల సామర్థ్యాన్ని, విస్తృతిని పెంచనుంది. శ్రీసిటీ పరిధిలోని ఆరూరు వద్ద ఈ పరిశ్రమకు 39 ఎకరాలను ప్రజాప్రభుత్వం కేటాయించింది. ఈ కార్యక్రమంలో క్యారియర్ గ్లోబల్ కార్పొరేషన్ క్లైమేట్ సొల్యూషన్స్ ఏసియా పసిఫిక్, మిడిల్ ఈస్ట్ అండ్ ఆఫ్రికా ప్రెసిడెంట్ మేకేల్ ఎల్.గియర్టెస్, క్యారియర్ ఎయిర్ కండిషనింగ్ అండ్ రిఫ్రిజిరేషన్ లిమిటెడ్(క్యారియర్ ఇండియా) మేనేజింగ్ డైరెక్టర్ సుందరేశన్ నారాయణన్, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జేసి ఆర్. గోవిందరావు, క్యారియర్ గ్లోబల్ కార్పొరేషన్ ఆపరేషన్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మైక్ డుయిజర్, చీఫ్ పీపుల్ అండ్ కమ్యూనికేషన్స్ ఆఫీసర్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నడియా విల్లెనెవ్, శ్రీసిటీ కో-ఫౌండర్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విజయ్ నేటి ప్రమాణ స్వీకారం రద్దు?

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది

**రిసార్టు రాజకీయాల వేదికగా మహాబలిపురం**

గెలిచిన తమ ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు టీవీకే అధిష్ఠానం 'రిసార్ట్ పాలిటిక్స్'కు తెరలేపింది. గెలిచిన 108 మంది ఎమ్మెల్యేలందరూ తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు మహాబలిపురం సమీపంలోని ఒక ప్రైవేట్ రిసార్టులోనే ఉండాలని పార్టీ అధిష్ఠానం కఠిన ఆదేశాలు జారీ చేసింది. ఇతర పార్టీల నుంచి ప్రలోభాలు రాకుండా ఉండేందుకే విజయ్ ఈ జాగ్రత్తలు తీసుకున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. విజయ్ పార్టీకి కాంగ్రెస్ 5 సీట్లు మద్దతు ప్రకటించినప్పటికీ, ఇంకా 5 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరమవుతోంది. ఈ క్రమంలో మద్దతు కోసం వామపక్షాలను విజయ్ కోరగా, వారు ప్రస్తుతానికి నిరాకరిస్తూ డీఎంకే కూటమిలోనే కొనసాగుతామని ప్రకటించారు. ఈ నేపథ్య ంలో బలాన్ని నిరూపించుకునేందుకు విజయ్ గవర్నర్ను రెండు వారాల సమయం కోరిన విషయం తెలిసిందే

**పెద్ద సవాల్ గా చిన్న అడ్డంకులు**

మరోవైపు, టీవీకే ఎమ్మెల్యేలందరూ రిసార్టులోనే ఉండి తదుపరి వ్యూహంపై చర్చిస్తున్నారు. అటు ఏఐడీఎంకే ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టేందుకు కూడా చర్చలు జరుగుతున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మేజిక్ ఫిగర్ అందుకునే వరకు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించకూడదని పార్టీ నిర్ణయించింది. తమిళనాడులో తొలిసారిగా ఒక ప్రాంతీయ పార్టీ (టీవీకే) దశాబ్దాల కాలంగా ఉన్న డీఎంకే, ఏఐడీఎంకేల ఆధిపత్యానికి చెక్ పెట్టి అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, అధికారం చేపట్టే క్రమంలో ఈ చిన్నపాటి అడ్డంకులు విజయ్కు పెద్ద సవాల్గా మారాయి.

# డేటా సెంటర్ పరికరాల తయారీలో దేశం అగ్రగామిగా నిలవాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆవిష్కరించడం నుంచి.. 50 బిలియన్ డాలర్లకు పైగా విలువ కలిగిన గ్లోబల్ శక్తిగా ఎదగడం వరకు క్యారియర్ ఎప్పుడూ ఆవిష్కరణలో ముందువరుసలో నిలిచింది. ఈ రోజు ఆ ఆవిష్కరణ ఏపీకి వస్తోంది.

**గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ గా శ్రీసిటీ...**

క్యారియర్ సంస్థ ఏపీలో రూ.వెయ్యి కోట్ల పెట్టుబడి పెట్టడంతో పాటు 3వేల ఉద్యోగాలను కల్పించనుంది. క్యారియర్ రావడం రాష్ట్రం పట్ల, మన ఎకోసిస్టమ్, మన ముఖ్యమంత్రి విజన్ పట్ల ఉన్న నమ్మకానికి నిదర్శనం. శ్రీసిటీ కేవలం ఇండస్ట్రియల్ పార్క్ మాత్రమే కాదు.. ఇదో గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్. 8,500 ఎకరాల్లో విస్తరించి ఉంది. 31 దేశాల నుంచి 250కి పైగా కంపెనీలు శ్రీసిటీలో ఉన్నాయి. ఇక్కడి నుంచి 6 బిలియన్ డాలర్లకు పైగా ఎగుమతులు జరుగుతున్నాయి. 70వేల మందికి పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందారు. వీరిలో సగంమంది మహిళలు ఉన్నారు. ఆటోమొబైల్స్ నుంచి ఎలక్ట్రానిక్స్ వరకు.. ఫుడ్ ప్రాసెసింగ్ నుంచి ప్రిసిషన్ ఇంజనీరింగ్ వరకు శ్రీసిటీ మేక్ ఇన్ ఇండియా, మేడ్ ఇన్ ఆంధ్రప్రదేశ్ కు ఉత్తమ నమూనాగా నిలుస్తోంది. ఈ రోజు మరో గొప్ప ఘనతను తన ఖాతాలో వేసుకుంది.

**ఇండియాస్ కూల్ క్యాపిటల్ గా ఏపీ గుర్తింపు పొందింది**

ఇండియాస్ కూల్ క్యాపిటల్ గా ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే ప్రత్యేక గుర్తింపును సంపాదించింది. 9 ప్రముఖ ఏసీ తయారీ సంస్థలు, 30కి పైగా కాంపోనెంట్, సరఫరా భాగస్వాములు, రూ.12వేల కోట్ల పెట్టుబడులు, వేగంగా విస్తరిస్తున్న హెచ్ వీఏసీ ఎకోసిస్టమ్.. 2027 నాటికి భారతదేశంలో ఏసీ ఉత్పత్తిలో 60శాతం ఏపీ నుంచే వస్తుంది. 2028 నాటికి ఇది 80శాతానికి చేరుతుంది. ఇది కేవలం వృద్ధి మాత్రమే కాదు.. గ్లోబల్ పోటీ సామర్థ్యం. మనందరం కలిస్తే ఇది వందశాతానికి చేరుతుంది.

**డేటా సెంటర్ పరికరాల తయారీలో దేశం అగ్రగామిగా నిలవాలి**

డేటా సెంటర్ల నిర్మాణం, పవర్ ఏఐలో ప్రపంచవ్యాప్తంగా పెద్ద పోటీ నడుస్తోంది. ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే ఈ రంగంలో ముందంజలో ఉంది. మనం కేవలం డేటా సెంటర్లకు ఆతిథ్యం ఇవ్వడం మాత్రమే కాకుండా.. వాటిని నడిపించే వ్యవస్థలను కూడా నిర్మించడమే మన లక్ష్యం. డేటా సెంటర్లు కేవలం ప్రారంభం మాత్రమే. పూర్తి ఎకోసిస్టమ్ నిర్మించడమే లక్ష్యం. ప్రతి డేటా సెంటర్ కు అడ్వాన్స్ డ్ కూలింగ్ సిస్టమ్స్, హై ఎఫిషియన్సీ చిల్లర్స్, పవర్ ఎలక్ట్రానిక్స్, కంట్రోల్ సిస్టమ్స్, ప్రిసిషన్ మానుఫ్యాక్చరింగ్ అవసరం. ఇవి లేకుండా డిజిటల్ ఆర్థిక వ్యవస్థ పనిచేయదు. ప్రపంచవ్యాప్తంగా డేటా సెంటర్లు పెరుగుతున్నకొద్దీ.. ఈ భాగాల కొరత కూడా పెరుగుతోంది. ఏపీ, దేశానికి నిజమైన విలువను సృష్టించే అవకాశం ఇక్కడే ఉంది. మనం ఈ డేటా సెంటర్ల కాంపోనెంట్స్ తయారీలో కీలక సరఫరాదారులుగా మారితే.. అది భారతదేశానికి గొప్ప వ్యూహాత్మక ప్రయోజనంగా మారుతుంది. ఎకోసిస్టమ్ లో భాగంగా క్యారియర్ ఏపీని, శ్రీసిటీని ఎంచుకుంది. ఫార్మారంగంలో దేశం ఏవిధంగా అగ్రగామిగా మారిందో.. అదేవిధంగా డేటా సెంటర్ పరికరాల తయారీలో కూడా దేశం ప్రపంచ నాయకత్వాన్ని సాధించగలదు. డేటా సెంటర్ కంపోనెంట్ తయారీ.. భారతదేశ తదుపరి ఫార్మా రంగం కావచ్చు.

**ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయం**

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పెట్టుకున్నాం. పెట్టుబడులు కేవలం డబ్బు కోసం మాత్రమే కాదు.. మన యువతకు నైపుణ్యం, ఉపాధి కల్పన కోసం నైపుణ్యం పోర్టల్ ను తీసుకువస్తున్నాం. దీనిద్వారా యువతకు పరిశ్రమలకు అవసరమైన శిక్షణ అందిస్తాం. క్లస్టర్ విధానంలో ముందుకు వెళ్తున్నాం. విశాఖ గ్లోబల్ ఏఐ హబ్ గా రూపుదిద్దుకుంటుంది.

చివరగా క్యారియర్ ఏపీని ఎంచుకున్నందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నా. ఇది కేవలం ప్రారంభం మాత్రమేనని... క్యారియర్ సంస్థ ఇక్కడ రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ సెంటర్ ను కూడా ఏర్పాటుచేయాలని మంత్రి కోరారు. అనంతరం మంత్రి లోకేష్ ను సంస్థ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో క్యారియర్ గ్లోబల్ కార్పొరేషన్ ఛైర్మన్ అండ్ సీఈవో డేవిడ్ ఎల్.గిట్లిన్, క్యారియర్ గ్లోబల్ కార్పొరేషన్ క్లైమేట్ సొల్యూషన్స్ ఏసియా పసిఫిక్, మిడిల్ ఈస్ట్ అండ్ ఆఫ్రికా ప్రెసిడెంట్ మేకేల్ ఎల్.గియర్టెస్, క్యారియర్ ఎయిర్ కండిషనింగ్ అండ్ రిఫ్రిజిరేషన్ లిమిటెడ్(క్యారియర్ ఇండియా) మేనేజింగ్ డైరెక్టర్ సుందరేశన్ నారాయణన్, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్ జెసి ఆర్. గోవిందరావు, క్యారియర్ గ్లోబల్ కార్పొరేషన్ ఆపరేషన్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మైక్ డుయిజర్, చీఫ్ పీపుల్ అండ్ కమ్యూనికేషన్స్ ఆఫీసర్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నడియా విల్లెనెవ్, శ్రీసిటీ కో-ఫౌండర్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో ‘అక్షర గోవిందం’

- అలిపిరి వద్ద శాశ్వత యాగశాల
- విద్య, వైద్య సేవల విస్తరణ
- ధూప, దీప, నైవేద్యాలకు రూ. 5 వేల నుండి రూ.10 వేలకు పెంపు
- టీటీడీ ఛైర్మన్ శ్రీ బీ ఆర్ నాయుడు



**తిరుమల మే 6 మనం న్యూస్:** టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బుధవారంటీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు బీ ఆర్ నాయుడు అధ్యక్షతన తిరుమల అన్నమయ్య భవనంలో ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఇందులో తిరుమల ఆళ్వార్ ట్యాంక్ అతిథి గృహం సర్కిల్ నుండి బాట గంగమ్మ సర్కిల్ వరకు ఉన్న సర్వదర్శనం క్యూలైన్లలో రూ.4.55 కోట్లతో అదనపు మరుగుదొడ్లు నిర్మించేందుకు ఆమోదం తెలిపారు.తిరుమలలోని రోడ్లు, సర్కిళ్లకు కమిటీ సూచించిన ఆధ్యాత్మిక, పురాణ ప్రాశస్త్యం కలిగిన పేర్లను పెట్టనున్నారు.టిటిడి బోర్డు విద్యా కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు టీటీడీ విద్యా సంస్థలలో అత్యాధునిక మౌళిక వసతుల ఏర్పాటుకు అదనంగా రూ.43.40 కోట్లు మంజూరుకు చేశారు. ఇప్పటికే గత బోర్డు సమావేశంలో రూ.118 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. మొత్తం కలిపి రూ.161.40 కోట్లు కేటాయించారు. తిరుమలలో నీటి వృధాను అరికట్టేందుకు, రోజు రోజుకు పెరుగుతున్న నీటి అవసరాల దృష్ట్యా గోగర్భం డ్యామ్ నుండి ఫిల్టర్ ప్లాంట్ వరకు రూ.6 కోట్లతో దాదాపు 2 కిలో మీటర్ల మేర అదనపు పైపులైన్ ఏర్పాటుకు ఆమోదించారు. టీటీడీ అవసరాల నిమిత్తం రూ. 44.20 కోట్లతో ఏపీకి చెందిన ఆప్కో, తమిళనాడుకు చెందిన కో-ఆప్టెక్స్ సంస్థల నుండి పట్టు వస్త్రాలు, దుప్పటాలు తదితరాలు కొనుగోలు చేసేందుకు ఆమోదించారు.

అల్లూరు సీతారామరాజు జిల్లా పాడేరు మండలంలోని వర్ధనపల్లి గ్రామంలో శివాలయం నిర్మాణానికి రూ.55 లక్షలు ఆర్థిక సాయం అందించనున్నారు.సనాతన ధర్మాన్ని మరింత వ్యాప్తి చేసేందుకు తలపెట్టిన ‘అక్షర గోవిందం‘ కార్యక్రమంలో పాల్గొనే చిన్న పిల్లలకు పంపిణీ చేసే కిట్ను ఉచితంగా అందించేందుకు నిర్ణయించారు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు జిల్లా, పెరూర్ తాలూకాలోని శెట్టిపాళ్యం గ్రామంలో జీస్క్వేర్ రియల్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు టీటీడీకి రిజిష్టర్ చేసి ఇచ్చిన 19.43 ఎకరాల స్థలాన్ని టీటీడీలో విలీనం చేసుకోవడానికి ఆమోదించారు. మహారాష్ట్రలోని నవీ ముంబైలో టీటీడీ నూతనంగా నిర్మించిన,శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో త్వరలో మహా సంప్రోక్షణ జరుగనున్న నేపథ్యంలో అవసరమైన సిబ్బందిని కాంట్రాక్ట్ / ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియామకానికి ప్రభుత్వ అనుమతికై నివేదించాలని నిర్ణయించారు. ముంబైలో శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ నిర్మాణానికి అయ్యే ఖర్చును టీటీడీ బోర్డు సభ్యులు శ్రీ సౌరబ్ బోరా భరించేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు.

తిరుమలలోని వరాహస్వామి విశ్రాంతి భవనం - 1లో రూ. 3.61 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఆమోదించారు.తిరుపతిలోని అలిపిరి వద్ద రూ.4.75 కోట్లతో శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం కోసం యాగశాల నిర్మించేందుకు నిర్ణయం తుసుకున్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత డా.శోభారాజును టీటీడీ ఆస్థాన విద్వాన్గా నియమించేందుకు నిర్ణయం తీసుకున్నారు. గుంటూరు జిల్లాలోని తుళ్ళూరు మండలంలో ఉన్న అనంతవరంలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో రూ.2.71 కోట్లతో రాజ గోపురం నిర్మాణానికి ఆమోదంతెలిపారు. రాష్ట్ర రాజధాని అమరావతిలోని వెంకటపాలెంలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో రూ.36.95 కోట్లతో ఏడు అంతస్తుల మహా రాజ గోపురం, ఆర్జిత సేవా మండపం, అద్దాల మండపం, వాహన మండపం, రథ మండపం, శ్రీ ఆంజనేయస్వామి ఆలయం, పుష్కరిణి నిర్మాణానికి ఆమోదం తెలిపారు. ప్రస్తుతం తిరుమలలో కార్యాలయాలు వివిధ ప్రాంతాల్లో ఉన్నాయి. పాలనా సౌలభ్యం కోసం అన్ని కార్యాలయాలను ఒకే చోటు తీసుకొచ్చేందుకు నూతనంగా పరిపాలనా భవనాన్ని నిర్మించనున్నారు. సత్యసాయి జిల్లా లేపాక్షిలో నూతన కల్యాణ మండపం నిర్మించేందుకు ఆమోదించారు. దాతల ప్రివిలేజెస్ కు సంబంధించిన విధి విధానాల ఏర్పాటు చేయడానికి టిటిడి బోర్డు సభ్యులతో కమిటి ఏర్పాటు చేశారు. ఖమ్మంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం కేటాయించిన 20 ఎకరాల స్థలాన్ని టీటీడీ స్వాధీనం చేసుకుని ఆలయం నిర్మించేందుకు ఆమోదంతెలిపారు. టీటీడీలో పని చేసే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ శ్రీవారి దర్శనం, లడ్డూ కార్డు జారీ చేయాలని నిర్ణయించారు. టీటీడీ ఉద్యోగులకు హెల్త్ స్కీమ్ లో భాగంగా ఇప్పుడిస్తున్న రూ.3 లక్షలకు అదనంగా మరో రూ.2 లక్షలను రీఎంబర్స్మెంట్ చేసేందుకు ఆమోదం.

అలిపిరి టోల్ గేట్ వద్ద వాహనాల రద్దీని తగ్గించేందుకు అలిపిరిలోని శ్రీ వినాయకస్వామి ఆలయ సమీపంలో రూ.4.25 కోట్లతో బస్సుల తనిఖీల కోసం శాశ్వత షెల్టర్లు ఏర్పాటు చేయాలన్నారు.ప్రభుత్వ నిబంధనలను అనుసరించి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఆలయాలకు ధూప, దీప, నైవేద్యాలకు ప్రస్తుతం ఇస్తున్న రూ. 5000/- నుండి రూ.10,000/- కు పెంచేందుకు నిర్ణయంతీసుకున్నారు.

శ్రవణం ప్రాజెక్టులో శిక్షణ పొందుతున్న వినికిడి లోపం గల 150 మంది పిల్లలకు ఉచితంగా వినికిడి యంత్రాలు ఇవ్వాలని నిర్ణరయించారు.ఈ సమావేశంలో బోర్డు సభ్యులలతో పాటు టీటీడీ ఈవో ఎం రవిచంద్ర, బోర్డు సభ్యులు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వి.వీరబ్రహ్మం, సివిఎస్ఓ కే.వి. మురళీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.


# రెవెన్యూ రికార్డులు పన్నుల వసూలుకే..

- అవి యాజమాన్య హక్కులు కల్పించవ్
- భూ వివాదంలో సుప్రీం కీలక తీర్పు

**ఢిల్లీ, మే 6 :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 600 ఎకరాల అటవీ భూముల వివాదంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. రెవెన్యూ రికార్డులు కేవలం పన్నుల వసూలుకేనని, అవి యాజమాన్య హక్కులు కల్పించవని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం కాల్వలనాగారం భూములపై జస్టిస్ ఎస్వీఎన్ భట్టి ధర్మాసనం బుధవారం తుది తీర్పు ఇచ్చింది. ఇదే వ్యవహారంపై గతంలో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును ధర్మాసనం సమర్థించింది. సర్వే నంబరు 81లో 600 ఎకరాల భూమిని అటవీ భూమిగా గుర్తిస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులు యథాతథంగా కొనసాగుతాయని స్పష్టం చేసింది. పట్టా లేకుండా కేవలం పహాణీలు, ఫసల్ పట్టీల ఆధారంగా యాజమాన్య హక్కులు రావని పేర్కొంది. రెవెన్యూ రికార్డులు కేవలం పన్నుల అవసరాల కోసమేనని వెల్లడించింది. అప్పీలుదారు తమ క్లెయిమ్ను నిరూపించే అసలు డాక్యుమెంట్లు సమర్పించలేదని పేర్కొన్న ధర్మాసనం.. దశాబ్దాల కాలంగా సాగుతున్న న్యాయ పోరాటానికి తెరదించుతూ తీర్పు ఇచ్చింది. దీంతో 1950 నాటి నిజాం కాలపు ఫారెస్ట్ గెజిట్ నోటిఫికేషన్ ను సవాల్ చేసిన అప్పీలుదారులకు చుక్కెదురైంది.

# మెట్ గాలాలో తళుక్కుమన్న మేఘా సుధారెడ్డి

(మొదటి పేజీ తరువాయి)



అక్కడున్నవాళ్లను కట్టిపడేశారు. ఈ సందర్భంగా సుధారెడ్డి డ్రెస్ తో పాటు ఆమె ధరించిన డైమండ్ నెక్లెస్, చేతికి ధరించిన రింగ్స్ అందరి దృష్టిని ఆకర్షించాయి. సుధారెడ్డి ధరించిన డైమండ్ నెక్లెస్ విలువ దాదాపు రూ.142 కోట్లు ఉంటుందని తెలుస్తోంది. ఈ నెక్లెస్ లోని డైమండ్ టాంజానియాలోని మెరెలాని పర్వతాల నుండి సేకరించిన 550 క్యారెట్ల క్వీన్ ఆఫ్ మెరెలాని అనే వాయిలెట్ నీలంరంగు టాంజనైట్ డైమండ్ అని పిలుస్తారు. అంతే కాకుండా ఆమె ధరించిన ఉంగరాలు సైతం కోట్ల రూపాయలు ఉంటాయని ఇక డ్రెస్ 3వేల గంటలకు పైగా కష్టపడి హస్తకళాకారులు రూపొందించినట్టు తెలుస్తోంది. మచిలీపట్నం శైలిలో సహజ రంగులు వాడి పూర్తిగా చేతితో డిజైన్ చేసినట్టు తెలుస్తోంది. అంతే కాకుండా ఆమె డ్రెస్ పై తెలంగాణకు చెందిన పాలపిట్ట, జమ్మిచెట్టు, తంగేడు పువ్వు లాంటి చిహ్నాలు కనిపించాయి. ఈసారి మెట్ గాలాను ఫ్యాషన్ ఈజ్ ఆర్ట్ అనే డ్రెస్ కోడ్ తో నిర్వహించగా ప్రముఖ డిజైనర్ మనీశ్ మల్హోత్రా రూపొందించిన ట్రీ ఆఫ్ లైఫ్ డ్రెస్ తో సుధారెడ్డి రెడ్ కార్పెట్ పై నడిచారు. ఇక సుధారెడ్డి మెట్ గాలాకు హాజరవ్వడం ఇదే మొదటిసారి కాదు. గతంలో రెండు సార్లు ఆమె హాజరవ్వగా అప్పుడు సైతం తన డ్రెస్సింగ్, జ్యూవెలరీతో తలుక్కుమన్నారు. ప్రస్తుతం ఆమె ఫోటోలు నెట్టింట వైరల్ అవుతుండగా నెటిజన్లు ఇంట్రెస్టింగ్ కామెంట్లు చేస్తున్నారు.





## రాయలసీమపై చంద్రబాబు రాళ్లు వేస్తారు..
# కానీ నీళ్లు ఇవ్వరు..!

- రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు ఆపింది చంద్రబాబే
- తెలంగాణ అసెంబ్లీలో సాక్షిగా చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి
- ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని తెలంగాణ రాష్ట్రంకు తాకట్టుపెట్టారు
- చంద్రబాబు మోసాన్ని ప్రజలకు వివరించి చైతన్యం తీసుకురావాలి
- రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు పునఃప్రారంభించేలా పోరాడాలి
- వైఎస్ఆర్సీపీ విద్యార్థి విభాగం నేతల సమావేశంలో ప్రముఖుల వెల్లడి

**చంద్రగిరి మే 6 మనం న్యూస్ :** రాయలసీమ గడ్డను ఎండబెట్టి, రైతుల భవిష్యత్తును కరువులోకి నెట్టిన చంద్రబాబు మోసంపై ప్రశ్నించే సమయం వచ్చింది.. ఆయన రాయలసీమ ప్రాంత ప్రజలపై రాళ్లు వేస్తారు.. కానీ నీళ్లు మాత్రం ఇవ్వరు.. ఇదే చంద్రబాబు నిజ స్వరూపం.. చంద్రబాబు జన్మానికి రాయలసీమ గడ్డ కారణమైనా.. ఆయన పుట్టిన ఊరుకు.. పెరిగిన గడ్డకు అన్యాయం తప్ప ఏనాడూ మేలు చేసిన దాఖలాలు లేవు.. రాష్ట్ర విభజన తరువాత కరువు సీమలో ఒక్కటైన అనంతపురంకు కేంద్ర ప్రభుత్వం ఏయిమ్స్ ఆసుపత్రిని కేటాయిస్తే సహించలేని చంద్రబాబు అమరావతికి తీసుకువెళ్లాడు.. ఇప్పుడు రాయలసీమకు జీవనాడిగా చెప్పుకునే ఎత్తిపోతల పథకం పనులను అర్ధాంతరంగా నిలిపించి చరిత్ర హీనుడిగా.. రాయలసీమ ద్రోహిగా మిగిలి పోయాడు.. జగనన్న పాలనలో 90శాతంకు పైగా పనులు పూర్తి చేసుకున్న ''రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును నిలుపుదల చేసింది చంద్రబాబే'' అన్న నిజాన్ని తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి చెప్పారు.. ఇదంతా చంద్రబాబు ఎందుకు చేశారు..? అని ఆరాదీస్తే తెలంగాణ రాష్ట్రంలోని ఆయన ఆస్తులు కాపాడుకోవడానికి, ఓటుకు నోటు కేసులో బయటకు రావడానికేనన్న నిజం బయటకు వచ్చింది.. స్వప్రయోజనాల కోసం ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని తెలంగాణ రాష్ట్రానికి తాకట్టు పెట్టిన చంద్రబాబు మోసాలపై ప్రజలకు వివరించి ప్రజా ఉద్యమానికి ఊపిరిపోయాలి..రాయలసీమ దాహం తీర్చే వరకు పోరాటం ఆగకూడదు.'' అంటూ మాజీ మంత్రి సాకే శైలజానాథ్ వైఎస్ఆర్సీపీ విద్యార్థి విభాగం నేతలకు పిలుపునిచ్చారు.

తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట సమీపంలోని ఓ లేక్వ్యూ రిసార్ట్స్ 'రాయలసీమ ఎత్తిపోతల పథకం - చంద్రబాబు మోసం' అన్న అంశంపై ప్రత్యేకా సమావేశం రాష్ట్ర వైఎస్ఆర్సీపీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఆ సమావేశంకు ముఖ్యతిథులుగా హాజరైన మాజీ మంత్రి, శింగనమల నియోజకవర్గం వైఎస్ఆర్సీపీ సమన్వయకర్త సాకే శైలజానాథ్, రాష్ట్ర వైఎస్ఆర్సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షులు పానుగంటి చైతన్య, సత్యవేడు నియోజకవర్గం సమన్వయకర్త నూకతోటి రాజేష్, విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్లు ప్రణయ్రెడ్డి, రవి చంద్రలు హాజరయ్యారు. ముందుగా దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్రెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం జ్యోతి వెలిగించి సమావేశంను ప్రారంభించగా చంద్రగిరి నియోజక వర్గం వైఎస్ఆర్సీపీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్రెడ్డి వక్తలు అందరినీ ఆహ్వానించి రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు ఆగిపోవడం వల్ల ఈ ప్రాంతానికి జరిగే నష్టాన్ని సమగ్రంగా వివరించారు. అనంతరం మాజీ మంత్రి సాకే శైలజానాథ్ మాట్లాడుతూ రాయలసీమను కరువుసీమగా మార్చి, రైతులను కన్నీళ్లు పెట్టించి, యువతను నిరాశలోకి నెట్టిన చంద్రబాబు ద్రోహాన్ని ప్రతి పల్లెలో కరపత్రాలు, వాల్ పోస్టర్ల ద్వారా ప్రజల ముందు బయట పెట్టాలన్నారు. రాయలసీమ జిల్లాల్లో తలుపుతట్టి ప్రతి ఇంటికి చెప్పాలని, ఇది కేవలం నీటి సమస్యగా మాత్రమే చూడవద్దని, రాయలసీమ ప్రాంత ప్రజల ఆత్మగౌరవం, ప్రజల హక్కు, భవిష్యత్తుగా పరిగణించాలని సూచించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు వెంటనే ప్రారంభం కావాలని, లేదంటే పోరాటాన్ని ఉధృతం చేయాలని తీర్మాణించారు. రాయలసీమకు న్యాయం జరిగేంత వరకు పోరాటం సాగిస్తామని, రాయలసీమ ఎత్తిపోతల పనులను తిరిగి ప్రారంభం చేసేలా ప్రభుత్వం ఒత్తిడి తీసుకువస్తామని వెల్లడించారు.

### అందరికీ పసందైన విందు

రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి విభాగం నేతలతో పాటు రాయలసీమ ప్రాంత నేతలు హాజరైన ఆ కార్యక్రమంలో చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పసందైన విందు ఏర్పాటు చేశారు. విద్యార్థి విభాగం నేతలు అందరూ కార్యక్రమం నిర్వహణ, విందు ఏర్పాటుపై ప్రశంసలు కురిపించారు. అలాగే రాయలసీమ ప్రాంత సాగునీటి ప్రాజెక్టుల పనులు ప్రారంభించేంత వరకు ప్రభుత్వంపై చేసే పోరాటాలను విజయవంతం చేయడానికి ఇలాగే అన్ని ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించాలని ఆయా జిల్లాల అధ్యక్షులు, సీనియర్లకు సూచించారు.

# గిరిజన గృహాలకు కరెంటు సౌకర్యమైన కల్పించండి

- గిరిజనుల పట్ల విద్యుత్ అధికారుల మొండి వైఖరి నసించాలి
- సిపిఐ నాయకులు డిమాండ్

**తిరుపతి మే 6 మనం న్యూస్ :** తిరపతి కొరమీనుగుంట జి దేముడు కాలనీ లో నివసిస్తున్న గిరిజనులకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేసింది. బుధవారం ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద జి దేముడు కాలనీలో నివసిస్తున్న ప్రజలందరూ సిపిఐ ఆధ్వర్యంలో విద్యుత్ మీటర్ల కోసం మూడవరోజు వాపోయారు.కొరమేనుగుంట దేముడు కాలనీ లో నివాసమున్న గిరిజనులు విద్యుత్ మీటర్లు కోసం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ని,ఈ ఆర్ సి చైర్మన్, సిఎండి , ఎస్సీ, ఏడి, డి ఈ, ఏఈ ఆఫీసుల చుట్టూ తిరిగి అనేకసార్లు అర్జీలు సమర్పించిన ఆ అర్జీలు చెత్తబుట్టలో వేస్తున్నారు తప్ప పేదల బ్రతుకులో వెలుగు నింపలేదని దుయ్యబట్టారు. ప్రభుత్వం భూములలో పెద్దలు కట్టుకున్న ఇళ్లకు ముడుపులు తీసుకుని విచ్చలవిడిగా విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని, పేదలు నివసించే ఇళ్లకు మాత్రం కరెంటు సౌకర్యం కల్పించడం లేదన్నారు. పేదల నివసిస్తున్న గృహాలకు విద్యుత్ మీటర్లు



నిరవధిక నిరసన దీక్ష చేపట్టడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రామానాయుడు ,జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ తిరుపతి నగరంలో 80 శాతం ప్రభుత్వ, మఠం భూములేనని, ఆ భూములలో అధికార పార్టీ నాయకుల అండదండలతో భూకబ్జా దారులు విచ్చలవిడిగా పక్కా భవనాలు నిర్మించుకున్న భవనాలకు విద్యుత్ మీటర్లు మంజూరు చేస్తున్నారని, పేదల నివసిస్తున్న గృహాలకు విద్యుత్ మీటర్లు అడిగితే అనేక నిబంధనలు పెడుతూ కాలయాపన చేస్తున్నారని వాపోయారు. 2003 కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 43(1) చట్టం ప్రకారం ఎస్సీ ,ఎస్టీ పేద ప్రజలు నివసిస్తున్న గృహాలకు అత్యవసరమైన విద్యుత్తు, త్రాగునీరు సౌకర్యం కల్పించాలని ఉన్న, తిరపతి విద్యుత్ అధికారులకు మాత్రం ప్రభుత్వ నిబంధనలు వర్తించవని వచ్చేంతవరకు పోరాటానికి సన్నద్ధమై సిపిఐ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టామని,మేము నివసిస్తున్న గృహాలకు కరెంటు మీటర్లు అయినా రావాలి లేక విద్యుత్ కార్యాలయం ముందు మా పేదలను విద్యుత్ పెట్టైనా చంపాలని నినాదంతో పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. మీటర్ల వచ్చేంతవరకు పోరాటం ఆపకుండా అవసరమైతే పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి ఎస్పీడీసీఎల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలపారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా కార్యదర్శి నదియా ,ఎస్ఎఫ్ ఉదయ్ ,వైఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ ,తిరుపతి 2వ డివిజన్ కార్యదర్శి ఆటోశివ ,ప్రమీల ,ఓటేరు విజయమ్మ ,కే వై రాజ, వినయ్,శాఖ కార్యదర్శి కా మునేశ్వర్, కా.డి.నాగరాజు, కోటయ్య కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.పెద్ద ఎత్తున నివాసమున్న పేదలు పాల్గొన్నారు.

# జిల్లాలోని మామిడి రైతులకు ప్రొటెక్షన్ కవర్లు 6 కోట్ల 70 లక్షలు పంపిణీ చేశాం

- గుజ్జు పరిశ్రమల యాజమాన్యులతో తాజా పరిస్థితులపై ఉద్యానవన శాఖ అధికారులు సమీక్షించాలి:జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు, మే6 మనం న్యూస్ :** యంఐడిహెచ్ పథకంలోని పాలీ హౌస్ సంబంధించిన బడ్జెట్ ను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లాలో మామిడి పంటలు దిగుబడిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ డిడి రామాంజనేయులు, వ్యవసాయ శాఖ జెడి మురళి తదితరులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మామిడి పంటకు ప్రత్యామ్నాయంగా అధిక ఆదాయాన్నిచ్చే వాణిజ్య, ఉద్యానవన పంటలపై రైతులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రస్తుతం మామిడి పంట పరిస్థితి మామిడి గుజ్జు పరిశ్రమంలో నిల్వ ఉన్న మామిడి గుజ్జు,ప్యాకింగ్ మెటీరియల్ లభ్యత గురించి ఆరా తీశారు.ఆర్ కెవివై పథకం అమలులో భాగంగా గత ఆర్థిక సంవత్సరంలో మిగిలి ఉన్న 50 లక్షల రూపాయల బడ్జెట్ ను ఖర్చు చేయమని



ఆదేశించారు. యంఐడిహెచ్ పథకంలోని పాలీ హౌస్ సంబంధించిన బడ్జెట్ ను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.బంగారుపాలెం పూతలపట్టు, కుప్పం వారితో మామిడి పల్ప్ యూనిట్స్ గురించి పరిస్థితిని అడిగి తెలుసుకోమన్నారు.ఐడిఎ (అగ్రికల్చర్) వారిని తవణంపల్లి మండలంలోని ఫ్యాక్టరీలను సందర్శించి వివరములు తెలియజేయాలని ఆదేశించారు. మార్కెటింగ్ ఎడి వివిధ మండలా లో క్షేత్రస్థాయిలో పర్యటించి రాంపుల పరిస్థితి గురించి గత సంవత్సరం కొనుగోలు గురించి విచారించమన్నారు, ఖరీఫ్ కాలంలో ఈ క్రాపింగ్ బుకింగ్ తప్పులు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు.జిల్లాలోని మామిడి రైతులకు ప్రొటెక్షన్ కవర్లు సుమారు 6 కోట్ల 70 లక్షలు కవర్లు పంపిణీ చేయడం జరిగింది తెలిపారు. త్వరలో జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యక్షంగా సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలను ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో మామిడి గుజ్జు పరిశ్రమలు ఉత్పత్తులు ఎన్ని ఉన్నాయి, వాటి సామర్థ్యం ఎలా ఉన్నది, గుజ్జు నిల్వ ఎంత ఉన్నది, ఏవైనా పరిశ్రమలు మూతబడి ఉన్నాయా పరిశీలించాలని ఆదేశించారు, ఈనెల చివరి వారం నుండి మామిడి పంట కోత మొదలవుతుందని అధికారులు జిల్లా కలెక్టర్ కు వివరించారు.

ఈ కార్యక్రమంలో ఏడి ఆర్టికల్చర్ కోటేశ్వరరావు, ఏడి మార్కెటింగ్ పరమేశ్వరన్, ఉద్యానవన శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు




# మే 17 విజయవాడ బీసీల'మేధో మదన సదస్సు

- కేసన శంకరరావు

**తిరుపతి మే6మనం న్యూస్ :** బీసీల ప్రధాన డిమాండ్ల సాధనే లక్ష్యంగా మే 17వ తేదీ ఆదివారం విజయవాడ బెంజి సర్కిల్ వద్దనున్న లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్లో బీసీ సంక్షేమ సంఘం నాయకులు, వివిధ బిసి కుల సంఘ నాయకులు,ఉద్యోగులు, మేధావుల తో మేధో మదన సదస్సు జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు అన్నారు.తిరుపతి ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల మేధోమధన సదస్సులో జాతి జన గణనలో బీసీల కుల గణన సక్రమ నిర్వహణపై అందరి సూచనలు సలహాలు స్వీకరిస్తామన్నారు. కేంద్రం ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన నియోజకవర్గాల పునర్విభజన- మహిళా రిజర్వేషన్ చట్టాలు చేయడానికి చేసిన రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంతో ఏర్పడిన ప్రతిష్టంబనపైన బీసీ నేతలు సుదీర్ఘంగా చర్చిస్తారన్నారు.ఎస్సీ ఎస్టీ బీసీ రిజర్వేషన్లన్నీ కలిపి మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదన్న సుప్రీంకోర్టు ఆర్డర్ ను అధిగమించే అంశాల పైన చర్చిస్తామన్నారు. బీసీ ఉద్యోగులకు సంబంధించి బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ, ప్రమోషన్లలో రిజర్వేషన్లు, క్రీమీ లేయర్ ఎత్తివేత, ఏసీబీ విజిలెన్స్ కేసుల సత్వర పరిష్కారం, ఎస్సీ ఎస్టీలకు కేటాయిస్తున్న అన్ని పారిశ్రామిక రాయితీలు బీసీ పారిశ్రామికవేత్తలకు వర్తింపజేయడం వంటి అన్ని సమస్యలపై సదస్సులో చర్చిస్తామన్నారు. ఇటీవల పలు రాష్ట్రాలలో పాలక పక్షాలు ఇచ్చిన ఎన్నికల వాగ్దానాల మేరకు స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లు అమలు జరుపుటకు ఉన్న అడ్డంకుల పైన ఏవిధంగా ముందుకెళ్లాలో, జనాభా దామాషా మేరకు బీసీలకు రిజర్వేషన్లు ఏ విధంగా సాధించుకోవచ్చన్న విషయాలపై ఈ సమావేశం చర్చిస్తుందన్నారు. దేశంలోనే తొలిసారిగా'బీసీ రక్షణ చట్టం', మరియు 50 ఏళ్లకే సామాజిక పెన్షన్ వంటి రాష్ట్ర ఎన్ డి ఏ సర్కార్ ఎన్నికల వాగ్దానాలను త్వరితగతన అమలు జరిపించుకొనుటకు చేయాల్సిన ప్రయత్నాలపై కూడా సదస్సు చర్చిస్తుందన్నారు.

## నేషనల్ కంపెనీ ట్రిబ్యునల్‌లో రైతుల బకాయిలు పరిగణిస్తూ అంగీకారం
### జిల్లా కలెక్టర్

**చిత్తూరు, మే 6మనం న్యూస్ :** సర్వశ్రీ నేతమ్స్ చక్కెర కర్మాగారము, నిండ్ర చెరకు రైతులకు 2019-20 సంవత్సరంలో రూ. 35 కోట్లు బకాయిలు పడిన విషయము విదితమే. రైతుల బకాయిలు రాబట్టుటకు ప్రయత్నించగా ఎస్.టీ.సి.ఐ. ఫైనాన్సు లిమిటెడ్, ముంబాయి వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించి రెవిన్యూ రికవరీ చట్టం పై స్టే పొందడం జరిగినది. ఈ క్రమములో జిల్లా కలెక్టర్, సుమిత్ కుమార్ చిత్తూరు ఎస్. టీ.సి.ఐ., రైతులు, కార్మికులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి కర్మాగారాన్ని అమ్మి వచ్చిన మొత్తములో పంచుకోవడానికి నిర్ణయించడమైనది. కాగా కొనుగోలుదార్లు తక్కువ ధర కి కోరడం వలన అమ్మకము కుదరలేదు.ఎస్.టీ.సి.ఐ. ఫైనాన్సు లిమిటెడ్, ముంబాయి కర్మాగారము పై నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్.సి.ఎల్.టి) ని ఆశ్రయించగా ఫిబ్రవరి10 న కోర్టు రిసోల్యూషన్ (పొఫెషనల్ ని (ఆర్.పి) నియమించుట జరిగినది.కాగా జిల్లా కలెక్టర్, చిత్తూరు రైతు సంఘ నాయకులతో కలసి రైతుల బకాయిల క్లెయిమ్ రిసోల్యూషన్ (పొఫెషనల్ కి సమర్పించి లు పొందుపరచవలసినదిగా కోరడమైనది.జిల్లా కలెక్టర్ అనేకసార్లు రైతుల రిసోల్యూషన్ సమస్యలను తెలియజేసి బకాయిలు తప్పనిసరిగా ఇచ్చే ఏర్పాటు చేయవలసినదిగా పొపెషనల్ ని కోరడమైనది. తత్ఫలితముగా జిల్లా కలెక్టర్, చిత్తూరు వారు సమర్పించిన 1650 మంది రైతుల క్లెయిమ్ రూ. 64 కోట్లు ను (పిన్సిపల్ రూ. 34 కోట్లు + ఇంటరెస్ట్ రూ. 30 కోట్లు బకాయిలుగా పరిగణిస్తూ అంగీకరిస్తున్నట్లు రిసోల్యూషన్ ప్రొఫెషనల్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్.సి.ఎల్.టి లో రైతుల తరపున పోరాడుతున్నామని, బకాయిలు రాబట్టుటకు అన్ని విధాల చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

## మనీటి సంరక్షణ పనులతో భూగర్భ జలాల పెంపే లక్ష్యం

- జలధార పనులతో ఉపాధి హామీ వేతనదారులకు వరంగా మారిన వి బి జి రామ్ జి పథకం

**చిత్తూరు మే6 మనం న్యూస్ :** జలధార జలహారతి కార్యక్రమం లో భాగంగా గంగాధర పెనుమురు మండలం కె సి పంచాయతీ గొల్లపల్లి గ్రామ పరిధిలో ఎద్దల గుట్ట నుండి గొల్లపల్లి చెరువు వరకు సుమారు 2.5 కిలోమీటర్ దూరం కాలువ పూడికతీత పనులను జిల్లా డ్వామా పిడి రవికుమార్ క్షేత్రస్థాయిలో పరిశీలించి మస్టర్లను తనిఖీ చేసారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో సుమారు 92 చెరువులు కలవని అందులో 100% నిండిన చెరువులు 63 గలవని 75% నిండినవి 22 కలవని 50 శాతం కంటే తక్కువ నిండిన 7 చెరువులు కలవు. ఇందులో 190 వంకలు కలవు.పనులను మొదట ప్రాధాన్యతగా తీసుకొని సుమారు 67 వంక పనులు జరుగుచున్నవి. ఈ వంక పనిలో 1400 మంది వేతన దారులతో పనులు జరుగుతున్నాయని తెలిపారు.

**కొంతమంది సభ్యులు వారి మాటలు...**

నిర్మల ,గొల్లపల్లి గ్రామం , పెనుమురు మండలం ఉపాధి హామీ పథకం వలన చాలా ఉపయోగం జరుగుతుంది. పంటలు పండించడానికి అన్నిటికీ బాగుంది. ఎద్దల గుట్ట నుండి గొల్లపల్లి చెరువులోకి నీరు వస్తా ఉంది. ఇప్పుడు మాకు పూడిక తీసే పని వచ్చింది కాబట్టి



జల ధార జలహారతి కార్యక్రమం ద్వారా మాకు చాలా ఉపయోగపడతా ఉంది. పెనుమురు మండలం,గొల్లపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు మాట్లాడుతూ ఈరోజు మనం జలధార జల జలహారతి కార్యక్రమంలో భాగంగా ఎద్దల గుట్ట నుండి గొల్లపల్లి చెరువు వరకు ఈ కాల్వను శుభ్రం చేయడం జరిగింది. ఇంతకు ముందు ఇక్కడ ఈ కాల్వలో కంప చెట్లు రాళ్ళు అంతా ఉన్నాయి. జలధర జల హారతి కార్యక్రమంలో భాగంగా ఇక్కడ శుభ్రం చేయడం జరుగుతుంది. ఇంతకుముందు వర్షం వస్తే నీళ్లు పోవడం కూడా సరిగా పోవడం లేదు. ఈ కార్యక్రమం చేయడం వల్ల మొత్తానికి నీళ్లు బాగా పోతా ఉంది. ఈ కార్యక్రమం చాలా బాగుందని తెలిపారు. పెనుమూరు మండలం మాజీ జట్పీటిసి రుద్రయ్య నాయుడు మాట్లాడుతూ... జలధార-జలహారతి కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసి మండలంలోని అన్ని చెరువులు నిండేలా చర్యలు తీసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

## అంతర రాష్ట్ర ముద్దాయిల పై కొనసాగుతున్న టాస్క్ ఫోర్సు ఆపరేషన్స్

**తిరుపతి మే6 మనం న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్ర చందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో, ఎర్ర చందన అక్రమ రవాణా నిరోధక దళం హెడ్ ఎస్ పి సుబ్బారాయుడు, మార్గదర్శకత్వంలో,అదనపు ఎస్ పి జె. కులశేఖర్ ఆధ్వర్యం లో శేషాచల అడవులలో ఎప్పటికీ అప్పుడు ప్రత్యేక ఆపరేషన్ లు నిర్వహించడం తో పాటు, ఎర్ర చందనం కేసు లలో ముద్దాయిలు గా ఉంటూ తప్పించుకొని తిరుగుతున్న అంతర రాష్ట్ర స్మగ్లర్లను చట్టం ముందు నిలబెట్టడమే లక్ష్యంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగింది. అందులో భాగంగా నిన్న,5వతేదిన అరెస్ట్ కాబడిన ముద్దాయి నాసర్ ఎన్ కె నాసర్ భాయి ద్వార



రాబడిన సమాచారం బుధవారం తమిళనాడు రాష్ట్రం, కోయంబత్తూరు జిల్లా, మేట్టుపాలెం సమీపంలోని రేకుల షెడ్డు మీద టాస్క్ ఫోర్సు పోలీసులు దాడులు జరపగా అక్కడ ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, ఒక మహేంద్ర ఎక్స్ యువి 700 వాహనం తో సహా 35 ఎర్రచందనం దొంగలు స్వాధీనం చేసుకోవడం జరిగింది. పట్టుబడిన ఇద్దరిలో ఎక్సోడస్ అలెక్సండర్, ఎస్. శేఖర్ తమిళనాడు రాష్ట్రం కు చెందిన స్మగ్లర్లు గా గుర్తించడం జరిగింది. పట్టుబడిన మొత్తం పట్టుబడిన 35 ఎర్రచందం దుంగలు వాహనాలుతో సహా విలువ సుమారు 1 కోటి గా ఉంటుందని అంచనా వేయడం జరిగింది.

ఈ స్మగ్లింగ్ లో ఇతర ప్రధాన సూత్రధారులను గుర్తించి వారిని అరెస్ట్ చేయడం జరుగుతుంది. అందుకోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడం జరిగింది.

ఈ కేసు లో ఎర్ర చందనం దొంగలు, వాహనం ను స్వాధీనం చేసుకోవడంతో పాటు, అంతర రాష్ట్ర స్మగ్లర్ ను అరెస్ట్ చేసిన టాస్క్ ఫోర్స్ బృందాన్ని అభినందించడం తో పాటు వారికి రివార్డ్ లు ఇవ్వడం జరుగుతుంది. మున్ముందు కూడా ఎర్ర చందనం అక్రమ రవాణా నివారణ మరియు స్మగ్లింగ్ చేసే వారి పై కఠిన చర్యలు తప్పవన్నారు.

# టీడీపీ నేతల పై ఉన్న కేసును కొట్టి వేసిన చిత్తూరు జిల్లా కోర్టు

- కేసును కొట్టి వేతపై హర్షం తెలిపిన మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టిడిపి నాయకులు

**శాంతిపురం మండలం ఏప్రిల్ 6 మనం న్యూస్ :** గత వైసిపి ప్రభుత్వ హయాంలో తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను చేయడం జరిగిందన్నారు.మొత్తం మూడు కేసులకు సంబంధించి కుప్పం మరియు చిత్తూరు కోర్టుకు నాలుగు సంవత్సరాలుగా హాజరవుతున్నట్లు తెలిపారు. రెండు కేసులను నవంబర్ 2025 న చిత్తూరు కోర్టు కొట్టి వేసిందన్నారు. మిగిలిన ఒక కేసు కూడా బుధవారం నిర్దోషులుగా నిర్ణయిస్తూ కేసును కొట్టివేసింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎప్పటికైనా ధర్మమే గెలుస్తుందని



చిత్తూరు కోర్టు కొట్టి వేయడంపై మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు మరియు పలువురు టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. 2022 ఆగస్టు 24వ తేదీన రామకుప్పం మండలం కొంగనపల్లి పంచాయతీ కొల్లుపల్లి వద్ద చోటు చేసుకున్న సంఘటనపై గత ప్రభుత్వం 36 మంది నాయకులు కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు అన్నారు.అప్పటి వైసిపి హయంలో ఎన్నో రకాలుగా మమ్మల్ని బాధలకు గురిచేసి అక్రమ కేసులు బనాయించి మాపై కక్ష సాధింపు చర్యలను చేపట్టారని, అయినా ప్రజలు మా నాయకుడు చంద్రబాబు నాయుడు వెంట తెలుగుదేశం పార్టీ నాయకుల వైపే ఉన్నారని ఈ సందర్భంగా తెలిపారు.

## వేసవి వేళ..చల్లని నీడ..!

వేసవి వేడి గుండెల్ని మండిస్తోంది
పని చక్రంలో గిర్రున తిరుగుతూ
చెమటగా జారుతోంది జీవితం.
పండుటాకులు రాలిపోతున్నాయి
పత్ర హరితం చేజారిపోయింది
నీటి కోసం బిందెలు పట్టుకుని
గల్లీ గల్లీ తిరుగుతున్న ఆశలు
భూమిలోనూ.. హృదిలోనూ
అడుగంటుతున్న క 'న్నీళ్లు'
బతుకు భద్రత కోసం కళ్లల్లో
కనిపిస్తోంది ఆవేదన.. మనసులో వేదన
అకాల వర్షాలతో పొలాలు పాడై
రైతు కన్నీరు ఎండిపోయింది
భగ్గుమన్న ఎండకు
జొన్న చేను కాలిపోయింది
ప్రకృతి కూడా వికృతంగా నవ్వుతోంది
చెట్టు నీడ కూడా అరుదై పోయింది
మనిషి నీడే మరొక మనిషికి భారమైంది
పిల్లల కలలు స్వేదంలో కరుగుతున్నాయి
పెద్దోళ్ల కళలు గాయంతో మరుగుతున్నాయి
విలువలకు వలువలూడు తున్నాయి
కాలమా...మనిషిని మనిషి
ప్రేమించుకునే రోజేది..!?
అంతా అంతర్గత యుద్ధాలే కదా...
అడుగడుగునా ఆశలు
ఒలికిపోతున్న దృశ్యాలే కదా...
ఒక చెట్టు నాటితే చల్లని గాలైనా వస్తుంది
పచ్చని మొక్క మొలకెత్తుదాం పదా..
ఒక చుక్క నీరు ఆదా చేస్తే
రేపటి తరం దాహమైనా తీరుతుంది
ఒడిసి పట్టుకుందాం.. కదలండి...
వేసవి వేడి మనసుల్లో కాకుండా
మన కర్తవ్యాల్లో జ్వాలగా మారితే బాగు
ప్రజా సమస్యలపై స్పందించే మనసే
సమాజానికి నిజమైన చల్లని నీడ....!

**- డా.కటుకోఝ్వల రమేష్**
9949083327

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు**
**manamlekhalu@gmail.com**
**మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**

**ఈ పేపర్ కోసం**
**https://www.manamepaper.com/**
**వెబ్‌సైట్‌లో చూడండి – ఎడిటర్**

# కుప్పకూలిన పాత కోటలు.. పుట్టుకొచ్చిన కొత్త శక్తులు!




భారత ప్రజాస్వామ్య ప్రస్థానంలో 2026 నాటి పంచ రాష్ట్రాల శాసనసభ ఎన్నికలు కేవలం ఒక సాధారణ అధికార మార్పిడి ఘట్టాలుగా కాకుండా, దేశ రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చివేసిన చారిత్రక పరిణామాలుగా విశ్లేషించ బడుతున్నాయి. అస్సాం బ్రహ్మపుత్ర తీరం నుండి బెంగాల్ గంగమ్మ ఒడి వరకు, కేరళ కొబ్బరి తోటల నుండి తమిళనాడు ద్రవిడ కోటల వరకు విస్తరించిన ఈ ఎన్నికల పోరులో భారతీయ ఓటరు తన పరిణతిని చాటుకున్నాడు. దశాబ్దాల రాజకీయ ఆధిపత్యాలను సవాలు చేస్తూ, సరికొత్త శక్తులకు పట్టం కడుతూ, అభివృద్ధి మరియు సిద్ధాంతాల మేళవింపుతో వెలువడిన ఈ ఫలితాలు జాతీయ రాజకీయాల్లో నవ శకానికి నాంది పలికాయి. ముఖ్యంగా ఈ ఎన్నికల ఫలితాలు జాతీయ పార్టీల విస్తృతిని, ప్రాంతీయ సమీకరణాల మార్పును మరియు యువత రాజకీయ ఆకాంక్షలను స్పష్టంగా ప్రతిబింబించాయి.

ఉత్తర తూర్పు భారతావనిలో వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన అస్సాం రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ సాధించిన విజయం ఒక అప్రతిహత రాజకీయ ప్రస్థానానికి నిదర్శనంగా నిలిచింది. 126 స్థానాలు కలిగిన అస్సాం అసెంబ్లీలో ఎన్డీఏ ఏకంగా 102 స్థానాలను కైవసం చేసుకోవడం, ప్రతిపక్ష కాంగ్రెస్ కూటమిని కేవలం 21 స్థానాలకే పరిమితం చేయడం ఒక చారిత్రక రికార్డు. 2016లో మొదటిసారి అధికారంలోకి వచ్చిన నాటి నుండి, 2021లో పట్టు నిలుపుకుని, ఇప్పుడు 2026లో వరుసగా మూడవసారి అఖండ మెజారిటీతో హ్యాట్రిక్ సాధించడం ద్వారా భాజపా ఈశాన్య భారతంలో తన అజేయ శక్తిని చాటుకుంది. ఈ అద్భుత విజయానికి ప్రధాన కారణం ప్రభుత్వం అమలు చేసిన సమగ్ర అభివృద్ధి నమూనా. మారుమూల ప్రాంతాలను అనుసంధానిస్తూ నిర్మించిన భారీ వంతెనలు, రహదారులు, మరియు మౌలిక సదుపాయాల కల్పన అస్సాం ప్రజల్లో అభివృద్ధిపై గట్టి నమ్మకాన్ని కలిగించింది. దీనికి తోడు, అక్రమ వలసల విషయంలో ప్రభుత్వం అవలంబించిన కఠిన వైఖరి, జాతీయ పౌర పట్టిక అమలుపై ఉన్న స్పష్టత, మరియు స్థానిక సంస్కృతిని కాపాడే ప్రయత్నాలు గిరిజన మరియు స్థానిక వర్గాలను భాజపా వైపు మొగ్గు చూపేలా చేశాయి. కాంగ్రెస్ పార్టీ బలమైన నాయకత్వం లేక, క్షేత్రస్థాయిలో ఉనికిని కోల్పోవడం కూడా ఎన్డీఏకు ఇంతటి భారీ మెజారిటీ రావడానికి మార్గాన్ని సుగమం చేసింది.

దేశవ్యాప్త రాజకీయ విశ్లేషకులను సైతం విస్మయానికి గురిచేసిన పరిణామం పశ్చిమ బెంగాల్లో చోటుచేసుకుంది. గత దశాబ్ద కాలానికి పైగా బెంగాల్ గడ్డపై ఏకచ్ఛత్రాధిపత్యం వహించిన మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ కోటను కూల్చివేస్తూ భాజపా సాధించిన విజయం జాతీయ రాజకీయాల్లోనే అత్యంత కీలక మలుపు. 293 స్థానాలు కలిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో భాజపా 206 స్థానాలతో అఖండ విజయాన్ని నమోదు చేసి అధికారాన్ని హస్తగతం చేసుకుంది. గతంలో ఎదురులేని శక్తిగా ఉన్న తృణమూల్ కాంగ్రెస్ కేవలం 81 స్థానాలకే పరిమితం కాగా, కాంగ్రెస్ పార్టీ నామమాత్రంగా 2 స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. రాజకీయ హింస, అవినీతి ఆరోపణలు, మరియు పాలనాపరమైన అసంతృప్తి బెంగాల్ ఓటర్లలో ఒక నిశ్శబ్ద విప్లవానికి దారితీశాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్లడంలో భాజపా విజయం సాధించింది. సామాజిక సమీకరణాలను తమకు అనుకూలంగా మార్చుకోవడమే కాకుండా, పరిపాలనలో మార్పు రావాలని కోరుకున్న యువత మరియు మధ్యతరగతి ఓటర్లు భాజపాకు బాసటగా నిలిచారు. ఈ విజయం ద్వారా దేశంలో 21 రాష్ట్రాలలో అధికారంలో ఉన్న ఏకైక పార్టీగా భాజపా తన ప్రాబల్యాన్ని మరింత పటిష్టం చేసుకుంది.

దక్షిణ భారత రాజకీయాలలో సుదీర్ఘ కాలంగా 'మార్పు'కు వేదికగా నిలిచే కేరళ రాష్ట్రం ఈసారి కూడా తన సాంప్రదాయాన్ని కొనసాగించింది. గత ఎన్నికల్లో సాంప్రదాయక పద్ధతిని పక్కన పెట్టి వరుసగా రెండోసారి ఎల్డీఎఫ్‌కు పట్టం కట్టిన కేరళ ప్రజలు, ఈసారి తిరిగి యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్‌ను అధికార పీఠంపై కూర్చోబెట్టారు. 140 స్థానాల కేరళ అసెంబ్లీలో యూడిఎఫ్ 102 స్థానాలను కైవసం చేసుకుని తన సత్తా చాటగా, అధికారంలో ఉన్న ఎల్డీఎఫ్ కేవలం 35 స్థానాలకు పడిపోయింది. ప్రభుత్వ ఆర్థిక నిర్వహణలో లోపాలు, నిరుద్యోగ సమస్య, మరియు విదేశీ పెట్టుబడుల కొరత వామపక్ష కూటమి పతనానికి కారణమయ్యాయి. భారత రాజకీయ యవనికపై 2026 ఎన్నికల్లో అత్యంత సంచలనాత్మక మలుపు తమిళనాడులో వెలువడింది. దశాబ్దా లుగా ద్రవిడ మున్నేట్ర కజగం మరియు అఖిల భారత అన్నా ద్రవిడ మున్నేట్ర కజగంల మధ్యే సాగుతున్న తమిళ రాజకీయా ల్లోకి మూడవ శక్తిగా సినీ నటుడు విజయ్ ప్రవేశించడం, ఆయన స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టివికె) పార్టీ అపూర్వ విజ యాన్ని సాధించడం ఒక అద్భుతం. 234 స్థానాల తమిళనాడు అసెంబ్లీలో విజయ్ పార్టీ 108 స్థానాలను గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. దశాబ్దాల చరిత్ర కలిగిన డీఎంకే 73 స్థానాలకు, ఏఐఏడీఎంకే 53 స్థానాలకు పరిమితమయ్యాయి. ఇది ఒక నటుడి గ్లామర్ విజయం మాత్రమే కాదు, ద్రవిడ రాజకీ యాల పేరుతో సాగుతున్న అవినీతి, వారసత్వ రాజకీయాలపై తమిళ ప్రజల ఆగ్రహానికి నిదర్శనం. యువతలో ఉన్న విపరీ తమైన ఆదరణను విజయ్ తన రాజకీయ సిద్ధాంతాలతో మేళవిం చి, క్షేత్రస్థాయిలో బలమైన పునాదిని నిర్మించుకున్నారు. పారదర్శక పాలన, కులాలకు అతీతమైన రాజకీయం, మరియు తమిళ అస్తిత్వాన్ని కాపాడుతూనే ఆధునిక అభివృద్ధిని కాంక్షించే ఆయన విధానం ప్రజల్లోకి బలంగా వెళ్లింది. ఇది భవిష్యత్తులో తమిళనాడులో ద్విధ్రువ రాజకీయాలకు స్వస్తి పలికి, సరికొత్త రాజకీయ ప్రత్యామ్నాయాలకు మార్గం చూపింది.

కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో సైతం ఓటరు తీర్పు అభివృద్ధికి అనుకూలంగా వెలువడింది. 30 స్థానాలు కలిగిన పుదుచ్చేరి అసెంబ్లీలో ఎన్డీఏ కూటమి 18 స్థానాలను సాధించి తన అధికారాన్ని నిలబెట్టుకోగా, కాంగ్రెస్ పార్టీ 6 స్థానాలకే పరిమితమైంది. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం ఉంటేనే చిన్న రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని పుదుచ్చేరి ప్రజలు భావించారు. పర్యాటక రంగం, మౌలిక వసతుల కల్పనలో వచ్చిన మార్పులు ఓటర్లను ఆకర్షించాయి. స్థానిక నాయకత్వం మరియు కేంద్రం మధ్య ఉన్న అవగాహన పుదుచ్చేరిలో రాజకీయ స్థిరత్వాన్ని కలిగించింది.

ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను సమగ్రంగా పరిశీలిస్తే భారత రాజకీయాల్లో కొన్ని కీలక ధోరణులు స్పష్టమవు తున్నాయి. మొదటిది, ప్రజలు ఇప్పుడు కేవలం సిద్ధాంతాలకు మాత్రమే పరిమితం కాకుండా, ఫలితాలను ఇచ్చే 'నిష్పాక్షిక అభివృద్ధి' వైపు మొగ్గు చూపుతున్నారు. అస్సాం మరియు బెంగాల్ ఫలితాలు దీనికి నిదర్శనం. రెండవది, యువ ఓటర్ల పాత్ర గతంలో కంటే నిర్ణయాత్మకంగా మారింది. తమిళనాడులో విజయ్ పార్టీ సాధించిన విజయం, యువత ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం ఎంత ఆకలితో ఉన్నారో తెలియజేస్తోంది. మూడవది, సుదీర్ఘ కాలం అధికారంలో ఉన్న పార్టీలపై ఉన్న వ్యతిరేకత క్షేత్ర స్థాయిలో బలంగా పనిచేస్తోంది. కేరళ మరియు బెంగాల్ ఫలితాలు ఈ విషయాన్ని ధృవీకరిస్తున్నాయి. ప్రస్తుతం దేశంలోని 21 రాష్ట్రాలలో అధికా రంలో ఉండటం ద్వారా భాజపా జాతీయ రాజకీయాల్లో తిరుగు లేని శక్తిగా ఎదిగింది. తమిళనాడులో ద్రవిడ పార్టీల ఆధిపత్యాన్ని విజయ్ పార్టీ సవాలు చేయడం అనేది ప్రాంతీయ రాజకీయాల్లో వస్తున్న పెనుమార్పులకు సంకేతం. ఎన్నికల ప్రచార శైలిలో కూడా విప్లవాత్మక మార్పులు వచ్చాయి. తమిళనాడులో విజయ్ పార్టీ మరియు బెంగాల్లో భాజపా ఈ సాంకేతికతను సమర్థవంతంగా వాడుకున్నాయి.2026 పంచ రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు భారత ప్రజాస్వామ్య వ్యవస్థలోని వైవిధ్యతను మరియు చైతన్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాయి. అభివృద్ధి పరమావధిగా, ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా సాగే రాజకీయాలకే భవిష్యత్తు ఉంటుందని ఈ ఫలితాలు స్పష్టం చేశాయి. జాతీయ రాజకీయ యవనికపై కొత్త నాయకత్వాలు, సరికొత్త సమీకరణాలు ఆవిర్భవించడంతో భారత ప్రజాస్వామ్యం మరింత పరిణతి చెందిన దిశగా అడుగులు వేస్తోంది. ఈ చారిత్రక పరిణామాలు దేశ రాజకీయ దిశను, దశను మార్చి వేస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# సవాళ్లను అధిగమిస్తేనే 'విజయం'!



నాటకీయతకు మారుపేరైన తమిళనాడు రాజకీయాలలో ఇప్పుడు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. అన్ని రకాల ఎన్నికల సర్వేల అంచనాలను తల్లకిందులు చేస్తూ ఎన్నికల ఫలితాలు వెలువడినాయి. కొమ్ములు తిరిగిన ఎన్నికల విశ్లేష కులూ, యోధానయోధులైన నాయకుల అంచనాలను సైతం ఇవి తలకిందులు చేశాయి.ఎవరి ఊహకూ అందని విధంగా వెలువడిన ఈ ఫలితాలను ఇప్పుడు ఎవరికి తోచినట్టుగా వారు విశ్లేషిస్తున్నారు. 234 సభ్యులు గల తమిళనాడు అసెంబ్లీలో 108స్థానాలను గెలుచుకుని తమిళ సూపర్



స్టార్ జోసెఫ్ విజయ్ చంద్రశేఖర్ స్థాపించిన తమిళగ వెట్రి కజగమ్ (టివికె) అతిపెద్ద పార్టీగా అవతరించింది. దశాబ్దాల చరిత్ర, పాలనానుభవం గల ద్రవిడ పార్టీలు డిఎంకె, ఆల్ ఇండియా అన్నాడిఎంకెలు టివికె తరువాత రెండు మూడు స్థానాలకు పరిమితం అయ్యాయి. ఈ రెండు పార్టీలు కూటములతో కలుపుకుని వాటికి వరుసగా 73,54 స్థానాలు వచ్చాయి. ఈ ఫలితాలు ఎందుకు ఇలా వెలువడ్డాయి? అందుకు కారణం ఏమిటన్నది అందరిలోనూ ఆసక్తిని రేపుతున్న ప్రశ్న.

దేశ రాజకీయాలలో తమిళనాడుది ఎప్పుడూ ప్రత్యేక స్థానమే. ద్రవిడ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ, ఉత్తరాదికి చెందిన జాతీయ పార్టీల ఆధిపత్యాన్ని సవాలు చేయడం, అందులో భాగంగా, హిందీవ్యతిరేకతను ఇక్కడి అన్ని పార్టీలూ తమ రాజకీయ రథానికి ఇరుసుగా భావిస్తాయి.అలాంటి పార్టీలు అప్పటికే ఐదారు ఉండగా వాటిని కాదని ఇటీవలే కొత్తగా పుట్టిన పార్టీ వైపు ప్రజలు ఎందుకు మొగ్గు చూపారన్నది పరిశీలకులను ఆశ్చర్యపరిచింది.

ఎన్నికల ప్రక్రియలో హామీలు అతి ముఖ్యమైనవి. మహిళా సంక్షేమం, రైతులకు మద్దతు, యువకులకు ఉపాధి, నిరుద్యోగ భృతి, ఉద్యోగాల కల్పన, మద్యపాన నిషేధం లాంటి హామీలు అన్ని పార్టీల మేనిఫెస్టోలలో సాధారణంగా కనిపిస్తున్నా, అన్నా డీఎంకే పార్టీ ఒక అడుగు ముందుకు వేసి మహిళలతో పాటు పురుషులకు కూడా ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తానని వాగ్దానం చేసింది. అలాగే టీవీకె పెళ్ళికా నున్న యువతులకు 8 గ్రాముల బంగారం ఉచితంగా ఇస్తామనీ, తమ మంత్రివర్గంలో ఏఐ మంత్రిత్వ శాఖను కొత్తగా సృష్టిస్తానని అదనంగా హామీ ఇచ్చింది. తమిళ పార్టీలు ఇచ్చిన హామీలన్నీ గతంలో కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ, ఆంధ్రలో తెలుగుదేశం కూటమి ఇచ్చిన హామీలను గుర్తు చేస్తున్నవి. ప్రధాన పార్టీలైన డిఎంకె, అన్నాడిఎంకెతో పోలిస్తే విజయ్ పార్టీ టివికె ఇచ్చిన హామీలు తక్కువేమీ కాదు. అన్ని పార్టీల ఎన్నికల ప్రణాళికలు దాదాపుగా ఒకేలా ఉన్నప్పుడు ప్రజలు విజయ్ పార్టీ టీవీకె వైపుకు ఎందుకు మొగ్గారు అన్నది ప్రశ్న. ఎందుకంటే మిగతా పార్టీలకు ప్రజలు అప్పటికే అవకాశం ఇచ్చి ఉన్నారు. వాళ్ల పరిపాలనా సామర్థ్యం, హామీల అమలును ప్రత్యక్షంగా చూశారు. కాగా కొత్తగా పెట్టిన టీవీకె పార్టీకి ఆ చరిత్ర లేదు. దాని అధ్యక్షుడు సినిమా హీరో కావడం, యువకులు, మహిళలు, నిరుద్యోగుల్లో విజయ్ పట్ల ఉన్న క్రేజ్, అవినీతి నిర్మూలనపై ఆయన ఇచ్చిన హామీ ప్రజలు ఈ పార్టీపై ఆశలు పెంచుకోవడానికి కారణాలుగా కనిపిస్తున్నాయి.

ఆదిలోనే హంసపాదు అన్నట్లుగా విజయ్‌కు ప్రభుత్వ ఏర్పాటు రూపంలో తొలిసమస్య ఎదురయింది. టీవీకె శాసన సభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నికైన వెంటనే విజయ్ తమను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలనీ, రెండు వారాలలో తాను బలనిరూపణ చేసుకుంటానని గవర్నర్‌ను కోరడం జరిగింది. కానీ గవర్నర్ వైపు నుంచి వెంటనే సానుకూల సంకేతమయితే ఇంకా రాలేదు. ఆహ్వానం అందుతుందా లేక ఏమైనా తిరకాసులు పెట్టే అవకాశం ఉందా అనేది వెంటనే తెలియదు. ఒకవేళ ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానం అందితే, టివికెకు కనీసం పది మంది సభ్యుల మద్దతు ఉంటే తప్ప ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేని స్థితి ఉంది. బీజేపీ కూటమి మద్దతు కోరితే తాను ప్రకటించిన లక్ష్యాలకు విరుద్ధంగా వ్యవహ రించినట్లు అవుతుంది. అలాగే డీఎంకే మద్దతు తీసుకుంటే ప్రజల యొక్క ఆకాంక్షలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు అవుతుంది. అందుకని ఆయన ఆచితూచి వ్యవహరించాల్సి ఉంటుంది. ఇక ఆయనకు ఉన్న ఒకే ఒక్క మార్గం చిన్నాచితకా పార్టీల మద్దతును కూడగట్టుకోవడం. ఆ పనిని ఇప్పటికే ప్రారంభించి నట్లు తెలుస్తున్నది. కాంగ్రెస్ అధిష్టానంతో విజయ్ మాట్లాడినట్లుగా ఆ పార్టీ ఢిల్లీ పెద్దలు ధ్రువీకరించారు. విసికె, సిపిఐ, సిపిఎం లాంటి మిగతా పార్టీలు కూడా సానుకూలంగానే ఉన్నట్లు చెబుతున్నారు. టివికె కూడా ఆయా పార్టీలకు వాళ్ల వాళ్ల ఇష్టాయిష్టాలను బట్టి మంత్రి పదవులు ఇవ్వజూపినట్లుగా తెలుస్తోంది. అయితే ఆయా పార్టీలు ఎలాంటి షరతులు పెడుతున్నాయో విజయ్ ముందు ఏమేమి కోరికలు ఏకరువు పెడుతున్నాయో స్పష్టత వస్తే తప్ప గవర్నమెంట్ ఏర్పాటుకు మార్గం సుగమం కాదు. ఇక ప్రభుత్వ ఏర్పాటు, పార్టీల మద్దతులాంటి బాలారిష్టాలను దాటి ఆయనే అధికార పగ్గాలు చేపట్టినా విజయ్ కు అతి ముఖ్యమైన సవాళ్లు ఉండనే ఉన్నాయి. ఒకటి ఆయనకు పాలనానుభవం బొత్తిగా లేకపోవడం, రెండు అవినీతి, నిరుద్యోగం.. గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన సమస్యలు. వీటికి తోడు భయపెడుతున్న ఖజానా. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలంటే 2లక్షల కోట్లకు పైగా ఖర్చు అవుతుందని అప్పుడే ఒక అంచనాతో కూడిన విమర్శ బయటకి వచ్చింది. ఇంతటి భారీ వ్యయాన్ని భరించడం సాధ్యమేనా అన్న అనుమానం ఎవరికైనా రావడం సహజమే కదా! పైగా ఎంతో పాలనా అనుభవం ఉన్న పార్టీలు రెండు ప్రతిపక్షంలో ఉండగా ఆయన తాను ఇచ్చిన హామీలను ఎలా నెరవేరుస్తాడో, ఎంత సమర్థవంతంగా పాలన సాగిస్తాడోనన్నదానిపైనే ఆయన రాజకీయ జీవితం ఆధారపడి ఉంటుంది.

**- గుండెబోయిన శ్రీనివాస్**
9985194697

# కూలుతున్న 'ఇండియా కూటమి'

భారత రాజకీయాల్లో ప్రస్తుతం వేగంగా మారుతున్న పరిస్థితులు ఒక కొత్త దిశను స్పష్టంగా సూచిస్తున్నాయి. ఇటీవల వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల ఫలితాలను లోతుగా పరిశీలిస్తే, దేశ రాజకీయ ముఖచిత్రం గణనీయంగా మారుతున్నట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా, ప్రతిపక్షాల కూటమి అయిన ఇండియా అనేక బలహీనతలకు గురవుతున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తుండగా, మరోవైపు బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీయే మరింత సమన్వయంతో, బలంగా ముందుకు సాగుతోంది. ఈ మార్పు కేవలం ప్రాంతీయ ఎన్నికలకే పరిమితం కాకుండా, 2024 సార్వత్రిక ఎన్నికల తర్వాతి దశలో జాతీయ స్థాయిలో ఒక క్రమబద్ధమైన ధోరణిగా కనిపిస్తోంది. ప్రజల్లో నాయకత్వ స్థిరత్వం, అభివృద్ధి వైఖరి, మరియు స్పష్టమైన విధానాల పట్ల ఉన్న ఆకర్షణ బీజేపీకి మరింత మద్దతును సమకూరుస్తుండగా, ప్రతిపక్షాల్లోని విభేదాలు, అస్పష్టమైన వాగ్దానాలు వాటి ప్రభావాన్ని తగ్గిస్తున్నాయి.

పుదుచ్చేరిలో ఎన్డీయే అధికారంలోకి రావడం దాదాపు ఖాయమవుతున్న సమయంలో, కేరళలో మాత్రం కాంగ్రెస్ నేతృత్వంలోని యుడీఎఫ్ విజయం సాధించబోతోంది. ఇది దేశవ్యాప్తంగా రాజకీయ వైవిధ్యాన్ని సూచిస్తున్నప్పటికీ, ప్రధానంగా బీజేపీ ఆధిపత్యం పెరుగుతున్న దిశలోనే పరిస్థితులు ఉన్నాయని చెప్పాలి. అత్యంత ఆసక్తికరమైన మార్పు తమిళనాడులో చోటుచేసుకుంటోంది. నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న డీఎంకే మరియు అన్నాడీఎంకే ఆధిపత్యానికి ఇప్పుడు కొత్త సవాల్ ఎదురైంది. సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం వేగంగా ఎదుగుతూ ఈ రెండు ప్రధాన పార్టీలకు గట్టి పోటీ ఇస్తోంది. ముఖ్యంగా యువత, మధ్యతరగతి, మరియు కొత్త రాజకీయ చైతన్యం కోరుకునే వర్గాలు విజయ్ వైపు ఆకర్షితులవుతున్నారు. ఈ పరిణామం ద్రవిడ పార్టీల దీర్ఘకాల ఆధిపత్యంపై ప్రశ్నార్థకం గుర్తు వేస్తూ, తమిళనాడు రాజకీయాల్లో త్రిముఖ పోటీకి నాంది పలికింది.

తమిళనాడులో జరిగిన పరిణామాలు మరింత ఆసక్తికరంగా మారాయి. డీఎంకే నాయకులు సనాతన ధర్మంపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ప్రజల్లో తీవ్ర చర్చకు దారి తీశాయి. ఈ వ్యాఖ్యలు కొన్ని వర్గాల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేపగా, మరికొన్ని వర్గాలు వాటిని హేతువాద దృక్పథంగా సమర్థించాయి. అయితే, ఎన్నికల ఫలితాలను విశ్లేషించిన విశ్లేషకులు ఈ వ్యాఖ్యలు డీఎంకేకు నష్టం కలిగించాయని, ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లోని సాంప్రదాయ ఓటర్లను దూరం చేశాయని అభిప్రాయపడుతున్నారు. ఈ పరిస్థితిని సద్వినియోగం చేసుకున్న టీవీకే పార్టీ, రాజకీయ ఖాళీని భర్తీ చేస్తూ ప్రజల్లో అద్భుతమైన ఆదరణ పొందింది. ఒకప్పుడు అధికారంలో ఉన్న డీఎంకే, ప్రస్తుతం కొన్ని స్థానిక ఎన్నికల్లో మూడో స్థానానికి పడిపోయే పరిస్థితి ఏర్పడటం ఈ మార్పుకు స్పష్టమైన నిదర్శనం. టీవీకే బలం రోజురోజుకు పెరుగుతుండటం, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ప్రాంతం రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చే అవకాశం ఉంది.

ఇక పశ్చిమ బెంగాల్ విషయానికి వస్తే, అక్కడి రాజకీయాలు మరో కీలక మలుపు తిప్పుకున్నాయి. మమతా బెనర్జీ ప్రభుత్వంపై వచ్చిన అవినీతి ఆరోపణలు, పోస్టల్ రిక్రూట్మెంట్ స్కామ్ నుంచి స్కూల్ సర్వీస్ కమిషన్ అవినీతి వరకు అనేక వివాదాలు తెరపైకి వచ్చాయి. అలాగే, శాంతిపూర్, త్రినగర్ వంటి ప్రాంతాల్లో జరిగిన సామాజిక ఘటనలు, పరిపాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. విపక్షాలను అణచివేస్తున్నారనే ఆరోపణలు, మహిళల భద్రత, మతపరమైన ఉద్రిక్తతలు వంటి అంశాలు కూడా ప్రజాభిప్రాయాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేశాయి. ఈ నేపథ్యంలో బీజేపీ అక్కడ తన స్థానాన్ని బలపరచుకుంటూ, పంచాయతీ ఎన్నికల నుంచి లోక్సభ ఎన్నికల వరకు వరుస విజయాలు సాధించింది. బెంగాల్లో తృణమూల్ కాంగ్రెస్ ఇప్పటికీ ప్రధాన పార్టీగా ఉన్నప్పటికీ, బీజేపీ రెండో పార్టీగా బలంగా ఎదగడం, కొన్ని ప్రాంతాల్లో అధికారాన్ని చేజిక్కించుకోవడం దేశ రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది. ఇది తూర్పు భారతంలో బీజేపీ విస్తరణకు ఒక దళమైన పునాదిని వేసింది.

ఈ మొత్తం పరిస్థితులను సమగ్రంగా పరిశీలిస్తే, ఇండియా కూటమిలోని ప్రధాన పార్టీలైన తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, సమాజ్వాదీ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ వంటి భాగస్వాములు ఎన్నికల్లో గణనీయంగా వెనుకబడటం గమనించదగ్గ విషయం. 2024 లోక్సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్, టీఎంసీ, ఎస్పీ, డీఎంకే, ఆర్జేడీ, జేడీ(ఎస్) వంటి పార్టీలు ఒకే వేదికపైకి వచ్చి బీజేపీకి వ్యతిరేకంగా పోటీ చేశాయి. అయినప్పటికీ, ప్రజలు ఆశించిన ఫలితాలను పూర్తిగా సాధించలేకపోయాయి. బీజేపీ ప్రత్యక్ష మెజారిటీని కోల్పోయినా (240 స్థానాలు), తన మిత్రపక్షాలైన టీడీపీ, జేడీ(యూ), శివసేన (శిండే), లోక్ జనశక్తి పార్టీ (పశుపతి కుమార్ పారశ్) మద్దతుతో 293 స్థానాలతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. దీన్నే ఇండియా కూటమి ఒక మోస్తరు ప్రతిఘటనగా భావించినా, వాస్తవంలో బీజేపీ నాయకత్వం, సంకీర్ణ నిర్వహణలో ప్రతిపక్షాల కంటే చాలా ముందుంది.

2024 ఎన్నికల అనంతరం జరిగిన రాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ తన వ్యూహాలను మరింత బలోపేతం చేసుకుంటూ వరుస విజయాలు సాధించింది. హర్యానాలో మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవడం, మహారాష్ట్రలో మహాయుతి కూటమి విజయం సాధించడం, బీహార్లో ఎన్డీయే ఘన విజయం సాధించి నితీష్ కుమార్ ముఖ్యమంత్రిగా కొనసాగడం, మరియు ఢిల్లీలో 27 ఏళ్ల తర్వాత బీజేపీ అధికారంలోకి రావడం - ఇవన్నీ ఎన్డీయే బలం పెరుగుతున్నదనడానికి స్పష్టమైన ఉదాహరణలు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్గఢ్ వంటి రాష్ట్రాల్లో ఇప్పటికే బీజేపీ అధికారంలో ఉంది. ఈ విజయాలు కేవలం ప్రాంతీయ పరిమితి కాకుండా, జాతీయ స్థాయిలో ప్రభావాన్ని చూపుతున్నాయి. ప్రతిపక్షాలకు చెందిన ముఖ్యమంత్రులు ఉన్న రాష్ట్రాల సంఖ్య తగ్గుతుండగా, బీజేపీ ప్రభావం ఉత్తరం నుండి దక్షిణం వరకు, తూర్పు నుండి పశ్చిమం వరకు విస్తరిస్తోంది.

ఇండియా కూటమి భవిష్యత్తుపై ఇప్పుడు అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 2029 లోక్సభ ఎన్నికల వరకు ఈ కూటమి కొనసాగుతుందా అనే ప్రశ్న రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కూటమిలోని పార్టీల మధ్య వ్యూహాత్మక విభేదాలు నెలకొన్నాయి. ఒకవైపు కాంగ్రెస్ తనను ప్రధాన కేంద్రంగా నిలపాలని ప్రయత్నిస్తుండగా, తృణమూల్, డీఎంకే, ఆప్, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ వంటి ప్రాంతీయ పార్టీలు తమ స్వంత ప్రయోజనాలను ముందుంచుతున్నాయి. నాయకత్వ సమస్యలు, సీట్ల పంపకాలపై విభేదాలు, మరియు బీజేపీకి వ్యతిరేకంగా ఏకీకృత ప్రచారాన్ని నిర్మించడంలో విఫలమవడం ఈ అనిశ్చితికి ప్రధాన కారణాలు. రాహుల్ గాంధీ నేతృత్వంలోని 'భారత్ జోడో యాత్ర' కూటమికి కొంత ఊపునిచ్చినా, ఓట్లుగా మార్చడంలో పూర్తి విజయం సాధించలేదు. ప్రస్తుత పరిస్థితిలో, ఈ కూటమి విచ్ఛిన్నమైతే, ప్రతిపక్ష ఓట్లు మరింత చెదిరిపోయి, బీజేపీకి మరింత సులభతరం అవుతుంది.

ఇక ఉత్తరప్రదేశ్ వంటి కీలక రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారాయి. సమాజ్వాదీ పార్టీ గత పది సంవత్సరాలుగా అధికారానికి దూరంగా ఉండటం, బహుజన్ సమాజ్ పార్టీ ప్రభాహీనంగా మారడం, మరియు కాంగ్రెస్ పూర్తిగా బలహీనపడటం, బీజేపీకి అక్కడ ఏకైక ప్రతిపక్షంగా ఎస్పీని మిగిల్చాయి. అయినప్పటికీ, స్వల్ప మైనారిటీ ఓట్లు, యువతలో నిరాశ, మరియు స్థానిక సమస్యల కారణంగా 2024 ఎన్నికల్లో బీజేపీకి యూపీలో కొంత నష్టం వాటిల్లింది. కానీ దాన్ని బీజేపీ త్వరగా సరిదిద్దుకుంటుందని నిపుణులు అంటున్నారు. బీహార్లో ఆర్జేడీ బలహీనపడటం, తేజస్వి యాదవ్ ప్రభావం పరిమితమవడం, మరియు కాంగ్రెస్ ప్రభావం తగ్గిపోవడం కూడా ఎన్డీయేకు అనుకూల పరిస్థితులను సృష్టిస్తోంది. నితీష్ కుమార్ స్థానిక ప్రజాదరణ, మహిళల నిరక్షరాస్యత తగ్గింపు, పథ్య ప్రణాళికా కేంద్రాలు వంటి పథకాలు ఆయనకు ఇప్పటికీ మద్దతునిస్తూనే ఉన్నాయి. జార్ఖండ్, ఒడిశా వంటి రాష్ట్రాల్లో కూడా బీజేపీ తన ప్రభావాన్ని పెంచుకుంటుందని సర్వేలు సూచిస్తున్నాయి.

ఈ పరిణామాలన్నింటినీ ఒకే దృష్టితో చూస్తే, దేశ రాజకీయాల్లో ఒక కొత్త సమీకరణం రూపుదిద్దుకుంటోంది. బీజేపీ తన వ్యూహాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, సామాజిక విభజనలను దాటి, ప్రజల్లో 'డెవలప్మెంట్ పొలిటిక్స్'ను నాటుతూ ముందుకు సాగుతోంది. మోదీ వ్యక్తిగత ప్రజాదరణ, హిందుత్వ కేంద్ర భావన, కేంద్ర పథకాల ప్రభావవంతమైన అమలు, మరియు ప్రతిపక్షాల లోపాలే ఈ విజయాలకు మూలం. ఇండియా కూటమి అంతర్గత విభేదాలు, వ్యూహాత్మక లోపాలు, మరియు స్పష్టమైన ప్రత్యామ్నాయ దృశ్యం లేకపోవడంతో వెనుకబడుతోంది. అయితే, రాజకీయాలు ఎప్పటికీ స్థిరంగా ఉండబోవు. ఇప్పుడు కనిపిస్తున్న ఈ ధోరణి రేపు మారొచ్చు. ఆర్థిక మందగమనం, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వంటి జాతీయ సమస్యలు ఎప్పటికప్పుడు ప్రభుత్వ వ్యతిరేకతను రేపగలవు. అలాగే, ప్రాంతీయ పార్టీలు స్థానికంగా బలంగా ఉన్నాయి. కాబట్టి రాబోయే అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికలు ఈ సమీకరణాలను మరింత స్పష్టంగా నిర్ధారిస్తాయి. ప్రస్తుతం కనిపిస్తున్న ధోరణి ప్రకారం, ఇండియా కూటమి బలహీనపడుతున్నదనే భావన ఉన్నప్పటికీ, భవిష్యత్తులో రాజకీయ పరిస్థితులు ఎలా మారతాయో చెప్పడం కష్టమే.

మొత్తానికి, ప్రస్తుతం భారత రాజకీయాల్లో బీజేపీ మరియు ఎన్డీయే ఆధిపత్యం పెరుగుతున్న క్రమంలో, ప్రతిపక్షాల కూటమి ఇండియా చీలికల అంచున ఉన్నట్లు కనిపిస్తోంది. ప్రజల అభిప్రాయం, నాయకత్వ నిర్ణయాలు, సామాజిక-ఆర్థిక అంశాలు, అంతర్జాతీయ పరిస్థితులు, మరియు ఎన్నికల సంస్కరణలు ఈ మార్పులను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ప్రస్తుత ప్రభుత్వం తన రెండో టర్మ్ ముగింపు దశలో కీలక నిర్ణయాలు తీసుకుంటుండగా, ప్రతిపక్షాలు పునర్వ్యవస్థీకరణకు ప్రయత్నిస్తున్నాయి. ఒక వైపు బీజేపీ తదుపరి దశలో గెలుపు అవకాశాలు మెరుగ్గా కనిపిస్తే, మరోవైపు ప్రతిపక్షాలు ఏకమైతే మాత్రం అవి ముందు రావచ్చు. అందువల్ల, రాబోయే రెండేళ్ల కాలం భారత రాజకీయాలకు అత్యంత కీలకంగా మారనుంది. ప్రజలు ఎలా ఆలోచిస్తారు, నాయకులు ఎలా వ్యూహాలు రచిస్తారు అనేదానిపై ఆధారపడి దేశ రాజకీయ భవితవ్యం నిర్ణయమవుతుంది. ఈ సందిగ్ధతల మధ్య, రాజకీయ విశ్లేషకులు, పత్రికలు, ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నిజానికి, ప్రజాస్వామ్యంలో మార్పు ఒకే ఒక్క స్థిరమైన అంశం.

**- డా. ఏలూరు యాదయ్య**

## అనంతపురం ట్రాఫిక్ పోలీసులకు వేసవి సురక్షిత ఉపకరణలు అందజేసిన జిల్లా ఎస్పీ జగదీష్




**అనంతపురం. మే 06 మనం న్యూస్ ప్రతినిధిః** అనంతపురం జిల్లాలోని 100 మంది ట్రాఫిక్ పోలీసులకు బుధవారం జిల్లా ఎస్పీ జగదీష్ వేసవి సురక్షిత ఉపకరణాలు అందజేశారు.కూల్ కళ్లద్దాలు, లీటర్ వాటర్ బాటిల్, ఓఆర్ఎస్ ప్యాకెట్స్, క్యాప్, తదితర ఉపకరణలు కల్గిన కిట్లను ఎస్పీ అందజేశారు. మండుటెండలో ట్రాఫిక్ విధుల్లో ఉన్న సిబ్బంది సంక్షేమం కూడా ముఖ్యమన్నారు.వేసవిలో వడదెబ్బకు గురికాకుండా, వేడి బారినకుండా ఈ సురక్షిత ఉపకరణలు దోహదం చేస్తాయని ఆయన వెల్లడించారు. ఎండ వేడిమికి తట్టుకునేలా సిబ్బందికి వేసవి సురక్షిత ఉపకరణలు అందజేయడానికి సహకరించిన కిమ్స్ సవీరా హాస్పిటల్ సురేంద్రరెడ్డి, సహేబా జగదీష్ , రూపాలి గిఫ్ట్ అండ్ నావల్టీస్ అనీల్ లకు జిల్లా ఎస్పీ జగదీష్ కృతజ్ఞతలు తెలియజేసి వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, సి.ఐ వెంకటేష్ నాయక్, అనంతపురం కిమ్స్ సవీర హాస్పిటల్ నిర్వాహకులు సురేంద్రరెడ్డి, సహేబా జగదీష్ , రూపాలి అనీల్ , తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భూమి రెవెన్యూ సమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించడమే లక్ష్యం

**నేటి నుండే (మే7) ఒక నెల – ఒక గ్రామం – నాలుగు సందర్శనలు' (వన్ మంత్ – వన్ విలేజ్ – ఫోర్ విసిట్స్ ) కార్యక్రమం ప్రారంభం**
**గ్రామ స్థాయిలోనే భూ సమస్యల పరిష్కారం- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**
**జిల్లా సంయుక్త కలెక్టర్ సి. విష్ణు చరణ్**



**అనంతపురం, కలెక్టరేట్ మే 06: మనం న్యూస్** ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఒక నెల - ఒక గ్రామం - నాలుగు సందర్శనలు' (వన్ మంత్ - వన్ విలేజ్ - ఫోర్ విసిట్స్ ) కార్యక్రమం ద్వారా ప్రజల భూమి మరియు రెవెన్యూ సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించడమే లక్ష్యమని, నేటి మే నెల మొదటి గురువారం నుండి మన జిల్లాలో సదరు కార్యక్రమం ప్రారంభం అవుతుందని అనంతపురము జిల్లా సంయుక్త కలెక్టర్ సి. విష్ణు చరణ్ రెవెన్యూ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. గ్రామాలను రెవెన్యూ వివాద రహిత గ్రామాలుగా మార్చడం, భూ రికార్డుల ఖచ్చితత్వం మరియు పారదర్శకతను పెంచడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు. పదేపదే వచ్చే ఫిర్యాదులను తగ్గించి, ప్రజలకు వారి గ్రామంలోనే వేగవంతమైన రెవెన్యూ సేవలు అందించేందుకు ఈ ప్రత్యేక కార్యాచరణ రూపొందించబడిందనీ అన్నారు.

**కార్యక్రమ అమలు తీరు:**

ప్రతి మండలంలో నెలకు ఒక రీ సర్వే చేసిన గ్రామాన్ని, అధికంగా రెవెన్యూ సంబంధిత సమస్యలు ఉన్న గ్రామాలను తహసీల్దార్ ఎంపిక చేసి, ప్రతి నెల ప్రతి గురువారం సంబంధిత అధికారులు ఆ గ్రామాన్ని సందర్శిస్తారు. ఒకవేళ గురువారం సెలవు దినం అయినచో మరుసటి పనిదినం రోజున ఈ కార్యక్రమాన్ని తప్పకుండా నిర్వహించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్వహించకుండా ఉండరాదు. తహశీల్దార్, ఎంపీడీవో , సర్వేయర్, ఎమ్మార్ఐ , అటవీ శాఖ, దేవాదాయ శాఖ అధికారులు వారి శాఖ పరిధిలోని భూములు ఉంటే వారు మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి పరిష్కరించడం.

**నాలుగు సందర్శనల వివరాలు:**

మొదటి గురువారం (ఫిర్యాదుల నమోదు): ప్రజల నుండి అసైన్డ్ భూములు, 22-ఎ , చెరువు పోరంబోకు, సర్వే సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తారు. సాధ్యమైన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించి, మిగిలినవన్నీ పి జి ఆర్ ఎస్ పోర్టల్లో నమోదు చేస్తారు. రెండవ గురువారం (పరిశీలన): స్వీకరించిన దరఖాస్తులపై ఫీల్ వెరిఫికేషన్ మరియు రికార్డుల పరిశీలన నిర్వహిస్తారు. మూడవ గురువారం (పరిష్కారం): విచారణ పూర్తయిన దరఖాస్తులపై తుది నిర్ణయం తీసుకుని, మ్యుటేషన్ లేదా ఆర్ ఓ ఆర్ సవరణ తదితర రెవెన్యూ అంశాలపై ఆదేశాలు జారీ చేస్తారు. నాల్గవ గురువారం (ముగింపు): గ్రామంలో గ్రామ సభ నిర్వహించి, పరిష్కరించిన సమస్యల జాబితాను ప్రకటిస్తారు. కోర్టు కేసులు మినహా మిగిలిన అన్ని ఫిర్యాదులను పరిష్కరించి, సదరు గ్రామాన్ని 'జీరో పెండెన్సీ విలేజ్' (జీరో పెండెన్సీ విలేజ్ ) గా తీర్చిదిద్దుతారు. ఈ కార్యక్రమం ద్వారా రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంయుక్త కలెక్టర్ సి. విష్ణు చరణ్ కోరారు. దీనివల్ల ప్రభుత్వ పాలనపై ప్రజల్లో నమ్మకం మరింత పెరుగుతుందని, ఆ దిశలో రెవెన్యూ అధికారులు పనితీరు ఉండాలనీ అధికారులను జేసి ఆదేశించారు.

# గ్రామీణ ప్రాంతాలు పట్టణీకరణ వైపు విఎంఆర్డిఏ అడుగులు



**విశాఖపట్నం మే 6 మనం న్యూస్ :** వి.ఎం.ఆర్.డి.ఏ సమావేశమందిరంలో బుధవారం చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ అధ్యక్షతన జరిగిన అథారిటీ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. వి ఎం ఆర్ డి ఏ పరిధిలో అన్ని నియోజకవర్గాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులు, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు గురించి సమావేశంలో కూలంకుషంగా చర్చించారు. గ్రామీణ ప్రాంతాలను పట్టణీకరణ దశగా అభివృద్ధి చేసేందుకు పలు అభివృద్ధిపనులను చేపట్టే దిశగా విఎంఆర్డిఏ చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. జివిఎంసి పరిధి దాటి వి ఎం ఆర్ డి ఏ పరిధిలో ఉన్న ప్రాంతాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, నర్సీపట్నం, విజయనగరం, చీపురుపల్లి, నెల్లిమర్ల, పాయకరావు పేట తదితర మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాల కల్పించేందుకు ముఖ్యంగా కాలువలు, రహదార్లు, పార్క్ ల అభివృద్ధికి నిధులు కేటాయించడం జరిగిందన్నారు. గాజువాక లో స్పోర్టట్స్ విలేజ్ నిర్మాణానికి సుమారు రూ.9 కోట్లని కేటాయిస్తున్నారని వివరించారు. అదేవిధంగా ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు విశాఖ ను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు తీసుకున్న నిర్ణయాలను వివరించారు. కైలాసగిరి పై త్రిశూల్ ను ఈ నెల 9 తేదీన ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు.
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి దారితీసే ప్రధాన రహదారుల నిర్మాణం అనుకున్న సమయానికి పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని, అలానే ఆయా రహదారుల్లో డెకరేటివ్ విద్యుత్ స్తంభాల ఏర్పాటు, రహదారి మధ్యలో పచ్చదనం పెంపొందించటం, అవసరమైన ప్రాంతాల్లో కాలువలు నిర్మాణం కోసం నిధులు కేటాయించామని వివరించారు. సెంట్రల్ పార్క్ ఆవరణలో యువగళం యాంటీ డ్రగ్ పార్క్ నిర్మాణం 3 నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళికను సిద్ధం చేశామని వివరించారు. వి ఎం ఆర్ డి ఏ చెందిన అన్ని భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్ భరత్, మాట్లాడుతూ వి.ఎం.ఆర్.డి.ఏ ఇటీవల కొత్తగా రూపొంచించిన విస్టా యాప్ వినియోగంతో ఆదాయం గణనీయంగా వృద్ధిచెందిందన్నారు. అనకాపల్లి, విజయనగరం లలో ఉన్న జోనల్ ఆఫీసుల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కార్యకలాపాలను అతిత్వరలో పూర్తి స్థాయిలో చేపడతామన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్ సురేష్ కుమార్, విశాఖపట్నం కలెక్టర్ శ్రీ అభిషిక్త్ కిషోర్, జీవీఎంసీ కమీషనర్ కేతన్ గార్గ్., ఏపీ ఈపీడీసీఎల్ సిఎండి పృధ్వీ తేజ్, అనకాపల్లి జాయింట్ కలెక్టర్ వర్చువల్ గా పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ మధుసూదనరావు, కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన గణాంకాధికారి హరిప్రసాద్ డీఎఫ్ఓ శిరీష పాల్గొన్నారు.

## లేపాక్షి వీరభద్రస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.4,48,531



**లేపాక్షి, మే 6( మనం న్యూస్):** లేపాక్షి శ్రీ వీరభద్ర స్వామి దేవాలయంలో శాశ్వత హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించారు. గత నాలుగు నెలలకు గాను హుండీలో మొత్తం రూ.4,లక్షల 48,వేల 531 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.హెచ్. నరసింహమూర్తి తెలిపారు.ఈ హుండీ లెక్కింపు కార్యక్రమానికి పర్యవేక్షణాధికారిగా బి. నాగరత్నమ్మ వ్యవహరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు వి. రవీంద్రనాథ్, కేంద్ర పురావస్తు శాఖ రాము, ఆలయ సిబ్బంది మరియు భక్తాదులు పాల్గొన్నారు.

భక్తుల సహకారంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఈ సందర్భంగా ఆలయ అధికారులు తెలిపారు.

## ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డుకు ఆర్థిక భరోసా



- **రూ.4.03 లక్షల చెక్కు అందజేత**
- **జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి**

**శ్రీకాకుళం క్రైమ్: మనం న్యూస్:మే 6** జిల్లా పోలీసు శాఖలో హోంగార్డుగా విశేష సేవలందించి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన పెద్దింటి శంకర్ రావుకు ఆర్థిక సహాయంగా రూ. 4.03 లక్షల చెక్కును జిల్లా ఎస్పీ శ్రీ కె.వి. మహేశ్వర రెడ్డి బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు.జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు సిబ్బంది అంతా స్వచ్ఛందంగా తమ ఒక్క రోజు డ్యూటీ అలవెన్సును విరాళంగా సమకూర్చడం ద్వారా ఈ మొత్తాన్ని సేకరించడం జరిగింది. ఉద్యోగ విరమణ చేసిన లేదా విధి నిర్వహణలో మరణించిన హోంగార్డుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఇటువంటి సంక్షేమ కార్యక్రమం చేపట్టడం విశేషం. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ, శంకర్ రావు పోలీసు శాఖలో అంకితభావంతో, నిబద్ధతతో సేవలందించారని ప్రశంసించారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, కుటుంబ సభ్యులతో సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు.హోంగార్డు సిబ్బంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ఒక్క రోజు డ్యూటీ అలవెన్సును అందించడం అభినందనీయమని, ఇటువంటి చర్యలు పోలీసు కుటుంబంలో ఐకమత్యాన్ని పెంపొందించడమే కాకుండా, అవసర సమయంలో పరస్పరం అండగా ఉండే భావనను బలపరుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్ర వాసులు చిరకాల కల నెరవేరింది

- **బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు**
- **పివీఎస్ మాధవన్**




**విశాఖపట్నం మే 6 మనం న్యూస్** ఉత్తరాంధ్రవాసుల చిరకాల నెరవేరిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్ మాధవ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత యూపీఏ ప్రభుత్వం రాష్ట్ర విభజన సమయంలో రైల్వే జోన్ ఖచ్చితంగా ఇవ్వాలి అని చట్టంలో పెట్టలేదనీ,కేవలం పరిశీలించాలని మాత్రమే ఉందన్నారు.నేను యువ నాయకుడు గా ఉన్న సమయం నుంచి విశాఖ రైల్వే జోన్ కోసం పోరాటం చేసామని తెలియజేశారు. ఆ సందర్భంగా తనపై కేసులు కూడా పెట్టారని తెలియజేశారు.విశాఖ రైల్వే జోన్ విషయం విభజన చక్రంలో పొందుపరచాల్సిందిగా పార్లమెంటులో ఒక్క భారతీయ జనతా పార్టీ మాత్రమే ఆ సమయంలో మాట్లాడిందన్నారు. విశాఖ రైల్వే జోన్ విషయంలో మిగతా ఏ పార్టీలు ఆ సమయంలో మద్దతు తెలప లేదన్నారు.గత రైల్వే మంత్రి సురేష్ ప్రభు ను ఆంధ్ర బిజెపి నాయకులు కలవడం జరిగింది. ఆ సమయంలో ఆయన విశాఖ రైల్వే జోన్ సుముఖత వ్యక్తం చేశారని తెలియజేశారు.వెంకయ్యనాయుడు కేంద్ర మంత్రి గా ఉన్న సమయంలో కేంద్రం లో జోన్ కోసం కృషి చేసారు.2019 లో రైల్వే జోన్ ప్రకటించారు. అనేక సంవత్సరాల కృషి రైల్వే జోన్ ఏర్పాటు.తెలంగాణ ఇవ్వడం సులువు, రైల్వే జోన్ ఇవ్వడం కంటే అనిపీయూష్ గోయల్ చెప్పేవారు అని తెలియజేసారు.రైల్వే జోన్ కార్యాలయానికి విశాఖ లో 52.25 ఏకరాలు ఇచ్చాం.భోగాపురం ఎయిర్ పోర్ట్ వచ్చాకా కొత్త వలస కీలక స్టేషన్ గా మారుతోంది,రాష్ట్రంలో 87 స్టేషన్ లను అభివృద్ధి చేస్తుతున్నారు దీని ద్వారా మరిన్ని ఉద్యోగాయాలు రావాలిదేశంలో స్వచ్ఛమైన స్టేషన్ గా విశాఖ స్టేషన్ గుర్తింపు పొందింది అరకు స్టేషన్ అనంతరం ఒడిశా ప్రాంతాలు ఉన్నాయి.కనుక ఒడిశా రాయగడ డివిజన్ లో కలిసింది. ఇచ్ఛాపురం కలవడం మంచి ప్రయోజనాలు ఉంటాయి.వైసిపి ,వామపక్షాలకు బుర్ర లేదు.అందుకే మంచి చేసిన మాట్లాడటం లేదు.నరసాపురం లైన్ అభివృద్ధి చేయాలి. అమలాపురం మీదుగా రైల్ నడవాలి.విశాఖ నుంచి హైద్రాబాద్ కి డైరెక్ట్ లైన్ ఉంటే అభివృద్ధి అవుతుంది.ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలుపై మమత బెనర్జీ రాహుల్ గాంధీ మాత్రమే వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. 50 ఏళ్ల లో హింస లేకుండా పశ్చిమ బెంగాల్లో జరిగిన ఎన్నికలు ఇవే.బిజెపి ఆవిర్భావం పశ్చిమ బెంగాల్ జరిగింది. కనుక శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ కల .నేడు నిజమైంది.బంగ్లా దేశ్ ఎప్పటికి ఈస్ట్ పాకిస్తాన్, తమిళనాడు లో టి వి కె ని స్వాగతిస్తున్నాము ద్రవిడ రాజకీయాలకు బ్రేక్ పడిందనీ, ఈ నెల 10 తరవాత మార్పు వస్తుందనీ,త్వరలో తెలంగాణ ,కర్ణాటక ఎన్నికల్లో కూడా బిజెపి వస్తుందనీ ప్రధాని నరేంద్ర మోదీ ర్యాలీ కి సన్నాహాలు చేస్తున్నారన్నారు.

# స్వచ్ఛ రథాలు ఎక్కడ ...??

**మండలానికి రెండు స్వచ్ఛ రథాలు కేటాయించిన కూటమి ప్రభుత్వం**
**ప్రభుత్వ లక్ష్యాలు, ఆదేశాల పట్ల అధికారుల నిర్లక్ష్యం**




**చోడవరం : మనం న్యూస్ మే 06ః** చోడవరం మండలంలో స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు, అధికారులు ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్వచ్ఛ రథాల జాడ ఎక్కడ అని స్థానికులు, ప్రజా సంఘాల వారు ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ భారత్ లక్ష్యంతో మండలానికి రెండు స్వచ్ఛ రథాలను కేటాయించారు. దీనిలో భాగంగానే చోడవరం మండలానికి రెండు స్వచ్ఛ రథాలను స్థానిక ఎమ్మెల్యే, అధికారులు ప్రారంభించారు. ప్రతి గ్రామం, ప్రతి ఇంటిలోనూ పనికిరాని తడి పొడి చెత్తను అందజేసి స్వచ్ఛ రథం ద్వారా వినియోగదారులకు కావలసిన వస్తువులను అందజేస్తూ,... స్వచ్ఛ భారతే లక్ష్యంగా ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ గ్రామీణ పంచాయితీరాజ్ శాఖ ఆధ్వర్యంలో మండల పరిషత్ అధికారుల పర్యవేక్షణలో స్వచ్ఛ రథాలను ప్రవేశపెట్టారు. దీనిలో భాగంగా చోడవరం మండలానికి అందజేసిన రెండు స్వచ్ఛ రథాలలో ఒకటి గ్రామాల్లో స్వచ్ఛతే హే సేవ చేస్తుండగా, మరొక స్వచ్ఛ రథాన్ని ప్రైవేటు వ్యాపారానికి వాడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల పరిధిలో 32 గ్రామాలకు సేవలందించేందుకు వినియోగించాల్సిన రెండు స్వచ్ఛ రథాలపై మండల అధికారుల పర్యవేక్షణ లోపం, నియంత్రణ కోల్పోవడంతో ప్రైవేటు ఆపరేటర్ల వినియోగంలో ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. చోడవరం మండల స్వచ్ఛ రథాలు ఒకసారి ఎంపీడీవో కార్యాలయం ఆవరణలోను, మరొకసారి పుచ్చకాయల వ్యాపారస్తుల వద్ద కనిపిస్తుండడంతో,... పలు అనుమానాలు హల్ ఛల్ చేస్తున్నాయి. దీనిపై మండల పరిషత్ అధికారులు వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి, స్వచ్ఛ రథాలను గ్రామీణ సేవలో వినియోగించాల్సిందిగా మహిళలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలి

- **8న ఇండియన్ రెడ్ క్రాస్ డే సందర్భంగా కార్యక్రమాలపై డీఆర్వో సూచనలు**

**విశాఖపట్నం, మే 06 ః** ప్రతి ఉద్యోగీ, పౌరులూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వరనాయుడు పిలుపునిచ్చారు. ఈ నెల 08న జరగనున్న ఇండియన్ రెడ్ క్రాస్ డే సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై బుధవారం ఆయన వివిధ విభాగాల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రక్తదానం ప్రాణాలను రక్షించే మహత్తర సేవ అని, దానిలో అందరూ భాగస్వామ్యం కావాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని చెప్పారు. శుక్రవారం ఉదయం 08.00 గంటలకు జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా ఇండియన్ రెడ్ క్రాస్ భవనంలో రక్తదాన శిబిరం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ప్రజల్లో రక్తదానం పట్ల అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.



# బాల్యం కేంద్రాలలో చిన్నారుల ఉచిత విద్యకు అడ్మిషన్లు ప్రారంభం

- **03 నుంచి 05 సంవత్సరాల చిన్నారులను బాల్యం విద్యా కేంద్రాల్లో చేర్పించండి.**
- **జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్**



**విశాఖపట్నం, మే 6 మనం న్యూస్ :** మహా విశాఖ నగరంలో గల బాల్యం విద్యా కేంద్రాలలో చిన్నారుల ఉచిత విద్యకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, 03 నుంచి 05 సంవత్సారాల వయస్సు గల విదార్ధినీ విద్యార్థులను బాల్యం విద్యా కేంద్రాల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులకు అవగాహన పరిచి అడ్మిషన్ల నమోదు సంఖ్య పెంచేలా కృషి చేయాలని,విద్యా కేంద్రాల్లో బాల్యం విద్యార్థినీ విద్యార్థులను ప్రాథమిక విద్యకు సంసిద్ధం చేసేలా వినూత్నమైన పద్ధతిలో సృజనాత్మకత కలిగేలా బాల్యం అధ్యాపకులు విద్యా బోధన చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ బాల్యం విద్యా కేంద్రాల ప్రాజెక్ట్ అధికారి కి, అధ్యాపకులకు ఆదేశించారు. బుధవారం జీవీఎంసీ కమీషనర్ కార్యాలయంలో జరిగిన 2026-2027 విద్యా సంవత్సరంనకు గానూ బాల్యం విద్యా కేంద్రాల్లో 03 నుంచి 05 సంవత్సారాల వయసు గల విదార్ధిని విద్యార్థుల ఉచిత విద్యకు అడ్మిషన్లను ప్రారంభానికి సర్వే నిర్వహించేందుకుగాను పూర్తి సమాచారంతో కూడిన అవగాహన పరమైన కరపత్రం , సోషల్ మీడియా పోస్టర్ లను కమిషనర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ ఈ సర్వే ద్వారా విశాఖ నగర పాలక సంస్థ పరిధిలో అంగన్వాడి కేంద్రాలు లేని ప్రాంతాలలో దారిద్య రేఖ కు దిగువన ఉన్న కుటుంభాలలో నివసిస్తున్న 03 నుంచి 05 సంవత్సారాల వయస్సు గల విదార్థిని విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమయిన ఉచిత పూర్వ ప్రాథమిక విద్య అందించేందుకు గాను ఈ సర్వే చేపట్టడం జరుగుతుందని, ప్రైవేటు కాన్వెంట్ లలో ఫీజులు చెల్లించలేని తల్లి తండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమీషనర్ తెలిపారు. 2026 - 2027 విద్యా సంవత్సరంనకు గాను బాల్యం విధ్యా కేంద్రాలలో నమోదుశాతం పెరిగే విధంగా ఈ వేసవి సెలవులలో తగు ప్రణాళికలు చేయాలని ఆదేశించారు. అంతేగాక బాల్యం విద్యా కేంద్రాలలో ఉన్నతమయిన పూర్వ ప్రాథమిక విద్య అందిస్తూ తద్వారా ప్రభుత్వ పాఠశాలలో మొదటి తరగతి యందు నమోదు శాతం పెరగాలని ఆదేశించారు.తక్కువ ఖర్చుతో విధ్యార్థులకు ఉత్తమమయిన, ఆకర్షితమైన పూర్వ ప్రాథమిక విద్యను అందిచే విధంగా బాల్యం విద్యా కేంద్రాలు ముఖ్య ఉద్దేశ్యం గా తల్లి తండ్రుల అందరికి తెలియజేయాలన్నారు. 3 నుచి 5 సంవత్సరాల విద్యార్థులకు పూర్వ ప్రాథమిక విద్య పై సృజనాత్మకత పెరిగే విధముగా విద్యా బోధన చేపట్టాలని బాల్యం అధ్యాపకులకు తెలియపరుస్తూ, బాల్యం విద్యార్థినీ విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దే విధంగా విద్యను బోధించేలా తగు చర్యలు చేపట్టాలని బాల్యం ప్రాజెక్ట్ అధికారి హెచ్. శంకర్రావుకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమీషనర్ ఎస్.ఎస్, వర్మ , ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ ఆవుపాటి మోహన్ కుమార్, బాల్యం విద్యా కేంద్రాలలో పనిచేసే బాల్యం అధ్యాపకులు, బాల్యం సూపర్ వైజర్స్ పాల్గొన్నారు.

# జాతీయ రహదారి -44పై నేరాలకు భారీ బ్రేక్ అంతర్రాష్ట్ర హైవే దోపిడీ గ్యాంగ్ అరెస్ట్





- రూ. 5.8 కోట్ల దోపిడీ కేసులు ఛేదన
- 10 మంది అరెస్ట్ రూ. 1.26 కోట్లు, బీఎం డబ్ల్యూసహా 3 కార్లు స్వాధీనం
- శ్రీ సత్యసాయి జిల్లాలో సంచలనంరాప్తాడు కనగానపల్లి హైవే దోపిడీలకు తెరదించిన పోలీసులు

పుట్టపర్తి మే 06 మనం న్యూస్ఃశ్రీ సత్యసాయి జిల్లాలో వరుసగా చోటుచేసుకున్న హైవే దోపిడీలు ప్రజల్లో భయాందోళనలు కలిగించగా, జిల్లా పోలీసులు చురుకుగా స్పందించి రెండు సంచలనాత్మక కేసులను విజయవంతంగా ఛేదించారు. ఎన్ హెచ్-44పై కిడ్నాప్, దోపిడీలకు పాల్పడిన ఒక వ్యవస్థీకృత అంతర్రాష్ట్ర నేర ముఠాను గుర్తించి, 10 మంది కీలక నిందితులను అరెస్టు చేశారు.

ఈ కేసులలో మొత్తం సుమారు 5.8 కోట్ల నగదు దోచుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ దర్యాప్తులో భాగంగా 1 కోటి 26 లక్షల నగదు, లగ్జరీ కార్లు సహా పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు

**వాహనాల అడ్డగింత కిడ్నాప్ – కోట్ల దోపిడీ**

కేసు 1 (03-12-2025): కియా పోలీస్ స్టేషన్ పరిధిలో తెల్లవారుజామున జరిగిన ఘటనలో, గుర్తు తెలియని దుండగులు కదులుతున్న వాహనాన్ని అడ్డగిం చి, కిటికీలు పగలగొట్టి, ఇద్దరిని అపహరించి 2.8 కోట్లు దోచుకుని పరారయ్యారు. కేసు 2 (21-02-2026):కనగానపల్లి మండలం మామిళ్లపల్లి సమీపంలో ముసుగులు ధరించిన గ్యాంగ్, 3 కోట్ల నగదుతో వెళ్తున్న వాహనాన్ని అడ్డగించి, బాధితులను కిడ్నాప్ చేసి నగదు దోచుకుని వదిలిపెట్టింది. ఈ రెండు కేసుల్లో కలిపి మొత్తం 5.8 కోట్ల దోపిడీ జరిగినట్లు పోలీసులు తెలిపారు.

**ప్లాన్ ప్రకారం క్షణాల్లో ఆపరేషన్ పూర్తి**

టార్గెట్ వాహనాలను ముందుగానే గుర్తింపు నకిలీ నంబర్ ప్లేట్లతో వాహనాల వినియోగం కిటికీలు పగలగొట్టి వేగంగా దాడి బాధితుల మొబైల్ ఫోన్లు స్వాధీనం కిడ్నాప్ చేసి నిర్జన ప్రాంతాల్లో వదిలిపెట్టడం టోల్ గేట్లలో కేవలం క్యాష్ చెల్లింపులు మొత్తం ఆపరేషన్ నిమిషాల్లో పూర్తి. ఈ విధానం గ్యాంగ్ ప్రణాళిక, శిక్షణ, సమన్వయం ఎంత పటిష్టంగా ఉందో స్పష్టం చేస్తోంది. ఈ కేసును టెక్నాలజీతో ట్రాప్ తో సీసీటీవీ , ఐ యం ఈ ఐ, వి ఓ ఐ పి ఆధారంగా నిందితుల గుర్తింపు పోలీసులు 200 కి.మీ పరిధిలో ఉన్న టోల్ ప్లాజాలు, సీసీటీవీ ఫుటేజీలను సేకరించి విశ్లేషించారు. సీడీ ఆర్ , ఐపీడీర్ ,ఐ యం ఈ ఐ డేటాను పరిశీలించి, నిందితులు కేరళలో నకిలీ సిమ్ కార్డులు తీసుకుని,వి ఓ ఐ పి ద్వారా కమ్యూనికేషన్ జరిపినట్లు గుర్తించారు. గ్యాంగ్ కేరళ, తమిళనాడు,కర్ణాటక మార్గంలో ప్రయాణించి, ధర్మపురి ప్రాంతంలో ముందస్తు ప్రణాళిక చేసుకున్నట్లు నిర్ధారించారు. అంతర్రాష్ట్ర నేర ముఠా 6 రాష్ట్రాల్లో కార్యకలాపాలు - 21 మంది గ్యాంగ్ ఈ గ్యాంగ్లో మొత్తం 21 మంది సభ్యులు ఉండగా, ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో నేరాలు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రధాన సూత్రధారి విదేశీ వి ఓ ఐ పి కమ్యూనికేషన్ ద్వారా నేపాల్ నుండి కార్యకలాపాలను సమన్వయం చేసినట్లు గుర్తించారు.ప్రధాన సూత్రధారి సహా 10 మంది అదుపులో 15-03-2026న 3 మంది అరెస్ట్05-05-2026న 7 మంది కీలక నిందితులు అరెస్టు చేశారు. వీరిలో ముఖ్య నిందితులు:సిరిల్ మాథ్యూ (సూత్రధారి)షియాహబుద్దీన్ ,ఆసిఫ్ అహ్మద్,శరత్, అప్పు, శ్రీకాంత్ నిషాద్ తదితరులు ఉన్నారు మిగిలిన 11 మంది కోసం గాలింపు కొనసాగుతోంది స్వాధీనం చేసుకున్న ఆస్తులు కోట్ల నగదు + లగ్జరీ వాహనాలురూ. 1,26,00,000 నగదు,ఇన్నోవా ఎక్స్ యు వి 500, బి యం డబ్ల్యూ కారు, 13 మొబైల్ ఫోన్లు, 3 కత్తులు, మాస్కులు, నకిలీ నంబర్ ప్లేట్లు, పెప్పర్ స్ప్రే పోలీసుల సమన్వయంతో భారీ విజయముఈ కేసును ఛేదించేందుకు జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో 10 ప్రత్యేక బృందాలు పనిచేశాయి.

సీఐలు, ఎస్సైలు, సాంకేతిక బృందాలు కలిసి సమన్వయంతో పనిచేసి ఈ భారీ గ్యాంగ్ను పట్టుకున్నారు.జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఈ కేసు దర్యాప్తులో కీలకంగా పనిచేసిన అధికారులు, సిబ్బందిని అభినందించారు. అడిషనల్ ఎస్పీ అంకిత సురాన, సీఐ రాఘవన్ తదితరులు ఈ కేసులో కీలక పాత్ర పోషించారు

# తక్కువ పెట్టుబడి.. అధిక లాభాలు చూపించడమే లక్ష్యం




- అపరాజిత ప్రాపర్టీస్ అండ్ ఫామ్ ల్యాండ్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ శ్రీనివాసరావు

అనంతపురం, మే 6 మనం న్యూస్ః సామాన్య ప్రజల ఆశలు నెరవేర్చుకునేందుకు తమ సంస్థలో తక్కువ పెట్టుబడి పెడితే.. అధిక లాభాలు చూపిస్తామని అపరాజిత ప్రాపర్టీస్ అండ్ ఫామ్ ల్యాండ్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం నగరంలోని 2వ రోడ్డులో గల వారి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోనే మొట్టమొదటగా 'రూట్ కల్చర' ఎర్రచందనం ప్లాంటేషన్ చేస్తున్న ఏకైక సంస్థ తమదన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్లాంటేషన్ ఉంటుందన్నారు. 25 సెంట్లలో 100 ఎర్ర చందనం మొక్కలు పెంపకం చేపట్టవచ్చని, ఇందుకు రూ.10.50 లక్షల ఖర్చవుతుందన్నారు. సమగ్ర భూసార పరీక్షలు చేసిన తర్వాతనే రెండేళ్ల వయసున్న మొక్కలను పెంచుతామన్నారు. అంతేకాకుండా మొక్కలకు సంరక్షణ కోసం జీపీఎస్, రిటైర్డు అర్మీ వ్యక్తి, సీసీ కెమెరాలు, డాగ్స్, విద్యుత్ ఫెన్సింగ్, డ్రిప్ పద్దతి, సోలార్తోపాటు మీరు ఇంటి నుంచే ఈ మొక్కల సంరక్షణ చూసుకునేలా గూగుల్ మ్యాప్ ఉంటుందన్నారు. ఈ ఎర్రచందనం కట్ చేసే సమయం 12 ఏళ్లు పడుతుందని, ప్రభుత్వం అనుమతి తీసుకున్న తర్వాత కటింగ్ ఉంటుందన్నారు. కష్టమర్ పెట్టిన పెట్టుబడి పదింతలవుతుందన్నారు. వచ్చే ఆదాయంలో కష్టమర్లకు 60 శాతం, సంస్థకు 40 శాతం ఉంటుందన్నారు. అంతేకాకుండా 12 ఏళ్ల తర్వాత భూమి ధరలు కూడా రెట్టింపు అవుతాయన్నారు. వారి పిల్లల సహకారానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ నిశిత, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖాదర్వలి, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ధర్మవరం తాలూకా జె.ఎ.సి కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎంపిక

- ధర్మవరం తాలూకా యూనిట్ కార్యవర్గం చైర్మన్ శంకరనారాయణ



ధర్మవరం అర్బన్ మే 6, మనం న్యూస్ః ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు మరియు పెన్షనర్ల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ధర్మవరం తాలూకా జె.ఎ.సి కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎంపిక చేశామని శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం తాలూకా యూనిట్ రాష్ట్ర జె.ఎ.సి చైర్మన్ కామ్రేడ్ విద్యా సాగర్ గ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ రమణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎన్జీవో హోం లో ధర్మవరం తాలూకా జేఏసీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా నాయకులు అధ్యక్షతన ఎంపిక చేశారు. ధర్మవరం తాలూకా యూనిట్ కార్యవర్గా చైర్మన్ శంకరనారాయణ (అధ్యక్షుడు, ఏపీ ఎన్జీవో ఎస్ ధర్మవరం యూనిట్).కార్యదర్శి అమర్ నారాయణ రెడ్డి ( యుటిఎఫ్), కోశాధికారి శంకరనారాయణ ఏపీటీఎఫ్), వైస్ చైర్మన్ ఉదయభాస్కర్ ( ఏపీ ఎన్జీవో ఎస్),వైస్ చైర్మన్ ఎ.వి. శివారెడ్డి ( పిఆర్టియు),వైస్ చైర్మన్ గాయత్రిదేవి (సచివాలయం)సంయుక్త కార్యదర్శిచలపతి (అధ్యక్షుడు పెన్షనర్స్ అసోసియేషన్) సంయుక్త కార్యదర్శి-2: కే. మదుసూదన్ ( ఏపీఎస్ఆర్టీసీ)సంయుక్త కార్యదర్శి-3: ఆర్.గోపాలకృష్ణ నాయక్ (వెటర్నరీ)వీరితో పాటు మరో పది మందిని ఈసీసభ్యులుగా.వెంకటరావు డం చెంద్రమోహన్,రాంప్రసాద్,హరికృష్ణ ,గురురాగవేంద్ర,జగదీష్ ,.జైనుల్లాబుద్దిన్, .వెంకటకిశోర్, జలజాక్షి బాలకదిరన్న ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయ చంద్రారెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులుముత్యాలప్ప, పి ఆర్ టి యు నాయకులు చెంద్రమోహన్, ఏ పి ఎన్ జి ఓ ఎస్ కార్యదర్శి శ్రీనివసులుగారు ఏపీఎస్ఆర్టీసీ నాయకులు, పెన్షనర్స్ మరియు వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు మరియు వివిధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# అందరిని అలరించిన అలనాటి హాస్య నటుడు నల్ల రామ్మూర్తి

పాలకొల్లు, మే 6,మనం ప్రతినిధి కోటిపల్లి రామమూర్తి(నల్ల రామమూర్తి )ప్రముఖ తెలుగు చలనచిత్ర, రంగస్థల నటుడు. హాస్యనటుడిగా ఈయన సుప్రసిద్ధుడు. ఈయన పుట్టిన వూరు తూర్పు గోదావరి జిల్లా నార్కెడిమిల్లి గ్రామం లో 1913లో జన్మించారు.అక్కడ ఇళ్ళు గడవక పోవడం తో పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లు మండలంలోని చింతపర్రు వచ్చేశారు. .ఈయన సుమారు రెండు వేల నాటకాలలో, 112 సినిమాలలో నటించారు. ఈయన నల్లగా ఉండటం తో నల్ల రామ మూర్తి అని పేరు పొందారు.చింతపర్రు నుండి మళ్ళీ అమలాపురం వెళ్లి అక్కడ బస్సు కండక్టర్ గాను, కొన్నాళ్ళు దర్జీ గాను పనిచేసారు. ఆ తర్వాత కాకినాడ క్లబ్, మీర్జాపూర్ మహారాజ్ దగ్గర జీతాలు తీసుకుని నాటకాలు వేసేవారు. అనంతరం మద్రాస్ ఎవరికి చెప్పా పెట్టకుండా వెళ్లి సినిమా ల్లో నటించడం ప్రారంభించారు. ఆ సమయం లోనే తూర్పు గోదావరి జిల్లా ఈత కోట కు చెందిన మాణిక్యమ్మ ను వివాహం చేసుకున్నారు. ఈయన సినిమా లో ఉంటే ఆ సినిమా హిట్ గ్యారంటీ అనే టాక్ అప్పట్లోతెచ్చుకున్నారు.సినిమాలు తగ్గిన తర్వాత చింత పర్రు కు వచ్చేశారు.

**రామమూర్తి జీవిత విశేషాలు :**

సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఈయనకి చదువు అంతగా అబ్బలేదు. చక్కని గాత్రం ఉండడంతో నాటకరంగాన్ని తేలికగాఆకర్షించగలిగారు.తన 15వ యేటనే శ్రీకృష్ణతులాభారం నాటకంలో వసంతకుని వేషం వేసి అందర్నీమెప్పించారు.ఇంగ్లీషు చదువు అబ్బకపోయినా తెలుగులో అనేక వచన గ్రంథాలను చదవడం వల్ల, నాటకాలలోని పద్యాలు కంఠస్తం చేయడం వల్ల అచిర కాలంలోనే రచయితగా మారారు.'తూర్పు సావిత్రి', 'సీతమ్మోరి వనవాసం', 'పండగ అల్లుళ్లు' మొదలైన హాస్యనాటికలను స్వయంగా రచించి తన బృందంతో ఆంధ్రదేశం అంతటా ప్రదర్శనలు ఇచ్చారు.

గాత్రం కూడా ఉండడంతో అద్దంకి



శ్రీరామమూర్తి, ఈలపాట రఘురామయ్య, పువ్వుల సూరిబాబు, కొచ్చర్లకోట సత్యనారాయణ, జొన్నవిత్తుల శేషగిరిరావు, స్థానం నరసింహారావు, సి.ఎస్.ఆర్.ఆంజనేయులు మొదలైన రంగస్థల నటులతో కలిసి అనేక పౌరాణిక నాటకాలలోహాస్యభూమికలు ధరించారు. చిత్రసమాహారం :నల్ల రామ్మూర్తి నటించిన చిత్రాలు ఇవే :భూకైలాస్ (1940),విశ్వమోహిని (1940)నారద నారది, (1946)కీలుగుర్రం ( 1 9 4 9 ) , తిరుగుబాటు(1950),బస్తీమామయ్యపరమానంద య్య శిష్యులు (1950),పల్లెటూరి పిల్ల (1950),వాలి సుగ్రీవ (1950)శ్రీ సాయిబాబా (1950),సంసారం (1950) అగ్నిపరీక్ష (1951)వంత్ర దండం (1951)మాయలమారి (1951)స్త్రీ సాహసము (1951)ధర్మదేవత (1952)టింగ్ రంగా (1952) హరిశ్చంద్ర (1956)మాయాబజార్ (1957)చెంచులక్ష్మి (1958) శ్రీకృష్ణమాయ (1958) అప్పుచేసి పప్పుకూడు (1959)పెళ్ళి సందడి (1959) అభిమానం(1960)జగదేకవీరుని కథ (1961)గులేబకావళి కథ(1962)నవరాత్రి (1966)తదితర ముఖ్య చిత్రాల్లో నటించారు. మరణం :ఈయన తన 65వ యేట తన స్వగ్రామమైన చింతపఱ్ఱు గ్రామంలో 1978, మార్చి 20వ తేదీన మరణించారు.

ఇతనికి భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం కాగా ఇప్పుటి కి భార్య, ఇద్దరు కుమారులు కూడా మరణించారు .అయితే ఈయన కుటుంబం లో ఎవరు కూడా సినిమా ఫీల్ లోకి వెళ్ళక పోవడం గమనార్హం.

# జీతాలు చెల్లించాలని ధర్నా



- గ్రామాలకు తాగునీరు నిలిపివేత

ఆత్మకూరు మే 6 మనం న్యూస్ః సత్యసాయి తాగునీరు పథకం కింద పనిచేస్తున్న కార్మికులకు ఐదు నెలలుగా జీతాలు చెల్లించలేదని బుధవారం ఆత్మకూరు సత్యసాయి సాగునీరు సరఫరా కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ బరువైందని ఆవేదన చెందారు సంబంధిత అధికారులకు అనేకమార్లు తెలిపిన స్పందించడం లేదని ఆరోపించారు దీంతో జీవనం రస్తారిహితంగా ఉందన్నారు జీతాలు చెల్లించే వరకు గ్రామాలకు తాగునీరు సరఫరా నిలిపివేస్తామని అన్నారు వెంటనే జీతాలు ఇవ్వాలని కోరారు సమ్మెలో హరిప్రసాద్ శ్రీరాములు రమేష్ రెడ్డి ఓబన్న వెంకటేష్ నాయక్ నరసింహలు అంతోన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# భూములు కోల్పోతున్న ప్రతి రైతుకు పునరావసం కల్పించాలి



పుట్టపర్తి మే 6 మనం న్యూస్ః భూములు కోల్పోతున్న ప్రతి రైతుకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతాంగానికి నష్ట పరిహారంతో పాటు పునరావాసం కల్పించాలని పుట్టపర్తి ఆర్ డి ఓ సువర్ణకు ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్. వెంకటేష్ మాట్లాడుతూ పుట్టపర్తి మండలం బ్రాహ్మణపల్లి, బీడుపల్లి గ్రామాల రైతుల నుండి తీసుకుంటున్న భూములకు 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయాలనీ వ్యవసాయ కూలీలు, శ్రామికులు ( ఉపాధి కూలీలు) వృత్తిదారులు చిన్న, సన్న కారు, వ్యాపారస్తులనని వారికి ఉన్న భూమి పోతే పునరావాసం ఉండదని వారికి పునరావసం కల్పించాలని కోరారు. రైతులకు చట్టం యొక్క ప్రాధాన్యతను వివరించి ప్రజాభిప్రాయం సేకరణ ద్వారా చేయాలనీ, కోరారు. కానీ ప్రస్తుత భూసేకరణ హడావిడిగా గందరగోళంగా భయభ్రాంతులకు గురి చేసే విధంగా , రైతులకు తెలియచేయకుండా గ్రామసభలు నిర్వహించి ప్రజా ఆమోదం పొందకుండా వారిని భయభ్రాంతులకు గురిచేసి భూసేకరణ చేయడం సబబు కాదని తెలిపారు. గ్రామాల్లో పలువురి రైతులకు నోటీసులు కూడా అందలేదనీ, అంతేకాక ప్రతి రైతుకి ఒకే నెలకు మూడు నోటీసులు ఇచ్చి భూమిని స్వాధీనం చేసుకోవడం విడ్డూరంగా ఉందని తెలిపారు. ఎకరా భూమికి 32 లక్షలు రైతుకు చెల్లిస్తే పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లో నాలుగు సెంట్లు స్థలం కూడా రాదని వారు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘంగా దీనిని తీవ్రంగా ఖండిస్తుందని, భవిష్యత్తులో భూములు సేకరణ ముందు గ్రామ కమిటీల ద్వారా, గ్రామసభల ద్వారా భూసేకరణ చేయాలని కోరారు. 2013 భూ సేకరణ పై రెవెన్యూ సిబ్బంది రైతులకు ఏమాత్రం స్పష్టత ఇవ్వలేదనీ, భూములు కోల్పోతున్న ప్రతి ఇంటికి ఇక్కడ స్థాపించే పరిశ్రమల్లో పెర్మనెంట్ ఉద్యోగం ఇస్తామని మాట పూర్వితంగా చెబుతున్నారు కానీ రాతపూర్వితంగా ఇవ్వలేదని తెలిపారు. ప్రస్తుతం ఇక్కడ సెంటు లక్ష రూపాయలు ఉంటే ఎకరాకు కోటి రూపాయలు ఇవ్వాలి, కానీ , మార్కెట్ వ్యాల్యూ కన్నా తక్కువగా ఇవ్వడం రైతులను మభ్యపెట్టడమేనని తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు, కూటమి ప్రభుత్వం నాయకులు భూములు ఇస్తున్న రైతులకు ఎకరాకు కోటి రూపాయలు ఇచ్చి న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

# నియోజక వర్గం ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రత్యేక చర్యలు

- ప్రభుత్వ అన్నిశాఖల అధికారులు తమ వంతు బాధ్యతగా పాటు పడాలి
- సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



మడకశిర,మే 06,మనంన్యూస్: నియోజక వర్గం ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రభుత్వ అధికారులు తమ వంతు బాధ్యతగా పాటు పడాల్సిందిగా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. మడకశిర పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నియోజక వర్గంలోని తహసీల్దార్,ఎంపీడీఓ,ఉపాధి హామీ పథకం ఏపీడి,ఏపీఓ తదితర శాఖలకు సంబంధించిన అధికారులతో అయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రదానంగా ఏక కాలంలో 100 నూతన స్మశాన వాటికల నిర్మాణం లను పూర్తి చేసి,త్వరితగతిన వాటిని ఆయా గ్రామాల ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా కట్టు దిట్టమైన చర్యలు చేపట్టాల్సిందిగా అధికారులకు అయన పలు సూచనలు సలహాలునిచ్చారు.ఏది ఏమైనను ప్రతి గ్రామాల్లో కూడా మౌలిక వసతులు కల్పనకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే వివరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటి వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ ఎన్.లక్ష్మీనారాయణ,రాష్ట్ర కుంచిటి వక్కలిగా సాధికారత కన్వీనర్ వివిం పాండురంగప్ప,మార్కెట్ యార్డ్ చైర్మన్ బివిస్ గురుమూర్తి,టిడిపి క్లస్టర్ కన్వీనర్,మాజీ సర్పంచ్ గుండుమల చంద్రప్ప,మడకశిర,రొళ్ల టిడిపి మండల కన్వీనర్లు కల్లుమర్రి నాగరాజు,జికె ఈరన్న, నియోజకవర్గంలోని తహసీల్దార్లు,ఎంపీడీఓలు, ఉపాధి హామీ పథకం ఏపీడి,ఏపీఓలు తదితర శాలకు చెందిన అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# సత్వర న్యాయమే లక్ష్యం

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసాగిల్
- వర్చువల్ లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు న్యాయస్థానాలు ప్రారంభం



హిందూపురం (మనం న్యూస్) మే 06. కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యమని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసాగిల్ పేర్కొన్నారు. అందుకోసం ప్రస్తుతం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సైతం అందుబాటులోకి తీసుకోవడం జరిగిందన్నారు. బుధవారం ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా నాలుగు అదనపు న్యాయస్థానాలను ప్రధాన న్యాయమూర్తి అమరావతి నుండి వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. హిందూపురం, ధర్మవరం, కళ్యాణదుర్గం, రాయదుర్గంలో ఆయా న్యాయస్థానాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మవరంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తి భీమారావు పాల్గొని అదనపు కోర్టులు ఏర్పాటు చేయడం వల్ల ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. హిందూపురంలో జరిగిన న్యాయస్థానాల ప్రారంభోత్సవంలో సీనియర్ సివిల్ జడ్జి హేమలత, అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మీ హారిక కోట, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్య, రెండవ తరగతి న్యాయమూర్తి రమాదేవి పాల్గొన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసాగిల్ వర్చువల్ పద్ధతిలో న్యాయస్థానాలను ప్రారంభించిన అనంతరం పలు సూచనలు చేశారు. కక్షిదారులు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో కేసులను సత్వరం పరిష్కరించాలని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆయన న్యాయమూర్తులు సైతం సత్వరంగానే అందించేందుకు విశేష కృషి చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సైతం ఎప్పటికప్పుడు ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హిందూపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుదర్శన్ మాట్లాడుతూ, ప్రస్తుతం ఉన్న న్యాయస్థానాలకు అదనంగా మరో ఏర్పాటు చేయడం వల్ల అటు న్యాయవాదులకు ఇటు కక్షిదారులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. అదనంగా జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం ఏర్పాటు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం జిల్లా న్యాయమూర్తి భీమారావు హిందూపురం లో న్యాయస్థానం ప్రారంభించేందుకు విచ్చేయగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షులు సుదర్శన్ పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం జిల్లా న్యాయమూర్తి నూతన కోర్టు భవనాన్ని ప్రారంభించారు. అలాగే ప్రత్యేక పూజలతో పాటు సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం నూతన కోర్టులో ఇంచార్జి న్యాయమూర్తి లలితా లక్ష్మి హారిక కోట జిల్లా న్యాయమూర్తి సమక్షంలో నిర్వహణ విధులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ క్రాంతికుమార్, డి.ఎస్.పి మహేష్, తహసిల్దార్ వెంకటేష్, ఏపీపీలు గోపాలకృష్ణ, నగేష్, ఏజిపి రామచంద్రప్ప లతోపాటు బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# సెన్సస్ ఎన్యూమరేషన్ను పరిశీలించిన తహసీల్దార్ ఫాజిల్



పోడూరు, మే 6 మనం న్యూస్ : పోడూరు మండలంలో సెన్సస్-2027 కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోందని తహసీల్దార్ ఎస్.ఎం.ఫాజిల్ తెలిపారు.మే 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉందన్నారు.మండల పరిధిలోని 142 హౌస్ లిస్టింగ్ బ్లాక్స్ ( హెచ్ ఎల్ బిఎస్) కు 102 మంది ఎన్యూమరేటర్లను, 10 మంది రిజర్వ్ సిబ్బందిని, 16 మంది సూపర్వైజర్లను నియమించినట్లు ఆయన వెల్లడించారు.మొత్తం16,611 ఇళ్లకు గాను ఇప్పటివరకు 2,178 ఇళ్ల ఎన్యూమరేషన్ పూర్తి అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కొమ్ముచిక్కాల, కవిటం గ్రామాలను సందర్శించి ఎన్యూమరేషన్ ప్రక్రియను పరిశీలించినట్లు పేర్కొన్నారు.అలాగే ప్రత్యేకంగా కొమ్ముచిక్కాల గ్రామంలో జరుగుతున్న ఇంటింటి సర్వే తీరును తహసీల్దార్ ఎస్.ఎం. ఫాజిల్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

# ఐడిఎఫ్సీ బ్యాంకు ఏటీఎం మిషన్ దొంగలించిన దొంగలు

- ధర్మవరంలో రెచ్చిపోయిన దొంగలు
- సంఘటన స్థలాన్ని ఎస్పీ సతీష్ కుమార్ పరిశీలన




ధర్మవరం అర్బన్ ఏప్రిల్ 6, మనం న్యూస్ః పట్టణంలోని పుట్టపర్తి రోడ్ బాగానగల ఐడిఎఫ్సి ఫస్ట్ బ్యాంక్ లో బుధవారం తెల్లవారుజామున 3 గంటల నుండి 4 గంటల లోపు నలుగురు దుండగులు పక్కా ప్రణాళికతో ఏటీఎం మిషన్ గుణపముతో కొట్టి, తదుపరి ఏటీఎం మిషన్ ను ఏకంగా త్రాడుతో బోలోరా వాహనములో వెళ్లిపోయారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వన్టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో, ఎస్సై ఉమాదేవి తో పాటు సిబ్బంది అక్కడకు చేరుకొని జరిగిన ఘటనను పరిశీలించారు. మొత్తంగా ఏటీఎం గాజు వాకిలిని కూడా పడగొట్టి సినీ పక్కిలో దొంగతనం చేశారు. సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు సిఐ నాగేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఆరు టీములను ఏర్పాటు చేసి ఆ దొంగలను పట్టుకునేందుకు గాలింపు చర్యలను వేగవంతం చేశారు. ఏటీఎం దొంగలను త్వరలోనే పట్టుకొని అరెస్టు చేస్తామని సిఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. మొత్తం మీద రాష్ట్రంలోనే ఏటీఎంల దోపిడీ జరగడంతో, తిరిగి ధర్మవరంలో ఇటువంటివి చోటు చేసుకోవడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ కార్యక్రమంలో వన్టౌన్ ఎస్ఐ ఉమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నాడీఎంకేలో ముసలం..

## విజయ్‌కు మద్దతుగా మెజార్టీ ఎమ్మెల్యేలు..!





**చెన్నై, మే 6:** దేశం దృష్టి మొత్తం ప్రస్తుతం తమిళనాడు రాజకీయాల పైనే ఉంది. అందుకుతగ్గట్టే అక్కడి పరిణామాలు వేగంగా మారుతున్నాయి. మెజార్టీ మార్కు 10 అడుగుల దూరంలో ఉన్న టీవీకేకు ఎవరి నుంచి మద్దతు లభిస్తుందనేది ఆసక్తిగా మారింది. ఇప్పటికే కాంగ్రెస్ మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉందని వార్తలు వస్తుండగా.. అన్నాడీఎంకేకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు కూడా అందుకు రెడీగా ఉన్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ క్రమంలోనే అన్నాడీఎంకే నేత, మాజీ సీఎం పళనిస్వామితో టీవీకే నేత సమావేశమవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

టీవీకే చీఫ్ విజయ్ దెబ్బకు అన్నాడీఎంకేలో ముసలం పుట్టినట్లు తెలుస్తోంది. దాదాపు 35 మంది ఎమ్మెల్యేలు అన్నాడీఎంకే నేత, రాజ్యసభ ఎంపీ షణ్ముగమ్ కార్యాలయానికి వెళ్లినట్లు సమాచారం. చెన్నైలో జరిగిన ఈ సమావేశంలో భాగంగా టీవీకేతో పొత్తు గురించి ఆలోచించమని తమ పార్టీ జనరల్ సెక్రటరీ ఎడప్పాడి కె.పళనిస్వామిని వారు కోరినట్లు తెలుస్తోంది. ఈ భేటీ జరిగిన కాసేపటికే టీవీకే నేత ఆనంద్.. పళనిస్వామిని కలవడం గమనార్హం. ఇక విజయ్‌కు మద్దతు ఇవ్వడంపై అడిగిన ప్రశ్నకు ఏఐఏడీఎంకే అధికార ప్రతినిధి కొవై సత్యన్ మాట్లాడుతూ.. ''బంతి విజయ్ కోర్టులోనే ఉంది'' అని బదులిచ్చారు.

కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇచ్చినా టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు ఆ బలం సరిపోదు. మరి ఈ పరిణామాల నేపథ్యంలో అన్నాడీఎంకే ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ఇదిలాఉంటే.. ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించాలని కోరుతూ విజయ్.. వీసీకే చీఫ్‌నకు లేఖ రాశారు. ఆ పార్టీ గెలిచిన సీట్ల సంఖ్య రెండు. ఒకవైపు పలు పార్టీల మద్దతు కోరుతున్న ఆయన గురువారం ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే నేడు గవర్నర్ కలవనున్నారని సమాచారం.



## యూఏఈపై మళ్లీ ఇరాన్ దాడులు

**దుబాయ్, మే 6:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌పై ఇరాన్ వరుసగా రెండో రోజూ దాడులు చేసింది. టెహ్రాన్ మంగళవారం తమ దేశంపైకి క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించిందని.. వాటిని తమ గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయని యూఏఈ తెలిపింది. తాజా పరిణామం నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. దాడులు చేసి ప్రజలను చంపాలని తాను కోరుకోవడం లేదని, కాబట్టి టెహ్రాన్ తెలివిగా వ్యవహరించాలని సూచించారు. ఇరాన్‌లో ద్రవ్యోల్బణం 150%కు పెరిగిందని.. సైనికులకు జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితిలో ఆ దేశం ఉందని విలేకర్లతో మాట్లాడుతూ పేర్కొన్నారు. మరోవైపు- హర్మూజ్‌లో, యూఏఈపై ఇరాన్ తాజాగా దాడులకు పాల్పడినప్పటికీ.. ఆ దేశంతో తమ కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోనే ఉందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ స్పష్టం చేశారు. హర్మూజ్ చుట్టూ గగనతలంలో తమ దేశానికి చెందిన 100 మిలిటరీ విమానాలు గస్తీ తిరుగుతున్నాయని అమెరికా సైనిక ఉన్నతాధికారి డాన్ కైన్ తెలిపారు. హర్మూజ్‌లో టోల్ వసూళ్లను ఆపి, స్వేచ్ఛా వాణిజ్యాన్ని అనుమతించకపోతే ఇరాన్‌పై ఆంక్షలు విధించేందుకు వీలుగా ఐక్యరాజ్య సమితిలో తీర్మానం ప్రవేశపెట్టేందుకు అమెరికా, గల్ఫ్ దేశాలు సిద్ధమయ్యాయి. ఈ మేరకు ముసాయిదా తీర్మానాన్ని తయారుచేశాయి.

## రెండు గంటల్లో 2 చోట్ల పేలుళ్లు..





- **జలంధర్ పేలుడు మా పనే: ఖలిస్థానీ లిబరేషన్ ఆర్మీ**
- **పంజాబ్‌లో హైఅలర్ట్**

**జలంధర్, మే 6:** వరుస పేలుళ్లతో పంజాబ్ దద్దరిల్లింది. రెండు గంటల్లో 2 చోట్ల పేలుళ్లు చోటుచేసుకోవడం తీవ్ర కలకలం రేపింది. ఈ రెండు ఘటనలూ ఆర్మీ యూనిట్లకు సమీపంలోనే జరగడం మరింత ఆందోళనలను రేకెత్తిస్తోంది. మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో జలంధర్‌లోని బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ ప్రధాన కార్యాలయం సమీపంలో పేలుడు చోటుచేసుకుంది. కార్యాలయం బయట పార్క్ చేసి ఉన్న ఒక స్కూటర్ పేలింది. దీంతో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు వెల్లడించారు. ఘటనాస్థలం సమీపంలో ఉన్న పలు వాహనాలు దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. ఒక కిలోమీటరు వరకు పేలుడు శబ్దాలు వినిపించాయని స్థానికులు తెలిపారు. ఈ పేలుడులో ఏదైనా కుట్రకోణం ఉందా అనే దానిపైనా అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

ఈ ఘటన జరిగిన రెండు గంటల తర్వాత.. అమృత్‌సర్‌లో మరో పేలుడు చోటుచేసుకుంది. అటారీ రోడ్డులోని ఆర్మీ ఖాసా కంటోన్మెంట్ పరిధిలో ఈ ఘటన జరిగింది. ఈ ప్రదేశంలో రేకును పోలిన శకలాలు దొరికాయని దీంతో ఎవరో పేలుడు పరికరాన్ని విసరడం వల్లే ఈ ఘటన జరిగిందని పోలీసులు అనుమానిస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు మాస్కులు ధరించి, దాడి చేసి, ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయినట్లు ప్రాథమిక విచారణలో తెలిసింది. ఈ రెండు ఘటనలకు ఏదైనా సంబంధం ఉందా అనేదానిపై ఇంకా స్పష్టత లేదు.

కాగా..జలంధర్‌లో చోటుచేసుకున్న ఈఐడీ పేలుడు తమ పనేనని ఖలిస్థానీ లిబరేషన్ ఆర్మీ ప్రకటించింది. ఫిబ్రవరిలో గురుదాస్‌పూర్ జిల్లాలో పంజాబ్ పోలీసుల చేతిలో హతమైన ఉగ్రవాది రంజీత్ సింగ్ మృతికి ప్రతీకారంగానే ఈ పేలుడు జరిపినట్లు ఓ ప్రకటనలో కేఎల్‌ఏ పేర్కొంది. ఈ పేలుడులో ఇద్దరు బీఎస్ఎఫ్ జవాన్లు మరణించగా.. మరో ముగ్గురు గాయపడ్డారని తెలిపింది. అయితే, ఈ మరణ వార్తలను పోలీసు అధికారులు ఖండించారు.

## 'మెట్ గాలా'లో తెలుగమ్మాయి లుక్‌పై చర్చ!

**న్యూయార్క్, మే 6:** అమెరికాలోని న్యూయార్క్‌లో నిర్వహించిన 'మెట్ గాలా 2026' ఫ్యాషన్ షోలో అనేక మంది భారతీయ సెలబ్రిటీలు పాల్గొన్నారు. వారిలో తెలుగమ్మాయి భవిత మండవ ఒకరు. ప్రముఖ ఫ్రెంచ్ లగ్జరీ ఫ్యాషన్ సంస్థ 'షనెల్' తరపున మొదటి భారతీయ అంబాసిడర్‌గా ఆమె ఈ వేడుకకు హాజరయ్యారు. అయితే.. ఫ్యాషన్ ప్రపంచంలో లగ్జరీ హంగులు, విభిన్న వస్త్రాలంకరణలకు వేదికైన 'మెట్ గాలా'కు ఆమెను మరీ సాదాసీదాగా పంపించారంటూ 'షనెల్'పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పారదర్శకమైన బ్లౌజ్, రంగు వెలిసిన డెనిమ్ లాంటి సిల్క్ ప్యాంట్, షనెల్ సంస్థ స్లింగ్‌బ్యాక్‌లను ధరించి భవిత ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వాస్తవానికి.. న్యూయార్క్ సబ్‌వేలో ఆమెను మొదటిసారి గుర్తించినప్పుడు ఆమె ధరించిన దుస్తులకు గుర్తుగా 'షనెల్' డిజైనర్ మాథ్యూ ఈ లుక్‌ను రూపొందించారు. కానీ, ప్రఖ్యాత వేదికపై ఇటువంటి ప్రయోగాలు ఆమె ఫ్యాషన్ కెరీర్‌ను దెబ్బతీసే అవకాశం ఉందని పలువురు విమర్శించారు. ఉద్దేశపూర్వకంగానే ఆమెను ఇలా పంపారని ఆరోపించారు. ఇదే కార్యక్రమంలో 'షనెల్' తరపున నికోల్ కిడ్మన్ తదితరులు ఆర్భాటంగా వచ్చారని గుర్తుచేశారు.

''షనెల్ తరపున ఓ భారతీయ అంబాసిడర్‌కు లభించిన అతిపెద్ద అవకాశాల్లో ఈ ఫ్యాషన్ షో ఒకటి. గ్లామర్, వ్యక్తిత్వం, సాంస్కృతిక విశిష్టతను చాటిచెప్పేలా ఆమె వస్త్రధారణ ఉండాలి. కానీ, ఇక్కడ వాటిని విస్మరించారు'' అని పలువురు పేర్కొన్నారు. మరికొందరు ఆమె లుక్‌ను సమర్థించారు.



ఏదైనా ఒక సందేశాన్ని ఇవ్వడానికి ఫ్యాషన్‌కు ఎల్లప్పుడూ హంగులు అవసరం లేదని వాదించారు. హైదరాబాద్‌కు చెందిన భవిత.. జేఎన్‌టీయూహెచ్ నుంచి ఆర్కిటెక్చర్‌లో బ్యాచిలర్స్ పూర్తిచేశారు. మాస్టర్స్ కోసం అమెరికా వెళ్లారు. న్యూయార్క్‌లోని సబ్ వేలో 'షనెల్' డిజైనర్ మాథ్యూ ఆమెను పరిచయం చేసుకున్నారు. 'చాలా అందంగా ఉన్నారు. మా ఫ్యాషన్లో మోడల్‌గా చేస్తారా' అని అడిగాడు. ఆ డిజైనర్ మాటతో ఆమె జీవితం మారిపోయింది. ప్రముఖ, అంతర్జాతీయ రన్‌వేల్లో పాల్గొన్నారు. న్యూయార్క్, పారిస్, మిలాన్, లండన్ ఫ్యాషన్ వీక్‌లో డియోర్ వంటి ప్రముఖ సంస్థలకు పనిచేశారు.

## మాదక ద్రవ్యాల నావపై దాడి.. ఇద్దరి మృతి

- **అమెరికా సైన్యం ప్రకటన**



**వాషింగ్టన్, మే 6:** కరీబియన్ సముద్రంలో మాదక ద్రవ్యాలు మోసుకెళ్తున్న ఒక పడవపై తాము జరిపిన దాడిలో ఇద్దరు మరణించారని అమెరికా సైన్యం ప్రకటించింది. లాటిన్ అమెరికా సముద్ర జలాల్లో సాగుతున్న మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ట్రంప్ యంత్రాంగం గత సంవత్సరం సెప్టెంబరు నుంచీ నిర్వహిస్తున్న దాడుల్లో ఇప్పటి వరకూ మొత్తం 188 మంది మరణించారు. తూర్పు పసిఫిక్ మహా సముద్రంలోనూ అమెరికా ఇలాంటి దాడులే నిర్వహిస్తోంది. అమెరికా యంత్రాంగం తీవ్ర చర్యలు తీసుకుంటున్నా పశ్చిమార్ధగోళంలో సాగుతున్న మాదక ద్రవ్యాల ఉగ్రవాదం సద్దుమణగడం లేదు. అయితే అమెరికా దాడులు నిర్వహించిన పడవల్లో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా సాగుతోందన్న సాక్ష్యాధారాలేవీ అమెరికా బహిర్గతం చేయడంలేదు. సోమవారం జరిగిన తాజా దాడిలో స్మగ్లింగ్ మార్గాలపై గురిపెట్టామని అమెరికా సైన్యం సదరన్ కమాండ్ విభాగం పునరుద్ఘాటించింది. లాటిన్ అమెరికాలోని మాదకద్రవ్యాల ముఠాలపై తాము యుద్ధం సాగిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు.

## హర్మూజ్‌లో 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'కు బ్రేక్..




- **ట్రంప్ కీలక ప్రకటన**

**వాషింగ్టన్, మే 6:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హర్మూజ్ జలసంధిలో చిక్కుకుపోయిన విదేశీ నౌకలను సురక్షితంగా తీసుకొచ్చేందుకు ప్రారంభించిన 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'కు బ్రేక్ పడింది. ఇరాన్‌తో దౌత్య చర్చల్లో పురోగతి నేపథ్యంలో దీన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఈమేరకు ఆయన ట్రూత్ సోషల్లో పోస్టు పెట్టారు.

పాకిస్థాన్, ఇతర దేశాల అభ్యర్థన మేరకు, ఇరాన్‌పై సాధించిన విజయాన్ని దృష్టిలోపెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ తెలిపారు. ఈ క్రమంలో ఇరాన్ ప్రతినిధులతో ఒక సంపూర్ణ, తుది ఒప్పందం దిశగా కొనసాగుతోన్న ప్రయత్నాల్లో పురోగతి సాధించామన్నారు. ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనం మాత్రం కొనసాగుతోందని స్పష్టంచేశారు. ఒప్పందంపై పూర్తి స్పష్టత వచ్చేంతవరకు ప్రాజెక్ట్ ఫ్రీడమ్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. ఇక, ఓవల్ ఆఫీసులో విలేకరులతో మాట్లాడుతూ ఇరాన్ బహిరంగ ప్రకటనలకు విరుద్ధంగా తమతో ఒక ఒప్పందం చేసుకునేందుకు రహస్యంగా ప్రయత్నిస్తుందని ట్రంప్ అన్నారు. ఈసందర్భంగా ఇరాన్ లొంగిపోవాలని ఆయన హెచ్చరించారు. తాము పూర్తిస్థాయిలో పోరాటానికి దిగితే వారు దాన్ని ఆపలేరని వ్యాఖ్యానించారు.

అమెరికా- ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం నేపథ్యంలో హర్మూజ్ మీదుగా నౌకల రాకపోకలకు తీవ్ర అడ్డంకులు ఏర్పడిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో విదేశీ నౌకలను జలసంధి నుంచి సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే ఉద్దేశంతో ట్రంప్ ఇటీవల ఈ ప్రాజెక్ట్ ఫ్రీడమ్‌ను ప్రకటించారు. దీన్ని మానవతా చర్యగా అభివర్ణించారు. కాగా.. ఇది ప్రారంభమైన కొన్ని గంటలకే తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించడం గమనార్హం.

## టీఎంసీపై రూ.100 కోట్ల దావా వేస్తా: మెస్సి టూర్ ప్రమోటర్

**కోల్‌కతా, మే 6:** తృణమూల్ కాంగ్రెస్ పార్టీపై రూ.100 కోట్లు దావా వేస్తా అని లియోనెల్ మెస్సి టూర్ ప్రమోటర్ శతద్రు దత్తా బెదిరించారు. గతేడాది మెస్సి భారత పర్యటన సందర్భంగా కోల్‌కతా స్టేడియంలో అనుచిత ఘటనలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి శతద్రు జైలుకు కూడా వెళ్లాల్సి వచ్చింది. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఓడిపోయిన నేపథ్యంలో ఆయన సోషల్ మీడియా వేదికగా వరుస పోస్టులు పెట్టారు.



కోల్‌కతాలోని సాల్ట్‌లేక్ వద్ద జరిగిన ఘటన తర్వాత టీఎంసీ తన మూడేళ్ల కష్టాన్ని నాశనం చేసి.. తన ప్రతిష్టకు భంగం కలిగించిందని శతద్రు ఆరోపించారు. 'ఎన్నికల్లో ఓడినంత మాత్రాన మీకు శిక్ష పడిందని అనుకోవద్దు. నేను మీపై పరువు నష్టం కేసు పెడతా. అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్లి చివరివరకు పోరాడతా' అని ఆయన పోస్టులో రాసుకొచ్చారు. పదవీ విరమణ చేయనున్న బెంగాల్ క్రీడాశాఖ మంత్రి అరూప్ బిస్వాస్‌పై కూడా శతద్రు మండిపడ్డారు. మంత్రి, ఆయన సహచరులు ఫుట్‌బాల్ ఆటగాడి చుట్టూ గుమిగూడటం వల్లే స్టేడియంలోని ప్రేక్షకుల్లో ఆగ్రహం రేకెత్తించిందన్నారు. 'స్టేడియంలో ఫొటోలు తీయవద్దని నేను పదేపదే అతనికి చెప్పాను. కానీ, బిస్వాస్ తన అధికారాన్ని దుర్వినియోగం చేసి ఫొటోలు తీశాడు. దీనికి అతను మూల్యం చెల్లించుకోక తప్పదు' అని ఆయన అన్నారు. త్వరలోనే విలేకరుల సమావేశం పెట్టి ఘటనకు సంబంధించిన అన్ని విషయాలు బయటపెడతానన్నారు.

గతేడాది 'గోట్ టూర్ ఆఫ్ ఇండియా'లో భాగంగా అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి తొలుత కోల్‌కతాకు వెళ్లాడు. అక్కడి సాల్ట్‌లేక్ స్టేడియంలో చెప్పినదాని కంటే తక్కువ సమయం గడపడంతో అభిమానులు ఆగ్రహానికి గురయ్యారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఈ ఘటనకు సంబంధించి ఈవెంట్ నిర్వాహకుడు శతద్రుతో పాటు మరికొందరిపైనా పోలీసులు రెండు వేర్వేరు కేసులు నమోదు చేశారు. ఈ కేసులో అరెస్టయిన శతద్రు 37 రోజులు జైల్లో గడపాల్సి వచ్చింది.

## అర్ధరాత్రి టీఎంసీ ఆఫీసుపైకి బుల్డోజర్..

- **కోల్‌కతాలో హైటెన్షన్**

**కోల్‌కతా, మే 6:** పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలు రాజకీయ దుమారానికి దారితీశాయి. ఫలితాలు వెలువడిన తర్వాత పలుచోట్ల బీజేపీ, టీఎంసీ వర్గాల మధ్య ఘర్షణలు చెలరేగాయి. ఈ క్రమంలోనే మంగళవారం అర్ధరాత్రి కోల్‌కతాలోని తృణమూల్ పార్టీ కార్యాలయం పైకి బుల్డోజర్ వెళ్లడంతో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి.





అర్ధరాత్రి సమయంలో హాగ్ మార్కెట్ ప్రాంతంలోని టీఎంసీ న్యూమార్కెట్ యూనియన్ ఆఫీసు వద్దకు వచ్చిన కొందరు వ్యక్తులు.. బుల్డోజరుతో దాన్ని కూల్చేశారు. అత్యంత రద్దీ ప్రాంతంలో ఉన్నట్టుండి ఈ ఘటన చోటుచేసుకోవడంతో స్థానిక దుకాణదారులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే తమ దుకాణాలు మూసేసి అక్కడినుంచి పారిపోయారు. ఈ ఘటనలో టీఎంసీ కార్యాలయం పూర్తిగా ధ్వంసం కావడం గమనార్హం.

బుల్డోజర్లు తీసుకొచ్చిన వారి చేతుల్లో బీజేపీ, ఆర్ఎస్ఎస్ జెండాలు కన్పించడం చర్చనీయాంశమైంది. ఈ సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. కూల్చివేత దృశ్యాలను టీఎంసీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. ''బీజేపీ పరివర్తన్ మొదలైంది. ఈ మార్పు బుల్డోజర్‌తో వచ్చింది. బీజేపీ కార్యకర్తలు వీధుల్లోకి వెళ్లి దాడులకు పాల్పడేందుకు ఆ పార్టీ అధిష్టానం వారికి లైసెన్స్ ఇచ్చినట్లు ఉంది. ఈ రోజు దుకాణాలు, ఆఫీసులను కూలుస్తున్నారు. రేపు రాజకీయ ప్రత్యర్థులనూ వదిలిపెట్టరేమో..!'' అని టీఎంసీ మండిపడింది. కోల్‌కతాతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ ఘర్షణలు చెలరేగాయి. బిజోయ్‌గఢ్‌లో తృణమూల్ అభ్యర్థికి చెందిన కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. ఆర్జీకర్ హత్యాచార బాధితురాలి తల్లి గెలిచిన పానిహటీలో తృణమూల్ కార్యాలయాన్ని దుండగులు ధ్వంసం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కీలక ఆదేశాలు జారీ చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు భద్రతను మోహరించాలని పేర్కొన్నారు. ఉద్రిక్తతలకు పాల్పడే వారిని తక్షణమే అరెస్టు చేయాలని ఆదేశించారు.

## ఐప్యాక్‌తో సంబంధాలు తెంచుకున్నాం

- **సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్**

**లఖ్‌నవూ, మే 6:** రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ ఐ ప్యాక్‌తో సంబంధాలు తెంచుకున్నట్లు సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ప్రకటించారు. నిధుల కొరతే దీనికి కారణమని వెల్లడించారు. ఈ సంస్థ ఇటీవల పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో టీఎంసీకి సేవలందించింది. ఎన్నికల ఫలితాలు వెలువడిన కొద్ది రోజులకే అఖిలేశ్ ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ''వచ్చే ఏడాది ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఐప్యాక్‌తో గతంలో ఒప్పందం కుదుర్చుకున్నాం. వారు మాతో కొన్ని నెలలు పనిచేశారు. అయితే, నిధుల కొరతతో దాన్ని కొనసాగించలేకపోతున్నాం'' అని ఓ మీడియా సమావేశంలో అఖిలేశ్ యాదవ్ తెలిపారు. బెంగాల్ వంటి రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాల ప్రభావంతో ఈ ఒప్పందం రద్దు చేసుకున్నారంటూ వచ్చిన ఊహాగానాలను ఆయన తోసిపుచ్చారు. బెంగాల్లో ఎన్నికల నిర్వహణ తీరును ప్రశ్నిస్తూ.. దీన్ని సుప్రీంకోర్టు తక్షణమే సుమోటోగా స్వీకరించాలని అఖిలేశ్ కోరారు. ఓట్ల లెక్కింపు వీడియో రికార్డింగ్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. బెంగాల్లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు.. వచ్చే ఏడాది యూపీ ఎన్నికల సమయంలో పునరావృతమయ్యే అవకాశం ఉందని, ఎన్నికల మాఫియా కలిసికట్టుగా పనిచేస్తుందని ఆరోపించారు.





## టెక్సాస్‌లో కాల్పులు.. ఇద్దరి మృతి

### ముగ్గురికి గాయాలు

**టెక్సాస్, మే 6:** అమెరికాలోని టెక్సాస్‌లో కాల్పుల ఘటన కలకలం రేపింది. కారోల్టన్‌లోని 'కె టౌన్ ప్లాజా' షాపింగ్ సెంటర్‌లో దుండగుడు కాల్పులు జరపడంతో ఇద్దరు మృతిచెందారు. మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వ్యాపార లావాదేవీల గురించి చర్చిస్తుండగా ఉద్దేశపూర్వకంగానే దుండగుడు కాల్పులు జరిపినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

## భారతీయ నౌక సిబ్బందికి పాక్ సాయం!



**ఇస్లామాబాద్, మే 6:** అరేబియా సముద్రంలో చిక్కుకు పోయిన భారతీయ నావికాసిబ్బందికి పాకిస్థాన్ నౌకాదళం మానవీయ సాయం అందించినట్టు తెలిసింది. ఈ సహాయ చర్యల్లో పాకిస్థాన్ సముద్ర భద్రతా సంస్థ పాల్గొన్నట్టు రక్షణ శాఖ వర్గాలు తెలిపాయని ''డాన్''పత్రిక వెల్లడించింది. ముంబయిలోని సముద్ర సహాయ సమన్వయ కేంద్రం చేసిన అభ్యర్థన మేరకు ఆరుగురు భారతీయులను, ఒక ఇండొనేసియన్ జాతీయుణ్ని పీఎంఎస్ఏ కాపాడిందని పాక్ నౌకాదళం పేర్కొన్నట్టు పత్రిక వెల్లడించింది. ఒమన్ నుంచి భారత్ వైపు వెళ్తున్న ఎంవీ గౌతమ్ అనే నౌకలో సాంకేతిక సమస్యలు తలెత్తాయని సిబ్బంది పేర్కొన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. భారత నౌకా సిబ్బందికి అత్యవసర సాయంగా పీఎంఎస్ఏ ఆహారం, ఔషధాలు, సాంకేతిక సాయం అందించిందని పత్రిక వెల్లడించింది.

# సంజు కొడితే.. గెలిచినట్లే!

**6, 7, 9, 7, 11.. చెన్నైసూపర్ కింగ్స్‌కు ఓటమి**

**115, 48, 101, 87 నాటౌట్.. చెన్నైసూపర్ కింగ్స్ కు అద్భుత విజయాలు**



పైన పేర్కొన్న గణాంకాలు సంజు శాంసన్ వి. అతడు నిలబడి కొడితే సీఎస్కేకు విజయం ఖాయమనే భరోసా అభిమానుల్లో కల్పించాడు. మూడుసార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను సొంతం చేసుకున్నాడు. ఐపీఎల్ 2026 సీజన్ లో చెన్నై 10 మ్యాచులు ఆడింది. ఐదు విజయాలు నమోదు చేసింది. మరో ఐదింట్లో ఓడిపోయింది. ఆ గెలిచిన ఐదు మ్యాచుల్లో సంజు శాంసన్ ప్రభావం ఏపాటిదో అతడి స్కోర్లను చూస్తేనే అర్థమవుతోంది.

తొలుత ప్లేఆఫ్స్ రేసులో చాలా వెనుకబడిన సీఎస్కే.. ఇప్పుడు ముందుకు దూసుకురావడంలో సంజుదే కీలక పాత్ర. మరోవైపు కెప్టెన్ రుతురాజ్ అప్పుడప్పుడు మెరుస్తున్నా.. నిలకడ కొరవడింది. కానీ, మొదట్లో ఇబ్బందిపడిన సంజు మాత్రం నిలదొక్కుకున్నాక వెనక్కి తిరిగిచూడలేదు. ఇప్పటికే రెండు సెంచరీలు చేసిన సంజు.. మూడోది చేసే అవకాశం వచ్చినా జట్టు కోసం కాస్త వెనక్కి తగ్గాడు. తాజాగా దిల్లీపై విజయం అనంతరం అతడు చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ నూ మెప్పించడం గమనార్హం.

**'సంజు' అని..**

ఈ సీజన్ లో దిల్లీపై సీఎస్కే రెండు మ్యాచుల్లోనూ గెలిచింది. సంజు శాంసన్ సెంచరీ, హాఫ్ సెంచరీ చేసి సత్తా చాటాడు. ఇక్కడ మరో శతకం చేసే అవకాశం వచ్చింది. అయితే, మరో ఎండ్ లో కార్తిక్ శర్మ దూకుడుగా ఆడేశాడు. దీంతో 87 పరుగులతో సంజు అజేయంగా నిలిచాడు. ఈ సందర్భంగా వ్యాఖ్యాత అడిగిన ప్రశ్నకు ఇచ్చిన సమాధానం ఆకట్టుకుంది. శతకం చేయడం స్పెషలే అయినా.. అందుకోసం తాను స్వార్థపరుడిగా మారాల్సి వచ్చేదని బదులిచ్చాడు. దీనిపై క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ ప్రశంసల వర్షం కురిపించాడు. అందరూ 'అన్న (చేట)' అని పిలుస్తుంటారు కదా.. ఆ పిలుపు ఎలా ఉంటుందనే ప్రశ్నకు బదులిచ్చాడు. తనకు చేట అని కాకుండా.. 'సంజు'గా పిలుపించుకోవడమే ఇష్టమని వినమ్రంగా సమాధానం ఇచ్చాడు.

**ఎక్కడా తొందరపడకుండా..**

తొలి మూడు మ్యాచుల్లో సంజు శాంసన్ కేవలం సింగిల్ డిజిట్ కే పరిమితమయ్యాడు. దీంతో అతడిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. భారీ మొత్తం వెచ్చించినా సరైన ప్రతిఫలం ఇవ్వడం లేదని విమర్శించారు. కానీ, గత టీ20 ప్రపంచ కప్ లోనూ సంజు నుంచి ఇలాంటి 'స్లో స్టార్ట్'ను చూశాం. ఆ తర్వాత చెలరేగిపోయి 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ'గా నిలిచాడు. ఇప్పుడు కూడా సేమ్ ఫార్ములా. భారీ ప్రైస్ ట్యాగ్ తోపాటు ధోని వారసుడంటూ వచ్చిన ఒత్తిడిని అధిగమించాడు. ఇంతకుముందు వచ్చీ రాగానే భారీ షాట్లకు పోయి వికెట్ సమర్పించేవాడు. ఇప్పుడు అలా కాదు.. పరిస్థితిని బట్టి ఆడటం మొదలుపెట్టాడు. ఓ సందర్భంలో 'గేమ్ ఎలా ఆడాలో పరిస్థితులే నేర్పిస్తాయి' అని సంజు అన్న మాటలు గుర్తున్నాయి కదా.

ఐపీఎల్ లో సీఎస్కే తరఫున ఇప్పటివరకూ ఎవరూ రెండు సెంచరీలు చేయలేదు. కానీ, సంజు ఆ ఘనతను సాధించాడు. క్రీజ్ లో తాను ఉండటం ఎంత ముఖ్యమో తెలుసుకున్నాడు. ఒక్కసారి కుదురుకున్నాక బ్యాట్ ను ఝుళిపించేశాడు. మైదానంలో ప్రత్యర్థి ఆటగాళ్లపై ఇప్పటివరకు దురుసుగా వ్యవహరించిన దాఖలాలూ లేవు. మైదానంలోనే కాదు.. డగౌట్ లోనూ ప్రశాంతంగానే ఉంటాడు.

**ఆ నాలుగు మ్యాచుల్లోనూ..**

ప్రస్తుత సీజన్ లో సీఎస్కే మరో నాలుగు మ్యాచులు ఆడాల్సిఉంది. ప్రస్తుతం 10 పాయింట్లతో పట్టికలో ఆరో స్థానంలో నిలిచింది. ప్లేఆఫ్స్ కు చేరుకోవాలంటే కచ్చితంగా మూడు మ్యాచుల్లో విజయం సాధించాలి. అన్నీ గెలిస్తే మాత్రం నాకౌట్ బెర్తు ఖాయమయ్యే అవకాశాలు ఎక్కువ. ఇలా జరగాలంటే సంజుశాంసన్ ఇదే ఆటతీరు ప్రదర్శించాలి. ఎంఎస్ ధోని ఈ సీజన్ లో కనీసం ఒక్క మ్యాచ్ లోనైనా ఆడతాడా? అంటే చెప్పలేని పరిస్థితి. కాబట్టే సంజు పైనే సీఎస్కే భారం.

# ఐపీఎల్ 2026.. మూడు వేదికల్లో ప్లేఆఫ్స్..

ఐపీఎల్ 2026 సీజన్ కు సంబంధించి ప్లేఆఫ్స్ మ్యాచుల వేదికలను బీసీసీఐ ఖరారు చేసింది. అలాగే ఫైనల్ కు బెంగళూరు కాకుండా.. అహ్మదాబాద్ ను వేదికగా చేస్తూ ప్రకటనను విడుదల చేసింది. ఈసారి దక్షిణ భారతంలో ఒక్క నాకౌట్ మ్యాచ్ నిర్వహణకు కూడా అవకాశం లేకుండా పోయింది. ప్లేఆఫ్స్ మ్యాచులకు రెండు వేదికలను మాత్రమే కేటాయించింది. మే 24తో లీగ్ స్టేజ్ లు ముగుస్తాయి. ఆ తర్వాత రెండు రోజుల అనంతరం నాకౌట్ మ్యాచులు మొదలవుతాయి. ''ఫైనల్ మ్యాచ్ కు బెంగళూరును తొలుత నిర్ణయించారు. అయితే, మా నిర్దేశిత మార్గదర్శకాలు, నిబంధనల పరిధికి లోబడేలా లోకల్ అసోసియేషన్, అధికారుల రిక్వైర్ మెంట్స్ లేకపోవడంతో వేదికను మార్చడం జరిగింది'' అని బీసీసీఐ పేర్కొంది.

పాయింట్ల పట్టికలో టాప్-4లో ఉన్న జట్లు ప్లేఆఫ్స్ లో తలపడతాయి. తొలి రెండు స్థానాల్లో జట్లు మొదటి క్వాలిఫయర్స్ ఆడతాయి. అందులో గెలిచిన జట్టు ఫైనల్కు చేరుకుంటుంది. ఓడిన టీమ్ కు మరో అవకాశం ఉంది. మూడు, నాలుగు స్థానాల్లో ఉండే జట్లు ఎలిమినేటర్ లో తలపడతాయి. అందులో గెలిచిన జట్టు రెండో క్వాలిఫయర్ కు అర్హత సాధిస్తుంది. క్వాలిఫయర్ -1లో ఓడిన జట్టుతో ఎలిమినేటర్ విజేత ఢీకొడుతోంది. ఇందులో గెలిచిన జట్టు ఫైనల్ కు చేరుకుంటుంది. అక్కడ ఎవరైతే విజయం సాధిస్తారో ఐపీఎల్ కప్పు వారి సొంతమవుతుంది.



**ఇదీ షెడ్యూల్**

- క్వాలిఫయర్ -1 : ధర్మశాల వేదికగా మే 26న
- ఎలిమినేటర్: చండీగఢ్ వేదికగా మే 27న
- క్వాలిఫయర్ -2 : చండీగఢ్ వేదికగా మే 29న
- ఫైనల్ మ్యాచ్: అహ్మదాబాద్లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా మే 31న

# మొత్తానికి నితిన్ మరో కొత్త సినిమా

మన టాలీవుడ్ యూత్ స్టార్ నితిన్ హీరోగా సాలిడ్ హిట్ కొట్టాలని చూస్తున్నాడు. తన గత చిత్రం తమ్ముడు డిజప్పాయింట్ చేయడంతో నెక్స్ట్ సినిమాల కోసం అభిమానులు ఎదురు చూడడం మధ్యలో నితిన్ పలు సినిమాలు వదిలేయడం కూడా జరిగిపోయాయి. అయితే ఫైనల్ గా నితిన్ నుంచి ఈ ఏడాదిలో రెండో కొత్త సినిమా ఇప్పుడు అధికారికంగా ముహూర్త కార్యక్రమాలతో లాంఛ్ అయ్యింది.



నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలుగా సోమశేఖర్, నారి సిరిస్వాద అనే కొత్త దర్శకులతో నేడు మేకర్స్ ముహూర్త కార్యక్రమాలతో సినిమాని లాంచ్ చేసిన ఫోటోలు ఇపుడు వైరల్ గా మారాయి. అంతే కాకుండా యంగ్ హీరోయిన్ రితికా నాయక్ కూడా ఇందులో పాల్గొనడంతో హీరోయిన్ ఎవరు అనేది కూడా తెలిపోయింది. ఇక ఈ చిత్రాన్ని మేకర్స్ ఈ మే రెండో వారం నుంచే పట్టాలెక్కినున్నట్టు కూడా ఖరారు చేశారు. మరి ఇంత గ్యాప్ తర్వాత నితిన్ ఎలాంటి ట్రీట్ అందిస్తాడో చూడాలి.

# దేవిశ్రీకి జోడీగా మృణాల్ ఠాకూర్!



సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ ప్రధాన పాత్రలో 'బలగం' ఫేం వేణు ఎల్దండి తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఎల్లమ్మ'. ప్రముఖ నిర్మాత దిల్ రాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఓ తాజా అప్ డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో కథానాయికగా మృణాల్ ఠాకూర్ నటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

గతంలో దేవిశ్రీకి జోడీగా సాయి పల్లవి, కీర్తి సురేశ్ నటిస్తారని జోరుగా ప్రచారం జరిగింది. ఇప్పుడు తెర పైకి మృణాల్ పేరు వచ్చింది. ప్రస్తుతం మేకర్స్ ఆమెతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఒకవేళ ఆమె ఈ ప్రాజెక్ట్ కు గ్రీన్ సిగ్నల్ ఇస్తే, సినిమాపై అంచనాలు మరింత పెరుగుతాయి. మొదట 'ఎల్లమ్మ'లో హీరోలుగా నాని, నితిన్ పేర్లు వినిపించినప్పటికీ, చివరికి ఈ విభిన్నమైన పాత్ర కోసం డీఎస్పీని ఎంపిక చేశారు. ఈ సినిమాకు దేవిశ్రీనే స్వరాలు అందిస్తున్నారు. ఇప్పటికే సంక్రాంతికి విడుదలైన ఫస్ట్ గ్లింప్స్ ప్రేక్షకుల్లో అంచనాలు పెంచింది. త్వరలోనే ఇందులోని హీరోయిన్ కు సంబంధించిన అధికారిక ప్రకటన రానుంది.



# 'లెనిన్'.. ఆసక్తిగా భాగ్యశ్రీ స్పెషల్ పోస్టర్



'లెనిన్'లో అఖిల్ తో కలిసి సందడి చేయడానికి సిద్ధమవుతున్నారు నటి భాగ్యశ్రీ బోర్సే. అఖిల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్నారు. నేడు భాగ్యశ్రీ పుట్టినరోజు సందర్భంగా టీమ్ ఓ స్పెషల్ పోస్టర్ తో ఆమెకు శుభాకాంక్షలు తెలిపింది. ఈ సినిమాలో ఆమె భారతి అనే పాత్రలో అలరించనున్నారు. తాజాగా పంచుకున్న పోస్టర్ లో ఆమె పౌరాణిక లుక్ లో రాచరికపు దుస్తులు, భారీ ఆభరణాలు ధరించి కనిపించారు. తీక్షణమైన చూపులతో ఉన్న ఈ పోస్టర్ చూస్తుంటే ఆమె పాత్ర చాలా శక్తిమంతంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఈ సినిమా వాయిదా పడనుందంటూ వార్తలు రాగా నాగార్జున తన పోస్ట్ తో వాటిని ఖండించారు. అనుకున్న తేదీ ప్రకారం జూన్ 26న ఈ సినిమా విడుదల కానున్నట్లు స్పష్టం చేశారు. ఇందులో కొత్త అఖిల్ ను చూస్తారని హామీ ఇచ్చారు. తాను ఫస్ట్ కట్ చూశానని అది చూశాకే నమ్మకంతో చెబుతున్నానన్నారు. చిత్తూరు నేపథ్యంలో సాగే కథ ఇది. బలమైన భావోద్వేగాలు, ఆసక్తిని రేకెత్తించే కథనంతో ప్రేక్షకులకు మంచి అనుభూతిని పంచేలా 'లెనిన్'చిత్రం రూపుదిద్దుకొంటోంది.

# క్రేజీ సీక్వెల్‌లో ఆలియా



కల్ట్ క్లాసిక్ చిత్రం 'తుంబాడ్' సీక్వెల్ లో బాలీవుడ్ స్టార్ ఆలియా భట్ కీలక పాత్ర పోషించనుంది. స్క్రిప్ట్ నచ్చడంతో ఆమె ఈ ప్రాజెక్ట్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సుమారు 20 రోజుల పాటు షూటింగ్ లో పాల్గొననున్న ఆమె పాత్ర, కథలో వచ్చే మేజర్ ట్విస్ట్ కు కేంద్రబిందువుగా ఉంటుందని సమాచారం.

ఈ పాత్ర కేవలం రెండో భాగానికే కాకుండా, 'తుంబాడ్ 3'కి కూడా పునాది వేయనుంది. మేకర్స్ ఈ చిత్రాన్ని దాదాపు రూ. 100 కోట్ల భారీ బడ్జెట్ తో తెరకెక్కిస్తున్నారు. ఆలియా రాకతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి, ఇది ట్రేడ్ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది.

ప్రస్తుతం ఆలియా 'లవ్ అండ్ వార్' షూటింగ్లో బిజీగా ఉండగా, త్వరలోనే తుంబాడ్ సెట్స్లో చేరనుంది. మొదటి భాగం రీ-రిలీజ్ సాధించిన విజయం, ఇప్పుడు ఆలియా క్రేజ్ తోడవ్వడం ఈ సీక్వెల్కు ప్లస్ పాయింట్ కానుంది. అయితే, కథలో ఒరిజినల్ సినిమా ఆత్మను కోల్పోకుండా ఉండటమే దీని విజయానికి కీలకం.

MOVIE ARTISTES' ASSOCIATION

## పేరు మార్చి నటులను మోసం చేస్తూ..

# ఖండించిన 'మా'

తమ అసోసియేషన్ పేరులో మార్పులు చేసి, కొందరు మోసాలకు పాల్పడుతున్నారన్నది తమ దృష్టికి వచ్చిందన్న మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్.. ఈ చర్యను తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. **AP MAA, MAA AP** పేర్లతో కన్ఫ్యూజ్ చేస్తూ నటులు, ప్రజలను మోసగాళ్లు తప్పుదోవ పట్టిస్తున్నట్లు పేర్కొంది. 'మా'తో సంబంధం ఉందని నమ్మిస్తూ.. నటుల నుంచి అక్రమంగా డబ్బు వసూలు చేస్తున్నారనే సమాచారం కూడా అందిందని తెలిపింది. ఇలాంటి సంఘటనలు ఎదురైతే హైదరాబాద్ లోని ఫిల్మ్‌నగర్ 'మా' ఆఫీసులో తెలియజేయాలని కోరింది. తమకు ఎలాంటి అనుబంధ అసోసియేషన్లు లేవని ఈ సందర్భంగా స్పష్టం చేసింది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151, And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.